అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
గురువారం 18-1-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 330 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

## కోలుకుంటున్న తమ్మినేని
### ఆందోళన అవసరం లేదు


ఏఐజీ ఆస్పత్రివద్ద మీడియాతో మాట్లాడుతున్న బివి రాఘవులు

- ఏఐజీ డాక్టర్ల బృందం నిరంతర పర్యవేక్షణ
- హైదరాబాద్‌కు సందర్శకులు రావొద్దు : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు
- డిప్యూటీ సీఎం సహా పలువురి పరామర్శ

వివరాలు 3లో..

## ఇతర ప్రాంతాలు ఎంతో ఈశాన్యమూ అంతే
- భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ



వివరాలు 11లో..

## సీట్ల సర్దుబాటులో సమస్యల్లేవు
### ఆర్జేడీ, జేడీయూ ప్రకటన
- విభేదాలు బీజేపీ సృష్టేనని ఆగ్రహం



వివరాలు 2లో..

## సాగర్‌కు సీఆర్‌పీఎఫ్ భద్రత కొనసాగింపు
- బోర్డు పరిధిలోకి ప్రాజెక్టుల నిర్వహణ
- ఏపీ, తెలంగాణ అంగీకారం
- సాంకేతికాంశాలపై మరోసారి భేటీ




వివరాలు 3లో..

# కార్పొరేట్లే కారణం
## పేదరికం, అసమానతలపై ఆక్స్‌ఫామ్ నివేదిక
- పెరుగుతున్న సంపన్నుల ఆదాయం
- కడు పేదరికంలోకి 60శాతం జనాభా

ప్రపంచంలో అత్యంత ధనవంతులైన ఐదుగురి సంపద 2020 నుండి రెట్టింపునకు పైగా పెరిగింది. అదే సమయంలో 4.8 బిలియన్ల మంది... అంటే జనాభాలో 60శాతం మంది మరింత పేదలుగా మారారు. ఈ లెక్కన చూస్తే ప్రపంచంలో ఏ ఒక్కరూ పేదరికంతో బాధపడకుండా ఉండాలంటే 229 సంవత్సరాలు పడుతుంది. ఈ మేరకు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ప్రచురించిన నివేదికను దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా విడుదల చేశారు. 'ఈ అంతరాలను మేం గమనిస్తున్నాం. కోవిడ్, ద్రవ్యోల్బణం, యుద్ధం వంటి ప్రతికూల పరిణామాలతో కోట్లాది మంది ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు బిలియనీర్ల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. అసమానత అనేది యాధృచ్ఛికం కాదు. కార్పొరేట్ సంస్థలు అందరి ప్రయోజనాలను ఫణంగా పెట్టి మరింత సంపదను తమకు అందజేయాలని సంపన్న వర్గం కోరుకుంటుంది' అని ఆక్స్‌ఫామ్ తాత్కాలిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ ఓ ప్రకటనలో తెలిపారు.





**న్యూఢిల్లీ :** అభివృద్ధి చెందిన దేశాలకు, వర్ధమాన దేశాలకు మధ్య అసమానతల వ్యత్యాసం విపరీతంగా పెరిగింది. ప్రపంచ సంపదలో 69శాతం అభివృద్ధి చెందిన దేశాల వద్దే ఉంది. అలాగే బిలియనీర్ల సంపదలో కూడా 74శాతం ఆ దేశాలదే. ఒకప్పుడు సంపద వలసవాద, సామ్రాజ్యవాద దేశాలకే పరిమితమై ఉండేది. అయితే ఇప్పుడు వలసవాదం అంతరించిపోవడంతో వర్ధమాన దేశాలతో నయా వలసవాద సంబంధాలు మొదలయ్యాయి. దీంతో ఆర్థిక అసమానతలు శాశ్వతంగా అలాగే ఉండిపోయాయి. సంపన్న దేశాలకు అనుకూలంగా ఆర్థిక నిబంధనలు రూపొందాయి. బహుళజాతి కార్పొరేట్ సంస్థలు సంపదను సృష్టించి, సంపన్నులకే అందిస్తున్నాయి. ఇదిలా ఉండగా అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం అసమానతలు తిరిగి ప్రారంభమయ్యాయి. అట్టడుగు వర్గాలు, జాతుల సమూహాలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాయి.

### కార్పొరేట్ శక్తుల దురాశే కారణం
కార్పొరేట్ సంస్థల దురాశ అసమానతలకు దారి తీస్తోంది. ప్రపంచంలోని పది అతి పెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఏడు ...11లో

### చాలీచాలని ఆదాయంతో...
ప్రపంచంలో మెజారిటీ ప్రజలు సురక్షితం కాని, అనిశ్చిత పరిస్థితుల్లో గంటల తరబడి పనిచేస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో బతుకులు నెట్టుకొస్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా 79.1 కోట్ల మంది కార్మికులు మెరుగైన వేతనాలు పొందలేకపోయారు. గత రెండు సంవత్సరాల కాలంలో వారు 1.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయారు. ఇది ప్రతి కార్మికుడికి ఇరవై ఐదు రోజుల వేతనానికి సమానమని ఆక్స్‌ఫామ్ తెలిపింది. ధనికుల సంపద, కార్మికుల వేతనాల మధ్య వ్యత్యాసం బాగా పెరిగిపోతోంది. ఆరోగ్య, సామాజిక రంగాల్లో పనిచేస్తున్న ఓ మహిళా కార్మికురాలు 1,200 సంవత్సరాల్లో సంపాదించే మొత్తాన్ని ఓ ఫార్చ్యూన్ 100 కంపెనీ సీఈఓ కేవలం ఒకే ఒక్క సంవత్సర కాలంలోనే సంపాదిస్తాడు.

## కేరళలో తొలిసారిగా పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగ పీఠిక




**తిరువనంతపురం :** కేరళలో మొదటిసారిగా, సవరించిన స్కూలు పాఠ్యపుస్తకాల్లో దేశ రాజ్యాంగ పీఠిక చేర్చనున్నారు. పిల్లల మనసులోకి రాజ్యాంగ విలువలను పాదుకొల్పేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో దీన్ని చేర్చాలని సిపిఎం నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. రాష్ట్ర సిలబస్ కమిటీ ఛైర్మన్ కూడా అయిన విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. 1, 3, 5, 7, 9 తరగతులకు 173 కొత్త పాఠ్యపుస్తకాలను రాష్ట్ర సిలబస్ సారధ్య కమిటీ ఇటీవల ఆమోదించింది. దశాబ్ద కాలం తర్వాత పాఠ్యపుస్తకాల సిలబస్‌లో సంస్కరణలు ...11లో

# రాష్ట్రంపై పెట్టుబడిదారుల ఆసక్తి
## వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ...
- రూ.2 వేల కోట్లతో తెలంగాణలో ఆరాజెన్ విస్తరణ
- గ్రీన్‌ఫీల్డ్ డేటాసెంటర్ ఏర్పాటుకు వెబ్ వెర్క్స్ అంగీకారం
- రూ.12,400 కోట్లతో ఆదానీ గ్రూప్ ఒప్పందాలు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**
దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు వేదికగా రాష్ట్రానికి పెట్టుబడుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వివిధ అంతర్జాతీయ సంస్థలు, కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో భేటీ అవుతున్న ముఖ్యమంత్రి... తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందనే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళుతున్నారు. తద్వారా వారిని ఒప్పించి, మెప్పిచటం ద్వారా రకరకాల ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఆయా కంపెనీలు ముందుకొస్తున్నాయి. తాజాగా ఔషదాల ఆవిష్కరణ, అభివృద్ధి సేవలను విస్తరించేందుకు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులకు ముందుకొచ్చింది. రూ.2 ...2లో

# వంద రోజులు కాలేదని ఆగుతున్నాం..
## లేకుంటే కాంగ్రెస్‌ను చీల్చి చెండాడే వాళ్లం
- కార్యకర్తల అభిప్రాయాల మేరకే పార్టీ : మాజీ మంత్రి హరీశ్ రావు




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**
కార్యకర్తలు ఏది కోరుకుంటున్నారో రాబోయే రోజుల్లో అదే జరుగుతుందనీ, వారి అభిప్రాయం మేరకే పార్టీ పని చేస్తుందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చి 45 రోజులే అయిందనీ, లేకుంటే కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఆ పార్టీని చీల్చి చెండాడే వారమని తెలిపారు. ఓటమి నుంచి తేరుకుని నెల రోజులకే సమావేశాలు నిర్వహిస్తున్నామనీ, ఇప్పటికే 11 సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడానికి బలమైన కారణాలు ఉండనక్కర్లేదనీ, సోషల్ మీడియా దుష్ప్రచారాల కాలంలో అందుకు ప్రజలకు పనికొచ్చే అంశాలు కూడా ఉండనక్కర్లేదని ...11లో

## ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె,గ్రామీణ బంద్




### కార్పొరేట్, మతతత్వ విధానాలను తిప్పికొట్టాలి
- కేంద్ర,రాష్ట్ర,కార్మిక, ఉద్యోగ సంఘాల రాష్ట్ర సదస్సు పిలుపు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతిఒక్కరూ పూనుకోవాలనీ, ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణబంద్‌ను జయప్రదం చేయడంలో భాగంగా మోడీ ప్రభుత్వ వైఫల్యాలను లక్షలాది కుటుంబాలకు చేరేలా ప్రచారం చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. జనవరి 26న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతో కలసి జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, మోటర్ బైక్ ర్యాలీలు నిర్వహించాలనీ, జనవరి 30 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో ఐక్య సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాయింట్ ప్లాట్ ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూటీయూసీ), వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. దీనికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డీ యూసుఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయకుమార్ యాదవ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, కె. నర్సయ్య, అంజాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, ...11లో



## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మహేశ్ కుమార్, బల్మూరి వెంకట్
### ప్రకటించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**
ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసే ఇద్దరు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ పేర్లను పార్టీ చీఫ్ ఖర్గే ఆమోదించినట్టు అందులో పేర్కొన్నారు.

- అద్దంకి దయాకర్‌కు షాక్

మొదటి నుంచి పార్టీ సీనియర్ నేత అద్దంకి దయాకర్ పేరు ప్రముఖంగా వినిపించింది. మంగళవారం నాడు పార్టీ పెద్దలు సైతం అద్దంకి దయాకర్‌కు ఫోన్ చేసి నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. దీంతో ఆయన అనుచరులు సంబరాలు చేసుకున్నారు. చివరి నిమిషంలో అధిష్టానం ఆయనకు షాక్ ఇచ్చింది. కొంత మంది సీనియర్ నేతలు, మంత్రులు కూడా అద్దంకికి ఎమ్మెల్సీ పదవి రాకుండా అడ్డుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. కాగా.. గురువారం(18)తో నామినేషన్ల ప్రక్రియ ముగియబోతున్నది. అయితే ...11లో

### హైకోర్టు తీర్పు తర్వాతే..
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కీలక నిర్ణయం

వివరాలు 3లో..



# ధరణి లోపాల పుట్ట
## సమస్యల పరిష్కారానికి కసరత్తు
- నిపుణులతో పాటు పార్టీల అభిప్రాయాలు కోరతాం : ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**
ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన కమిటీ సమావేశ వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. భూముల రికార్డుల సవరణ పేరుతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పోర్టల్‌లో ఉన్న 33 సమస్యలు ఆరేండ్లలో వందకు పైగా చేరాయని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం మేమడిగిన సమాచారాన్ని ఈ రోజు జరిగిన సమావేశంలో సీసీఎల్‌ఏ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారని వెల్లడించారు.

కమిటీపై పెద్ద బాధ్యత ఉందనీ, పొరపాటు జరిగితే రైతాంగానికి మళ్లీ ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నందున ఆచితూచి అడుగు వేస్తున్నామని చెప్పారు. నిపుణులతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్టు తెలిపారు. ధరణి స్థానంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రపోజల్‌పై అధ్యయనం చేయనున్నట్టు చెప్పారు. ఏండ్లుగా పెండింగ్‌లో భూసమస్యలను పరిష్కరించేందుకు తమ కమిటీ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నెల 22న సీసీఎల్‌ఏ జరిగే భేటీ తరువాత పూర్తి వివరాలు వెల్లడిసామన్నారు.

## గుడిసెవాసులపై అక్రమ కేసులు ఎత్తేయాలి



### గత సర్కారు మోసంతోనే కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించారు
- ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- కరీంనగర్ జైలులో నాయకులను పరామర్శించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం
- జగిత్యాలలో పేదలు, కార్యకర్తలతో సమావేశం

**నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/జగిత్యాల టౌన్**
'జగిత్యాల జిల్లాలో ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారిపైనా.. వారికి అండగా నిలిచిన నాయకులపైనా అక్రమంగా నమోదు చేసిన కేసులను బేషరతుగా ఎత్తేయాలి. రిమాండ్‌కు పంపిన వారిని వెంటనే విడుదల చేయాలి' అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య డిమాండ్ చేశారు. కరీంనగర్ జైలులో ఉన్న నాయకులను, గుడిసెవాసులను బుధవారం ఉదయం నాగయ్య సహా రాష్ట్ర, జిల్లా నాయకులు పరామర్శించారు. అనంతరం నగరంలోని ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడారు.

జగిత్యాలలో ఆర్నెల్లుగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భూపోరాటం సాగుతోందని, జిల్లా కేంద్ర శివారులోని ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న సర్కారు స్థలంలో నిలువనీడ లేని పేదలను సమీకరించి గుడిసెలు ...11లో

# రాష్ట్రంపై పెట్టుబడిదారుల ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)

వేల కోట్ల కొత్త పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ కంపెనీ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా 1,500 కొత్త ఉద్యోగాలను ఇచ్చేలా అది తన ప్రాజెక్టులను విస్తరించనుంది. రాష్ట్రంలోని మల్లాపూర్‌లో ప్రస్తుతమున్న సదుపాయాన్ని మరింత పెంచుకోవడానికి వీలుగా ఆ సంస్థ కొత్తగా పెట్టుబడులు పెడుతోంది. దీంతో ఆసియాలోనే ఔషధ పరిశ్రమకు హబ్‌గా పేరొందిన హైదరాబాద్ స్థానం ఆ రంగంలో మరింత సుస్థిరం కానుంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో భాగంగా ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో మణి కంటిపూడి... సీఎం రేవంత్‌తో బుధవారం భేటీ అయ్యారు. ఫార్మా రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఆ సంస్థ హైదరాబాద్‌లో భారీ పెట్టుబడికి ముందుకు రావటంపై సీఎం ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేండ్లలో తెలంగాణలో తమ సంస్థ పెట్టుబడులను, కార్యకలాపాలను ప్రకటించటం సంతోషంగా ఉందని మణి కంటిపూడి అన్నారు.

మరోవైపు తెలంగాణలో డేటా సెంటర్లను నెలకొల్పేందుకు వెబ్ వెర్క్స్ కంపెనీ రూ.5,200 కోట్ల పెట్టుబడులకు సిద్ధపడింది. డేటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఐరన్ మౌంటెన్ అనుబంధ సంస్థే వెబ్ వెర్క్స్. ముఖ్యమంత్రి రేవంత్ ఆ కంపెనీ సీఈవో విలియం మీనీ, వెబ్ వెర్క్స్ సీఈవో నిఖిల్ రాఠీతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటు, నిర్వహణపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా రూ.5,200 కోట్ల పెట్టుబడులకు వెబ్ వెర్క్స్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో 10 మెగావాట్ల నెట్ వర్కింగ్-హెవీ డేటా సెంటర్‌లో ఇప్పటికే ఈ కంపెనీ రూ.1,200 కోట్లు పెట్టుబడిని పెట్టింది. దీనికి అదనంగా మరో రూ.4,000 కోట్లకు పైగా పెట్టుబడులతో రాబోయే సంవత్సరాల్లో గ్రీన్ ఫీల్డ్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ విస్తరించేందుకు తాజాగా ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో డేటా



సెంటర్ల ఏర్పాటును ముఖ్యమంత్రి స్వాగతించగా... రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయటం, దేశంలో తమ డేటా సెంటర్ కార్యకలాపాలను విస్తరించడంపై ఐరన్ మౌంటైన్ ఆనందం వ్యక్తం చేసింది.

### రూ.వెయ్యి కోట్లతో కెమికల్ ప్లాంట్‌కు గోద్రెజ్ ఆసక్తి...

దీంతోపాటు సీఎం రేవంత్... గోద్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రెజ్‌తో కీలక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అపారమైన అవకాశాలున్నాయని ఈ సందర్భంగా నాదిర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పామ్ ఆయిల్ మిషన్‌ను నడపడంలో గోద్రెజ్ ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నదని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లాలో మొదటి దశలో రూ. 270 కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మలేషియాకు చెందిన అతి పెద్ద పామాయిల్ కంపెనీ సిమ్ డార్బీతో గోద్రెజ్ జాయింట్ వెంచర్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్లతో కెమికల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు గోద్రెజ్ అంగీకరించింది. దీంతోపాటు స్కిల్ డెవలప్ మెంట్, రియల్ ఎస్టేట్, క్రీమ్‌లైన్ డెయిరీ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై కంపెనీ ప్రతినిధులు సీఎంతో చర్చించారు. ఈ సమావేశానికి పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు.

### రూ.8 వేల కోట్లతో గోడి ఇండియా భారీ ప్రాజెక్టు

గోడి ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ రాష్ట్రంలో గిగా స్కేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. అందుకు సంబంధించి రూ.8 వేల కోట్ల మేర భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్ట్ మొదటి దశలో ఆరు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆ కంపెనీ పేర్కొంది. ముందుగా 2.5 గిగావాట్ల కెపాసిటీ సెల్ అసెంబ్లింగ్ లైన్‌ను తయారు చేస్తారు. రెండో దశలో 10 గిగావాట్లకు దాన్ని విస్తరిస్తారు. ఒప్పందం సందర్భంగా గోడి ఇండియా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో మహేష్ గోడి... సీఎం రేవంత్‌తో పలు అంశాలపై చర్చించారు.

### త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ

### సీఎం రేవంత్ రెడ్డితో గౌతమ్ అదానీ భేటీ

వీటితోపాటు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు అదానీ గ్రూప్ ముందుకొచ్చింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో అదానీ గ్రూప్ చైర్మెన్ గౌతమ్ అదానీ, సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. మొత్తం రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అదానీ గ్రూప్ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. సీఎంతోపాటు మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో గౌతమ్ అదానీ, ఏరోస్పేస్, డిఫెన్స్ సీఈవో ఆశిష్ రాజ్‌వంశీ ఆయా ఒప్పందాలపై సంతకాలు చేశారు. అగ్రిమెంట్‌లో భాగంగా రాష్ట్రంలో అదానీ కంపెనీ గ్రీన్ ఎనర్జీ కింద 1,350 మెగావాట్ల సామర్థ్యంతో రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ. 5 వేల కోట్ల మేర పెట్టుబడి పెట్టనుంది. అదే అదానీ కంపెనీ రాష్ట్రంలోని చందన్‌వల్లిలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. 100 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు రూ.5 వేల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. ఇవిగాక అదానీ ఏరోస్పేస్, డిఫెన్స్ పార్క్‌లో కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, క్షిపణి అభివృద్ధి, తయారీ కేంద్రాలకు ఆ కంపెనీ రూ.వెయ్యి కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది.

మరోవైపు ప్రజా పాలనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను ఎంచుకున్న ప్రాధాన్యాల్లో ఒకటిగా చెబుతున్న స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై గౌతమ్ అదానీతో చర్చించారు. దీంతో యువతీ యువకుల నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని.. పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు అదానీ ఈ సందర్భంగా తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. త్వరలోనే 'ఇంటిగ్రేటేడ్ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని అన్నారు. పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అదానీ నిర్ణయాన్ని సీఎం స్వాగతించారు.

### రూ.9 వేల కోట్లతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్

జేఎస్ డబ్ల్యూ ఎనర్జీ అనుబంధ సంస్థ నియో ఎనర్జీ... రాష్ట్రంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడితో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జేఎస్ డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, ముఖ్యమంత్రితో సమావేశమై ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనేకాంశాలపై చర్చలు జరిపారు. ఈ కొత్త ప్రాజెక్ట్ 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని వివరించారు. వీటితోపాటు అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ రాష్ట్రంలో రూ.1,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను ఆ కంపెనీ ఏర్పాటు చేయనుంది.

# సీట్ల సర్దుబాటులో సమస్యల్లేవు

- ఆర్జేడీ, జేడీయూ ప్రకటన విభేదాలు బీజేపీ సృష్టేనని ఆగ్రహం

పాట్నా : బీహార్‌లో అధికారంలో ఉన్న మహా కూటమిలోని సంకీర్ణ భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో ఎలాంటి విభేదాలు, సమస్యలు లేవని ఆర్జేడీ, జేడీయూ పార్టీల నేతలు స్పష్టం చేశారు. ఈ రెండు పార్టీలు జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న విషయం తెలిసిందే. ఆర్జేడీ నేత, ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ తమ మధ్య విభేదాలు లేవని ప్రకటించారు. జేడీయూ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి విజయ్ కుమార్ చౌదరి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించి అధికార కూటమిలో భాగస్వామ్య పక్షాల మధ్య...ముఖ్యంగా కీలక పార్టీలైన ఆర్జేడీ, జేడీయూ మధ్య విభేదాలు పెరిగాయంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనిపై చౌదరి స్పందిస్తూ అంతా సజావుగా సాగుతోందని, అధికార కూటమి బలంగా ఉన్నదని చెప్పారు. 'ఈ కథనాలు, ఊహాగానాలు అన్నీ మీడియా సృష్టే. ఎలాంటి సమస్యలు లేవు' అని జేడీయూ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు సన్నిహితుడు అయిన చౌదరి వ్యాఖ్యానించారు. మహా కూటమిలో ఎవరికీ అసంతృప్తి లేదని కూడా ఆయన చెప్పారు. సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా ఖరారు చేయాలని, లేకుంటే ఎన్నికల అవకాశాలపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన వివరించారు. కాగా సంక్రాంతి పండుగ సందర్భంగా చౌదరి సోమవారం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవిల అధికార నివాసానికి వెళ్లి వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. తద్వారా మహా కూటమిలో విభేదాలు లేవని సంకేతాలు పంపారు. కూటమిపై మీడియాలో వస్తున్న వార్తల వెనుక బీజేపీ ప్రమేయం ఉన్నదని ఈ రెండు పార్టీలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాల్లో ఈ రెండు పార్టీలు కలిసి మెజారిటీ స్థానాల్లో పోటీ చేస్తాయని వార్తలు వస్తున్నాయి. కూటమిలో భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలకు మిగిలిన స్థానాలు వదిలిపెడతారని సమాచారం. బీహార్‌లో ఎన్డీఏని నిలువరించేందుకు ఈ రెండు పార్టీలు ఓ ఫార్ములాను కూడా రూపొందించాయి. దీని ప్రకారం రాష్ట్రంలో మొత్తం 40 లోక్‌సభ స్థానాలు ఉండగా ఆర్జేడీ, జేడీయూ కలిసి 16 లేదా 17, కాంగ్రెస్ 4-6, వామపక్షాలు 1-2 సీట్లకు పోటీ చేస్తాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో జట్టు కట్టి బరిలో దిగిన జేడీయూ 17 స్థానాల్లో పోటీ చేసి 16 చోట్ల గెలిచింది. ఈ కూటమి మొత్తంమీద 39 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్‌కు ఒక సీటు రాగా ఆర్జేడీకి ఒక్కటి కూడా అది కూడా దక్కలేదు.

# స్మార్ట్ ఫోన్‌పైనే ఎక్కువ సమయం..

- 14-18ఏండ్ల గ్రామీణ పిల్లల స్థితిగతులపై అసర్-2023 సర్వే నివేదిక విడుదల
- గతేడాదితో పోల్చితే మెరుగుపడని విద్యాప్రమాణాలు
- ఢిల్లీ కేంద్రంగా నివేదిక విడుదల

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి (శ్రీకాంత్ బండోజు)

ప్రతి యేడూ లాగే దేశవ్యాప్తంగా ఉన్న విద్యావార్షిక స్థితిగతులు -2023ను ప్రథమ్ ఆర్గనైజేషన్‌కు చెందిన అసర్ నివేదికను ఢిల్లీ కేంద్రంగా బుధవారం విడుదల చేశారు. ఈసారి ప్రత్యేకించి దేశంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 14-18ఏండ్ల విద్యార్థుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో సర్వే చేసింది. 26 రాష్ట్రాల్లో 28 జిల్లాలను ఎంచుకుని చేసిన సర్వేలో డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్‌ను ఎక్కువగా వినియోగిస్తున్న పిల్లలు వారి విద్యాప్రమాణాలు పెంపొందించుకోవడంలోనూ లెక్కలు, ఇంగ్లీష్ సహా మాతృభాషల్లో కనీస నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడంలోనూ ఇంకా వెనుకబడే ఉన్నారని తేల్చింది. కోవిడ్ తరువాత దిగజారిన ప్రాథమిక పాఠశాల విద్య ఈ నాలుగేండ్లలో పెద్దగా మెరుగుపడలేదని సర్వే చెబుతోంది. దాని ప్రభావమే 14-18ఏండ మధ్య వయసు పిల్లల్లో స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం.

దేశంలోని 26 రాష్ట్రాల్లో ఒక్కో జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుని 14-18 ఏండ్ల మధ్య వయసు ఉన్న గ్రామీణ విద్యార్థుల జీవన స్థితిగతులపై ప్రాథమిక అంశాలు, విద్యానివేదికకు సంబంధించి అసర్-2023 సర్వే చేసింది. ఇందుకు 28 జిల్లాల్లోని 1664 గ్రామీణ ప్రాంతాల్లోని 30,074 ఇండ్లలో 34,745 మంది విద్యార్థులను నేరుగా కలిసి పరిశీలించి తుది రిపోర్టును బుధవారం ఢిల్లీలో విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని 59 గ్రామాల్లో 14-16ఏండ్ల పిల్లలను 390, 17-18ఏండ్ల పిల్లలను 319 మందిని కలుపుకుని మొత్తం 709మందిని సర్వే చేసింది

### స్మార్ట్‌ఫోన్‌తో సమయం వృథా

దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిలోనూ స్మార్ట్‌ఫోన్ వాడుతుండగా.. 14-18ఏండ్లలో పిల్లలకు సొంతంగానే స్మార్ట్‌ఫోన్లు కలిగి ఉన్నారు. ఇందులో మగపిల్లలు 43.7శాతంగా ఉంటే ఆడపిల్లలు 19.8శాతంలోపు ఉన్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంలో ఎక్కువగా సినిమాలు చూడటం, పాటలు వినడం, ఆన్‌లైన్‌గేమ్స్ సహా వినోదానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్టు అసర్ సంస్థ తేల్చింది.

కొద్ది మాత్రమే చదువుకు సంబంధించిన వీడియోలు చూసి తమ సందేహాలు నివృత్తి చేసుకుంటున్నట్టు అసర్ నివేదిక తెలిపింది. మొత్తంగా 90.5శాతం మంది సామాజిక మాధ్యమాల్లోనే సమయమంతా గడుపుతుండగా.. అందులో ఆడపిల్లలతో పోల్చితే మగపిల్లలే ఎక్కువగా ఉన్నారు.

### రిపోర్టులోని పలు అంశాలు..

విద్యాసంస్థల్లో 14-18వయసు పిల్లలు చదువుతున్నప్పటికీ.. వయసు పెరిగేకొద్దీ చదువు మానేసే వారి సంఖ్య పెరుగుతోంది. 14ఏండ్ల వయసులో 3.9శాతం, 18 ఏండ్ల వయసులో 32.6శాతం మంది ఉన్నారు.

వీరిలో రెండో తరగతి స్థాయిలో మాతృభాషను చదవడం, రాయడం, అర్థం చేసుకోవడంలో 25శాతం మంది వెనుకబడి ఉన్నారు.

మూడెంకల సంఖ్యను ఒక అంకెతో భాగహారం చేయడంలో విఫలమవుతున్నారు. మూడు, నాలుగోతరగతి స్థాయి గణాంకాలు చేయడంలో 43.3శాతం మంది వెనుకబడి ఉన్నారు. తప్పుల్లేకుండా ఆంగ్లం చదువుతున్న వారు 42.7శాతం మంది మాత్రమే ఉన్నారు. ఈ మూడు ప్రక్రియల్లో బాలికల కంటే బాలురు మెరుగ్గా ఉండటం గమనార్హం.

రోజువారీ కుటుంబ నిర్వహణ, ఇతర ఖర్చులు వంటి బడ్జెట్ నిర్వహణ లెక్కల్లో సర్వే చేయగా 60శాతం మంది అవగాహన చేసుకోలేకపోతున్నారు. ఆదాయం, ఖర్చు, అప్పులు, కట్టే వాయిదాలను కచ్చితంగా లెక్కించే స్థాయిలో 10శాతం మంది మాత్రమే ఉన్నారు.

ఇక ప్రాథమిక, ఉన్నతవిద్యాస్థాయిలో 86.8శాతం గ్రామీణ యువత చేరుతుండగా.. అందులో 5.6శాతం మంది మాత్రమే వృత్తిశిక్షణ, దాని అనుబంధ కోర్సుల్లో చేరుతున్నారు.

అందులోనూ ఆర్నెళ్లలోపు కాలపరిమితి ఉండే కోర్సులనే ఎంచుకుంటున్నారు. ఇక నెలలో 15 రోజులు ఇంటి పని, ఇతర పొలం, వృత్తిరీత్యా పనులు చేసేందుకు 40.3శాతం మగపిల్లలు వెళ్తుంటే, ఆడపిల్లలు 28శాతంగా ఉన్నారు.












భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూడీ ప్రకటన చేయుటమైనది. భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగముకున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు. పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉంచును. సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరుగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) (యూనిట్-1) యం.జి.ఎల్.ఐ.యస్.పి, నాగర్‌కర్నూల్

సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్







భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూడీ ప్రకటన చేయుటమైనది. భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగముకున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు. పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉంచును. సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరుగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) (యూనిట్-1) యం.జి.ఎల్.ఐ.యస్.పి, నాగర్‌కర్నూల్

సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

# కోలుకుంటున్న తమ్మినేని

## ఆందోళన అవసరం లేదు

- ఏఐజీ డాక్టర్ల బృందం నిరంతర పర్యవేక్షణ
- హైదరాబాద్‌కు సందర్శకులు రావొద్దు: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు
- డిప్యూటీ సీఎం సహా పలువురి పరామర్శ






**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వేగంగా కోలుకుంటున్నారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఆయన ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెప్పారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్న తమ్మినేనిని మంగళవారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. బుధవారం రాఘవులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రాఘవులు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతున్నదని చెప్పారు. రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని డాక్టర్లు చెప్తున్నారని అన్నారు. ఆయన కోలుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. బీపీ స్థిరంగా ఉందనీ, మూత్ర పిండాలు, గుండె సాధారణ స్థితిలో ఉన్నాయని వివరించారు. అయితే సందర్శకులు ఎక్కువగా వస్తున్నారనీ, అలా రావడం వైద్యులకు, ఆయనకు ఇబ్బందికరంగా మారిందని చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలంటే సందర్శకుల సంఖ్య ఎంత తక్కువుంటే అంత మంచిదని అన్నారు. శ్రేయోభిలాషులు, మిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన పడొద్దని అన్నారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ మాట్లాడుతూ తమ్మినేని త్వరగా కోలుకుంటారని అన్నారు. అందుకోసం ఏఐజీ డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు.

తమ్మినేని ఆరోగ్యం గురించి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, విజయరాఘవన్ అడిగి తెలుసుకుంటున్నారని వివరించారు. డాక్టర్లతో సంప్రదిస్తున్నారని చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ తమ్మినేని ఆరోగ్యం స్థిరంగా ఉందన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. త్వరగా కోలుకుంటారనీ, ప్రజాజీవితంలోకి తిరిగి వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### డిప్యూటీ సీఎం సహా పలువురి పరామర్శ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ సీనియర్ నేత, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి ఫోన్ చేసి తమ్మినేని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీలు వి హనుమంతరావు, పి మధు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏఐజీ ఆస్పత్రికి వచ్చి తమ్మినేనిని పరామర్శించారు. ఆస్పత్రికి వచ్చి పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, డిజి నరసింహారావు, పి ప్రభాకర్, మల్లు లక్ష్మితోపాటు పలువురు రాష్ట్ర నాయకులున్నారు.

### ఆరోగ్య బులెటిన్ విడుదల

'తమ్మినేని వీరభద్రం ప్రాథమిక చికిత్సకు స్పందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉంది. కొద్దిపాటి మందుల సహాయంతో బీపీ స్థిరంగా ఉంది. మాట్లాడిస్తుంటే స్పందిస్తున్నారు. తదుపరి 24-48 గంటలు చాలా కీలకమైనవి. ఆస్పత్రి క్రాస్ ఫంక్షనల్ వైద్యుల బృందం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూనే ఉన్నది. అందుకనుగుణంగా నిరంతర వెంటిలేటర్ అవసరంతో సహా భవిష్యత్ చికిత్సను కొనసాగిస్తారని వైద్యులు నిర్ధారించారు.'అని ఏఐజీ ఆస్పత్రి ఆరోగ్య బులెటిన్‌లో బుధవారం వెల్లడించింది.

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేపై కేసు

- ప్రజాభవన్ వద్ద బారీకేడ్లను ఢీకొట్టిన కేసు

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

గతేడాది డిసెంబర్‌లో ప్రజాభవన్ వద్ద బారీకేడ్లను కారు ఢీకొట్టిన కేసులో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై కేసు నమోదైంది. తన కొడుకు సాహిల్ అలియాస్ రాహిల్‌ను కేసు నుంచి తప్పించేం దుకు.. అతను దుబాయ్‌కి పారిపోయేందుకు సహకరించినందుకు షకీల్ పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

---



---

# దేశ ప్రజాస్వామ్య, లౌకిక స్వభావాన్ని కాపాడేందుకు పోరాటాలు

## సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

- 'జ్యోతిబసు సెంటర్ ఫర్ సోషల్ స్టడీస్ అండ్ రీసెర్చ్' భవనానికి శంకుస్థాపన





**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

దేశ ప్రజాస్వామ్య, లౌకిక స్వభావాన్ని కాపాడేందుకు పోరాటాన్ని ఉధృతం చేయాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కమ్యూనిస్టు నేత, ప్రజా నాయకుడు జ్యోతిబసు 15వ వర్ధంతి సందర్భంగా బుధవారం జ్యోతిబసు నగర్ (న్యూటౌన్)లో 'జ్యోతిబసు సెంటర్ ఫర్ సోషల్ స్టడీస్ అండ్ రీసెర్చ్' భవనానికి శంకుస్థాపన చేశారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, లెఫ్ట్ ఫ్రంట్ చైర్మెన్ బిమన్ బోస్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సూర్యకాంత్ మిశ్రా, రామచంద్రడోమ్ తదితరులు జ్యోతిబసు స్మృతికి నివాళు లర్పించారు.

అనంతరం నేతలంతా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సందేశం పంపారు. అలాగే నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ, ఆర్థికవేత్తలు అమియా బాగ్చి, ప్రభాత్ పట్నాయక్, జర్నలిస్టు పి. సాయినాథ్ సందేశాలను పంపారు.

'లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణలో సవాళ్లు' అనే అంశంపై జరిగిన సదస్సులో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడారు. లౌకిక ప్రజాస్వామ్య భారతదేశాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. "జ్యోతిబసు కలలుగన్న భారతదేశానికి వ్యతిరేకంగా దేశం నడుస్తోంది. జనవరి 22న సంఘ్ పరివార్ స్వతంత్ర భారత చరిత్రలో చక్రం తిప్పే ప్రయత్నం చేస్తుంది. రామ మందిరాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుంది. ప్రజల విశ్వాసాలతో రాజకీయం చేస్తుంది. ఇది రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకం. అయినా రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా చర్యలకు ఉపక్రమిస్తుంది" అని విమర్శించారు. యూఏపీఏ, ఈడీ, సీబీఐ వ్యతిరేకిస్తే ఎంపీలను సస్పెండ్ చేస్తున్నారని విమర్శించారు. మహ్మద్ సలీం మాట్లాడుతూ ప్రస్తుతం విద్య, చరిత్రపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పరిశోధనల కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై పని చేస్తుందని ఆయన చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు రెండూ ఏకకేంద్ర పాలనా వ్యవస్థకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్రీకరణకు వ్యతిరేకంగా వికేంద్రీకరణ ధ్యేయంగా జ్యోతిబసు నాయకత్వంలో రాష్ట్రం నడిచిందని గుర్తు చేశారు.

### రాజ్యాంగ సంస్థల పరిరక్షణలో జ్యోతిబసు కీలక పాత్ర: పినరయి విజయన్

అనంతరం సమావేశాన్ని ట్రస్టు చైర్మెన్ బిమన్ బసు ప్రారంభిస్తూ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పంపిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు. ప్రధాని కేరళ పర్యటన కారణంగా విజయన్ ఈ కార్యక్రమానికి రాలేకపోయారని తెలిపారు. విజయన్ తన సందేశంలో జ్యోతిబసు రాజకీయ జీవితం నుండి పాఠాలు నేర్చుకోవాలని, వర్తమానానికి దిశానిర్దేశం చేయాలని పేర్కొన్నారు. దివంగత జ్యోతిబసు రాజకీయ జీవితాన్ని ప్రస్తావిస్తూ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత బెంగాల్‌లో మతపరమైన హింసాత్మక సంఘటనలు జరగకుండా నిరోధించడంలో జ్యోతిబసు పాత్రను వివరించారు. ఇందిరాగాంధీ మరణానంతరం దేశమంతా అల్లర్లు చెలరేగినప్పుడు, బాబ్రీ విధ్వంసం తరువాత దేశమంతటా మతోన్మాద విషం వ్యాపించినప్పుడు బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు వాటిని అడ్డుకున్నారని కేరళ ముఖ్యమంత్రి సందేశంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్క మత హింసాకాండ జరగడానికి అనుమతించలేదని గుర్తు చేశారు. రాజ్యాంగ సంస్థలను పరిరక్షించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.

### జ్యోతిబసు మాకు రోల్ మోడల్: నితీష్ కుమార్

అనంతరం బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పంపిన సందేశాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీమ్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోవడానికి గురుగోవింద్ సింగ్ జన్మదిన వేడుకలు కారణమని నితీష్ తన సందేశంలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు నాయకత్వంలో పంచాయతీరాజ్, వెనుకబడిన ప్రజల సాధికారత గురించి ఆయన తన సందేశంలో ప్రస్తావించారు. బెంగాల్ ముఖ్యమంత్రిగా జ్యోతిబసు గ్రామాల అభివృద్ధికి, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి త్రిస్టార్ పంచాయతీని నిర్వహించి యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. జ్యోతిబసు మాకు రోల్ మోడల్ అని తెలిపారు. నోబెల్ బహుమతి గ్రహీత ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ, ఆర్థికవేత్తలు అమియా బాగ్చి, ప్రభాత్ పట్నాయక్, జర్నలిస్టు పి సాయినాథ్ పంపిన సందేశాలను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు దేబాషిస్ చక్రవర్తి చదివి వినిపించారు.

---

## హైకోర్టు తీర్పు తర్వాతే.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ

**గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కీలక నిర్ణయం**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

హైకోర్టులో వివాదం తేలే వరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయకూడదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయించారు. ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని గవర్నర్ స్పష్టంచేశారు. ఈమేరకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ పేరుతో బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కె. సత్యనారాయణను నామినేట్ చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, ఆ ఇద్దరికీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకమయ్యేందుకు తగిన అర్హతలు లేవంటూ గవర్నర్ ఆ ప్రతిపాదనలను తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టులో రిట్ పిటిషన్లు వేశారు.

---



---

# సాగర్‌కు సీఆర్‌పీఎఫ్

## భద్రత కొనసాగింపు

- బోర్డు పరిధిలోకి ప్రాజెక్టుల నిర్వహణ
- ఏపీ, తెలంగాణ అంగీకారం
- సాంకేతికాంశాలపై మరోసారి భేటి

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

కృష్ణా బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఉమ్మడిగా ఉన్న నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టును పూర్తిగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించాలని రెండు తెలుగు రాష్ట్రాలను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశించింది. నెల రోజుల్లోగా ప్రాజెక్టుల అప్పగింత ప్రక్రియను పూర్తి చేసేలా ఇరు రాష్ట్రాలు సహకరించాలని సూచించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వారం రోజుల్లోగా ప్రారంభించాలని స్పష్టం చేసింది. ఇకపై రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ వివాదాలకు ముగింపు పలికేలా ప్రాజెక్టుల నియంత్రణ, నిర్వహణ పూర్తిగా బోర్డు చేతుల్లోనే ఉంటుందని పేర్కొంది.

ఇటీవల ఏపి, తెలంగాణ రాష్ట్రాల మధ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణ విషయంలో వివాదాలు తలెత్తిన నేపథ్యంలో ఇరు రాష్ట్రాల ముఖ్యకార్యదర్శులు, ఇంజినీర్లతో బుధవారం న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవనరుల శాఖల ముఖ్యకార్యదర్శులు శశిభూషణ్‌కుమార్, రాహుల్‌బొజ్జ, ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సి)లు బి నారాయణరెడ్డి, సి మురళీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు ప్రాజెక్టుల నిర్వహణ, నియంత్రణ అంశాలపై మూడు గంటల పాటు చర్చించారు. రెండు రాష్ట్రాల ఇంజినీర్లు తమతమ అభిప్రాయాలు, వాదనలను కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఎదుట వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత సహా కార్యకలాపాలను సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించాలని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ అంతా ఏపీ ప్రభుత్వం చేతుల్లో ఉందని జలశక్తి శాఖ కార్యదర్శి దృష్టికి తెలంగాణ అధికారులు తీసుకెళ్లారు. అయితే నాగర్జునసాగర్ వ్యవహారంపై చర్చించాలని జలశక్తి శాఖ కార్యదర్శి సూచించారు. నాగార్జునసాగర్ నిర్వహణ అంతా కేఆర్‌ఎంబీకి అప్పగించే విషయమై తమ,తమ రాష్ట్ర పభుత్వాలతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఇరు రాష్ట్రాల అధికారులు తెలిపారు. విద్యుత్ ప్రాజక్టులు సహా ప్రాజెక్టు పరిధిలో ఉన్న అవుట్‌లెట్స్, సాంకేతిక పరిమితులు తదితర అంశాలపై కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరు రాష్ట్రాల అధికారులు తెలిపారు. ఏ ఏ అవుట్‌లెట్స్ ఎవరి పరిధిలో ఉండాలో కూడా తేలాల్సి ఉందని రెండు రాష్ట్రాల అధికారులు తెలిపారు. సాంకేతిక అంశాలపై ఇరు రాష్ట్రాల చీఫ్ ఇంజినీర్లతో కూర్చుని ఒక నిర్ణయానికి రావాలని జలశక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సీఆర్‌పీఎఫ్ పెట్రోలింగ్‌ను యధాతథంగా ఉంచాలని రెండు రాష్ట్రాల అధికారులు, జలశక్తి అధికారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. సాంకేతిక విషయాలపై ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయంతో నివేదిక పంపిన తరువాత మరోసారి భేటీ ఉంటుందని జలశక్తి శాఖ కార్యదర్శి చెప్పినట్టు అధికారులు తెలిపారు.

నాగార్జునసాగర్‌లో నవంబర్ 29కి ముందున్న నిర్వహణ విధానాన్నే కొనసాగించాలని తెలంగాణ ఇంజినీర్లు కోరారు. అయితే ఈ ప్రతిపాదనను ఏపి ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గేట్ల నిర్వహణను తెలంగాణ చేతిలో పెడితే నీటి విడుదల అంశంలో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనీ, ఏపికి నీటి విడుదల సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జోక్యం చేసుకున్న జలశక్తి శాఖ కార్యదర్శి వివాదం సాగర్ నుంచి మొదలైనందున మొదటగా దానిని పూర్తిగా బోర్డు నియంత్రణకు అప్పగించాలన్నారు.

దీన్ని తెలంగాణ ఇంజినీర్లు వ్యతిరేకించారు. ఉంటే రెండు ప్రాజెక్టులు పూర్తిగా బోర్డు నియంత్రణలోనే ఉండాలనీ, కేవలం సాగర్ ఒక్కదాన్ని అయితే తాము అంగీకరించబోమని స్పష్టంచేశారు. దీనిపై జోక్యం చేసుకున్న కేంద్ర కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, 2021లో సవరించిన గెజిట్ మేరకు రెండు ప్రాజెక్టులు, కాలువలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సరఫరా చేసే వ్యవస్థలు, కార్యాలయాల ప్రాంగణాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, ఫర్నీచర్‌తోసహా అన్నింటినీ బోర్డులు తన అధీనంలోకి తీసుకుని రోజు వారీ వాటి నిర్వహణ బాధ్యతలను చేపడుతాయనీ, వాటి పరిధిలో పనిచేసే రెండు రాష్ట్రాల ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సహా అందరూ బోర్డు పర్యవేక్షణలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులకు సీఐఎస్ఎఫ్ బలగాలతో భద్రత కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులను పూర్తిగా బోర్డుకు అప్పగించేందుకు ఇరు రాష్ట్రాలు సహకరించాలనీ, దీనికి సంబంధించిన ప్రక్రియ వారంలోనే శ్రీకారంచుట్టాలని ఆదేశించారు. నెల రోజుల్లోనే అప్పగింతల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. దీనికి ఏపి, తెలంగాణ రెండు రాష్ట్రాలు సమ్మతించినట్టు తెలిసింది.

---



సంపాదకీయం

# ఆ తీర్పు నిజమే..

**జలియన్ వాలా బాగ్ ఉదంతం దేశ ప్రజానీకంలో రక్తం ఉరకలెత్తేలా చేసింది. జనరల్ డయ్యర్‌లు మాకూ ఉన్నారని రుజువు చేసింది మోడీ సర్కార్. రైతాంగ ప్రదర్శనపై కారు నడిపి లక్కింపూర్ ఖేరిలో నల్గురు రైతు ఉద్యమ కారుల్ని, ఒక ఫోటో జర్నలిస్టు జీవితాన్ని చిదిమేసిన వ్యక్తి సాక్షాత్తు కేంద్ర మంత్రి కుమార రత్నం. ఘటన జరిగి రెండేండ్లు గడిచిపోయినా అటు కేసూ పురోగమించదు. ఇటు కేంద్ర మంత్రి వర్గంలో నుండి అజయ్ మిశ్రాను మోడీ తొలగించడు. మొన్న జరిగిన ఎస్.కే.ఎమ్ సదస్సు ఆ మంత్రిని తొలగించాలన్న తన డిమాండును పునరుద్ఘాటించింది.**

ఆ తీర్పిచ్చి వందేళ్ళయింది. తీర్పు చెప్పింది రంజన్ గొగోయో, ధనుంజయ్ చంద్రచూడో కాదు. ఆర్నాట్! రెండు శతాబ్దాలు మన దేశాన్నేలిన ఇంగ్లండ్‌కు చెందినోడు ఆ జడ్జి. "కింగ్ ఎంపరర్ వర్సెస్ రంప పితూరి" అని పిలువబడే మన్యం తిరుగుబాటు దారులపై బ్రిటీష్ ప్రభుత్వం నడిపిన కుట్ర కేసులో వాల్తేరులోని ఏజెన్సీ డివిజన్ అదనపు జిల్లా జడ్జీ. 1923 జూన్ 25 న తాను ఇచ్చిన తీర్పులో 'గొప్ప' చారిత్రక సత్యాన్ని తెలిపాడు. "ప్రజా పోరాటాలు తమ రాజ్యాధికారాన్ని ఎంతవరకు ప్రశ్నిస్తున్నాయన్న విషయం తప్ప, పాలకులకు ఆ పోరాట కారణాలతో నిమిత్తం లేదు".

ప్రభుత్వరంగ పరిశ్రమలను రక్షించాలని ఆ పరిశ్రమల కార్మికులు పోరాడినా, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థల పరిరక్షణకు ఆ సంస్థల ఉద్యోగులు పోరాడినా నేటి పాలకులు "విధానాలతో మీకేం సంబంధం? మీకేమైనా జీతాలు పెంచాలంటే అడుక్కోండి" అని డైరెక్ట్‌గా బెదిరిస్తున్న సంగతి చూస్తూనే ఉన్నాం. ఈ విధమైన డైలాగులు మొన్నటి రైతు ఉద్యమం సందర్భంగా మోడీ శిష్యబృందమంతా విస్తృతంగా ప్రచారంలో పెట్టారు. పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలొచ్చాయి. టీవీ చర్చల్లో ప్రభుత్వ తాబేదార్లంతా చర్చలతో హోరెత్తించారు. రైతుల ఉద్యమంలో రాజకీయాలు చొరబడ్డాయని, ప్రభుత్వ విధానాన్ని రైతులెలా ప్రశ్నిస్తారని ఊదరగొట్టారు.

మొన్ననే జలంధర్‌లో ఎస్.కే.ఎమ్ (సంయుక్త కిసాన్ మోర్చా) జాతీయ సదస్సు జరిగింది. 510 సంఘాల జాతీయ వేదిక ఎందుకేర్పడిందో, వారి డిమాండ్లు ఎందుకొచ్చాయో, వాటి కారణా లేమిటో మోడీ అండ్ కో కు అనవసరం. అసలు దేశంలో వ్యవసాయ సంక్షోభం మూల కారణాలేమిటో వాటి పుట్టు పూర్వోత్తరాలు మన పాలకులకు పట్టదు. రైతు ఆత్మహత్యల పరంపర గత శతాబ్ది చివర్లో ప్రారంభమై. నేటిదాకా ఎందుకు కొనసాగుతోందో ఆ కారణాలతో మన పాలకులకు నిమిత్తం లేదు. మూడు వ్యవసాయ చట్టాలను తమ మంద బలంతో ప్రతిపక్షం నోరునొక్కి మరీ ఎందుకు ప్యాస్ చేసుకున్నారో చెప్పరు పాలకులు. అసలు ప్రతిపక్షమే పార్లమెంటులో లేనపుడు నాలుగు కార్మిక కోడ్‌లను ఆమోదింప చేసుకోవడం, తప్పు... తప్పు... చేతులెత్తించేసుకోవడం మోడీ సర్కార్ ఎందుకు చెయ్యాల్సొచ్చిందో చెప్పగలదా? దేశ జనాభాలో దాదాపు సగం మందికి పైగా జీవితాలను దెబ్బతీసి వారిని బానిస బతుకుల్లోకి నెట్టే ప్రయత్నమిది. కారణం ఏమిటి? ఎవరిని మోయడానికి? దేశంలో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

జలియన్ వాలా బాగ్ ఉదంతం దేశ ప్రజానీకంలో రక్తం ఉరకలెత్తేలా చేసింది. జనరల్ డయ్యర్‌లు మాకూ ఉన్నారని రుజువు చేసింది మోడీ సర్కార్. రైతాంగ ప్రదర్శనపై కారు నడిపి లక్కింపూర్ ఖేరిలో నల్గురు రైతు ఉద్యమ కారుల్ని, ఒక ఫొటో జర్నలిస్టు జీవితాన్ని చిదిమేసిన వ్యక్తి సాక్షాత్తు కేంద్ర మంత్రి కుమార రత్నం. ఘటన జరిగి రెండేండ్లు గడిచిపోయినా అటు కేసూ పురోగమించదు. ఇటు కేంద్ర మంత్రి వర్గంలో నుండి అజయ్ మిశ్రాను మోడీ తొలగించడు. మొన్న జరిగిన ఎస్.కే.ఎమ్ సదస్సు ఆ మంత్రిని తొలగించాలన్న తన డిమాండును పునరుద్ఘాటించింది. ఈ సదస్సు కీలకమైన కార్మిక డిమాండ్లతో పాటు వ్యవసాయ కార్మికులకు ఉపాధిహామీ చట్టం కింద సంవత్సరానికి 200 పని దినాలుండాలని కూడా డిమాండు చేసింది. నేడు రైతాంగ మరో కీలక డిమాండు విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని. ఇది దేశంలోని కోట్లాది సామాన్యులకు మేలు చేసే చర్య. విద్యుత్ రంగ ప్రయివేటీకరణే జరిగితే అంబానీ, టాటా వంటి వారి జేబులు నిండటమే కాదు కోట్లాది మంది సామాన్యుల బతుకులు చీకట్ల పాలౌతాయి.

ఈ పరిస్థితి శాశ్వతం కారాదు. పాలకులు అంత బరితెగించినపుడు చేతకానిది ప్రజలకేనా? దేశంలో గతంలో ఎప్పటికంటే శ్రమజీవులంతా ఐక్యమవుతున్నారు. పెట్టుబడిపై పోరుకు లంగోటాలు బిగించి, గోదాలోకి దిగారు. రిపబ్లిక్ డే రోజు ట్రాక్టర్ల పరేడ్‌కు, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌కు ఉద్యుక్తులవుతున్నారు. అదే రోజు కార్మికులు దేశ వ్యాపిత ఆందోళనకు పిలుపునిచ్చారు.

1923 అదనపు జిల్లా జడ్జీ తీర్పు నేటి పరిస్థితికి దర్పణం. "జరిగే విషయాలను అర్థం చేసుకోవాలంటే, వర్తమాన వర్గపోరాటంతో మాత్రమే ప్రారంభించాలి. ఇంక ఏ విధంగా చరిత్రను అధ్యయనం చేసే క్రమమైనా గతించిన సంఘర్షణలతో గెలుపొందిన వారి ప్రభావానికి గురికాక తప్పదు. ఈ గత సంఘర్షణల శ్మశానాలలో కూచునే మన విశ్వవిద్యాలయ అకడమిక్ రాబందులు చరిత్రపేరుతో పాలకవర్గాల పుక్కిటి పురాణాల్ని ప్రచారం చేస్తున్నారం"టాండు సి వి సుబ్బారావు.

## మానవాళి విముక్తి కోసం సాగే...

# విప్లవప్రగతికి ధ్రువనక్షత్రం లెనిన్

కేవలం 54 సంవత్సరాల తన జీవితకాలంలో లెనిన్ ప్రపంచకార్మిక విప్లవ ప్రగతిపైన చెరగని ముద్రను వేశాడు. మార్క్సిజం అనే సృజనాత్మక శాస్త్ర సారాన్ని సమగ్రంగా అవగాహన చేసుకుని, దాన్ని సమకాలీన సమాజ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్ది రష్యన్ విప్లవాన్ని విజయ పథంవైపు నడిపించాడు. అలా ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు దేశంగా సోవియట్ యూనియన్ ఆవిర్భవించింది. మార్క్సిజంపైన జరుగుతున్న అన్నిరకాల వక్రీకరణలకు వ్యతిరేకంగా పోరాడుతూ, విప్లవోద్యమాన్ని పట్టాలు తప్పకుండా కాపాడి మార్క్సిజాన్ని సుసంపన్నం చేశాడు. విప్లవోద్యమ గమనంలో సంభవించే రకరకాల మలుపుల్లో సరియైన ఎత్తుగడలను అనుసరించటంలో తనకుతానే సాటి అని అనిపించుకున్నాడు. ఆయన ఒక మార్క్సిస్టు సిద్ధాంతకర్త, వ్యూహకర్త, గొప్ప ఎత్తుగడల రూపకర్త (ట్యాక్టీషియన్). ప్రపంచవ్యాప్తంగాను, ప్రపంచంలోని ప్రతిదేశంలోను విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవటానికి ఆయన రచనలను నిరంతరం అధ్యయనం చేయటం అవసరం.



### మార్క్సిజం సారంపైన పట్టును సాధించటం

మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంపైన, దాని సృజనశీలత, శాస్త్రీయతలపైన సమగ్రమైన అవగాహన ఏర్పరచుకుని లెనిన్ ప్రపంచ విప్లవోద్యమాన్ని నడిపించగలిగాడు. మార్క్సిజమనే అపూర్వ భాండాగారానికి ఆయన చేసిన అసమాన సేవలు, పథనిర్దేశన గురించి లోతుగా అర్థం చేసుకోవటానికి విడివిడిగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. "రాజ్యం-విప్లవం", "సోషల్ డెమోక్రసీకి చెందిన రెండు ఎత్తుగడలు", "ఏమి చెయ్యాలి", "సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ" వంటి లెనిన్ ప్రముఖ రచనలను చాలామంది అధ్యయనం చేశారు. నిజానికి ఇలా చేయటం చాలా ముఖ్యం. వర్తమాన పరిస్థితులలో మానవాళి విముక్తి కోసం జరిగే పోరాటాలను ముందుకు తీసుకుపోవటానికి ప్రతి విప్లవకారుడు లెనిన్ రచనల సారాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. అయితే ప్రపంచ కార్మికోద్యమం, రష్యన్ విప్లవపథంలో సంభవించిన వివిధ మలుపుల్లో లెనిన్ ఈ రచనలను ఎందుకు చేయవలసి వచ్చిందనే విషయంపైన అవగాహన ఏర్పరచుకోవటం కూడా అంతే ముఖ్యం.



సీతారాం ఏచూరి

లెనిన్ మార్క్సిజాన్ని ఎంత గొప్పగా అంతర్లీనం చేసుకున్నాడో తెలియాలంటే ఆయన చేసిన రెండు సూత్రీకరణలను ఒక చోటకు చేరిస్తే ఉపయోగ కరంగా ఉంటుంది. మొదటగా ఆయన "ప్రజలకు స్నేహితులు ఎవరు...?" అని అడిగాడు. "లక్షలాది శ్రమజీవులు మార్క్సిజంవైపు ఆకర్షింపబడటానికి కారణం మార్క్సిజం ఏక కాలంలో విప్లవకర, అత్యంత శాస్త్రీయ పార్శ్వాలు కలిగిన ఏకైక తత్వశాస్త్రం కావటమే. మార్క్స్, ఎంగెల్స్ తమ జీవిత కాలంలో ఈ రెండింటినీ కలపటం వల్లనే ఇవి కలిసిలేవు. మార్క్సిజం ఈ రెండింటినీ తనలో విడదీయరాని బంధంలో ఉంచుతుంది. రెండవది, నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించటం మార్క్సిజానికి అత్యంత కీలకమైనది. అది మార్క్సిజానికి సజీవ ఆత్మ.

> **మార్క్సిజంలోని విప్లవకర, అత్యంత శాస్త్రీయ పార్శ్వాలను కలిపివుంచటం ద్వారానే విప్లవలక్ష్యమైన మానవాళి విమోచన నెరవేరటం సాధ్యం. ఒక పార్శ్వానికి ఎక్కువ, మరొక పార్శ్వానికి తక్కువ ప్రాధాన్యతనిస్తే అది వక్రీకరణలకు దారితీస్తుంది. విప్లవ సాధ్యతను విస్మరించి పరిస్థితిని కేవలం శాస్త్రీయంగా విశ్లేషించటంపైనే దృష్టిని కేంద్రీకరిస్తే అది సంస్కరణవాద వక్రీకరణకు దారితీస్తుంది. అలాగే పరిస్థితిని శాస్త్రీయంగా విశ్లేషించటాన్ని విస్మరించి విప్లవ నినాదాలను ఇవ్వటానికి పాల్పడితే అది వామపక్ష దుందుడుకు వాద వక్రీకరణకు దారితీస్తుంది. అటువంటి వక్రీకరణలు జరగకుండా చూడాలంటే మార్క్సిజంలోని ఈ రెండు పార్శ్వాలను సరియైన రీతిలో కలిపి ఉంచటం అవసరం.**

మార్క్సిజంలోని విప్లవకర, అత్యంత శాస్త్రీయ పార్శ్వాలను కలిపివుంచటం ద్వారానే విప్లవలక్ష్యమైన మానవాళి విమోచన నెరవేరటం సాధ్యం. ఒక పార్శ్వానికి ఎక్కువ, మరొక పార్శ్వానికి తక్కువ ప్రాధాన్యతనిస్తే అది వక్రీకరణలకు దారితీస్తుంది. విప్లవ సాధ్యతను విస్మరించి పరిస్థితిని కేవలం శాస్త్రీయంగా విశ్లే షించటంపైనే దృష్టిని కేంద్రీకరిస్తే అది సంస్కరణవాద వక్రీకరణకు దారితీస్తుంది. అలాగే పరిస్థితిని శాస్త్రీయంగా విశ్లేషించటాన్ని విస్మరించి విప్లవ నినాదాలను ఇవ్వటానికి పాల్పడితే అది వామపక్ష దుందుడుకువాద వక్రీకరణకు దారితీస్తుంది. అటువంటి వక్రీ కరణలు జరగకుండా చూడాలంటే మార్క్సిజంలోని ఈ రెండు పార్శ్వాలను సరియైన రీతిలో కలిపి ఉంచటం అవసరం.

'నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించటం' అంటే నిర్దిష్ట పరిస్థితులను వస్తుగతంగా అంచనావేసి దాని ఆధారంగా సరియైన విప్లవ విశ్లేషణ చేయటం. ఆత్మగత కారణాలతో నిర్దిష్ట పరిస్థితులను తప్పుగా అంచనావేస్తే అది లోపభూయిష్టమైన, తప్పుడు రాజకీయ విశ్లేషణకు దారితీసి విప్లవోద్యమాన్ని వక్రమార్గం పట్టిస్తుంది. కాబట్టి మార్క్సిజంలోని రెండు పార్శ్వాలను కలిపివుంచి నిర్దిష్ట పరిస్థితులను విప్లవకారుడు సమర్థవంతంగా వస్తుగతంగా చేసే విశ్లేషణ ఆధారంగానే విప్లవోద్యమం ముందుకు సాగగలుగుతుంది. ఒకవేళ సమగ్ర విశ్లేషణ ఆధారంగా చేసిన అంచనాతో విప్లవోద్యమం సరియైన రాజకీయ-ఎత్తుగడల పంథాను రూపొందించి, అనుసరించినా దాని ఫలితం పార్టీ బలంపైనే ఆధారపడి ఉంటుంది. రాజకీయ పంథా నూటికి నూరుశాతం సరియైనదైనప్పటికీ దాన్ని ప్రజల వద్దకు తీసుకు పోగలిగే పార్టీ లేనప్పుడు దాని ప్రభావం అంతగా ఉండదని స్టాలిన్ లెనినిస్టు అవగాహనతో చెప్పాడు. ఆవిధంగా విప్లవోద్యమం పురోగమించటానికి పార్టీ ఆర్గనైజేషన్, దాని శక్తిసామర్థ్యాలు... వీటినే లెనిన్ 'ఆత్మగత కారకం (సబ్జెక్టివ్) అని అన్నాడు- ప్రధానమైన పాత్రను పోషిస్తాయి.

వీటన్నింటిలో సంస్కరణ, వామపక్ష దుందుడుకు వాద (దీన్నే లెనిన్ 'శైశవ రుగ్మత' ('an infantile disorder') అని అన్నాడు) లక్షణాలకు సంబంధించిన అన్ని రకాల వక్రీకరణలపైన లెనిన్ అలుపెరుగని పోరాటం చేశాడు. విప్లవప్రగతి కీలక తరుణాలలో వక్రమార్గం పట్టకుండా చూడటానికి వీటికి చెందిన ప్రతి వక్రీకరణను ఎండగట్టి, కార్మికోద్యమ స్పష్టత కోసం లెనిన్ అనేక గొప్ప రచనలను చేశాడు. విప్లవోద్యమానికి సరియైన దిశానిర్దేశం చేయటానికి, అంతిమంగా విజయం సాధించటానికి, భావజాలపరంగా కార్మికోద్యమంలో పేరొందిన అనేకమంది నాయకులతో ఆయన పోరాటం చేయవలసి వచ్చింది.

### మార్క్సిజాన్ని తాజాపర్చటం

### రష్యన్ విప్లవాన్ని విజయవంతం చేయటం

దేశంలోని పరిస్థితులు, వాటి వైరుధ్యాల విశ్లేషణతో పాటు ప్రపంచ పరిస్థితులను, వాటి వైరుధ్యాలను సరియైన రీతిలో విశ్లేషించకుండా రష్యా విప్లవంతో సహా ఏ విప్లవము విజయవంతం కాజాలదనే విషయాన్ని మార్క్సని, మార్క్సిజాన్ని సమగ్రంగా అర్థం చేసుకున్న తరువాత లెనిన్ గ్రహించాడు. ప్రపంచస్థాయి పెట్టుబడిదారీ వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనిస్తూ పెట్టుబడి దారీ వ్యవస్థపైన, దానిలోని ధోరణులపైన మార్క్స్ చేసిన సునిశిత విశ్లేషణ ఆధారంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి కొనసాగుతుండగా దానిలో కేంద్రీకరణ, సాంద్రీకరణ ధోరణి నూతన స్థాయికి చేరుకుని గుణాత్మక మార్పుకు లోనైందని లెనిన్ విశ్లేషించాడు. మార్క్స్ తన జీవిత చరమాంకంలో గుత్త పెట్టుబడిదారీ ధోరణులను గమనించాడు. మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ దీన్ని పెట్టుబడి గ్రంథం మూడవ సంపుటిలో పొందుపరిచాడు. గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధితో పెట్టుబడి పాలన యావత్ ప్రపంచాన్ని తన ఆధీనంలోకి తీసుకుందని, అది సామ్రాజ్యవాద దశ అని, ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ అని 20వ శతాబ్దం ప్రారంభంలో లెనిన్ సూత్రీకరించాడు. సామ్రాజ్యవాదంతో ఆవిర్భవించిన వైరుధ్యాలను సరియైన రీతిలో అంచనావేసి, విశ్లేషించి సామ్రాజ్యవాదదశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచాన్ని గొలుసులతో బంధించిందని లెనిన్ చెప్పాడు. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకుని ఈ సామ్రాజ్యవాద గొలుసులో అత్యంత బలహీనంగా వున్న లింక్‌ని తెగ్గొట్టాలి. ఆనాటి మానవ చరిత్రలో రష్యా అటువంటి బలహీనమైన లింక్‌గా ఉంది. సామ్రాజ్యవాద దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని (కొనసాగుతున్న మొదటి ప్రపంచ యుద్ధాన్ని)అంతర్యుద్ధంగా మార్చాలని, శాంతి, తిండి, భూమి నినాదాన్ని రష్యన్ ప్రజల ముందుంచాలని లెనిన్ పిలుపునిచ్చాడు. అటువంటి నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా చేసిన విశ్లేషణ ఆధారంగా రష్యాలో విప్లవోద్యమానికి ఆయన నాయకత్వం వహించి అంతిమంగా 1917 అక్టోబర్‌లో విప్లవాన్ని విజయ పథంవైపు నడిపాడు.

సామ్రాజ్యవాదం పైన లెనినిస్టు అవగాహన, విశ్లేషణ, సామ్రాజ్యవాద దేశాల మధ్య ఆవిర్భవించిన వైరుధ్యాలు రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీశాయి. దీనిలో జర్మనీ పాత్రతో ఒక నూతన ప్రపంచక్రమం ఏర్పడటానికి దారితీసింది. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకోవటం వల్ల ఫాసిజం ఓటమిపాలైంది. అది తూర్పు ఐరోపా ఖండం విమోచనకు దారితీసింది. తత్ఫలితంగా సోషలిజానికి అనుకూలంగా వర్గ పొందికలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన మార్పునకు ప్రతిస్పందనగా సంక్షేమ రాజ్య భావన అనే ఒక గుణాత్మకమైన నూతన దశలోకి పెట్టుబడిదారీ దేశాలు ప్రవేశించాయి.

> **సామ్రాజ్యవాదం పైన లెనినిస్టు అవగాహన, విశ్లేషణ, సామ్రాజ్యవాద దేశాల మధ్య ఆవిర్భవించిన వైరుధ్యాలు రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీశాయి. దీనిలో జర్మనీ పాత్రతో ఒక నూతన ప్రపంచక్రమం ఏర్పడటానికి దారితీసింది. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకోవటం వల్ల ఫాసిజం ఓటమిపాలైంది. అది తూర్పు ఐరోపా ఖండం విమోచనకు దారితీసింది. తత్ఫలితంగా సోషలిజానికి అనుకూలంగా వర్గ పొందికలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన మార్పునకు ప్రతిస్పందనగా సంక్షేమ రాజ్య భావన అనే ఒక గుణాత్మకమైన నూతన దశలోకి పెట్టుబడిదారీ దేశాలు ప్రవేశించాయి.**

నేడు మనం మన పార్టీని మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీగా పిలుచుకుంటున్నామంటే మనం ఉద్దేశ పూర్వకంగా లెనిన్ మార్క్సిజాన్ని అన్నివిధాలుగా సంపద్వంతం చేసిన విషయాన్ని, అన్ని రకాల వక్రీకరణలకు (ముఖ్యంగా సంస్కరణవాద, వామపక్ష దుందుడుకు వాద వక్రీకరణలకు) వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని, కార్మిక, కర్షక మైత్రి అక్షం చుట్టు దోపిడీకి గురౌతున్న వర్గాలను సమీకరించే ఎత్తుగడలను రూపొందించిన విషయాన్ని, మానవాళి విమోచనకు చరిత్ర గమనాన్ని ప్రభావితం చేయగలిగే, విప్లవోద్యమాన్ని ప్రగతిపథంలో సాగేలా చేసే ఎత్తుగడలను రూపొందించే కార్మికవర్గ పార్టీని నిర్మించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నామని అర్థం. లెనినిజం అంటే "సామ్రాజ్యవాద శకంలో మార్క్సిజం" అని స్టాలిన్ నిర్వచించాడు.

### ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం

ప్రపంచ కార్మిక విప్లవానికి లెనిన్ నాయకుడు. రష్యాలో సోషలిజం విజయవంతం కావటం, సోవియట్ యూనియన్ ఏర్పడటం, ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న విప్లవ పోరాటాలు ముందుకు సాగటానికి ప్రేరకంగా ఉంటాయని ఆయనకు తెలు సు. ఈ అవగాహనతోనే ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు తమతమ దేశాలలో జరుగుతున్న ప్రజాపోరాటాలను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ స్థాయిలో జరుగుతున్న పోరాటాలతో అనుసంధానం చేశాయి. "జాతీయ, వలస సమస్య"పైన లెనిన్ ప్రతిపాదనలు (థీసెస్) అన్ని వలసదేశాలలో కొనసాగుతున్న జాతీయ విమోచన పోరాటాలను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచస్థాయిలో జరుగుతున్న పోరాటాలతో అనుసంధానం చేయటానికి కావలసిన పునాదిని వేశాయి.

> **పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతస్సిద్ధంగా పతనం కానేకాదు. దాన్ని కూలదోయవలసిన అవసరం ఉంది. పెట్టుబడి పాలనపైన రాజకీయ దాడిని వాడిగా చేయటానికి ప్రజా పోరాటాలను నిర్వహించటం ద్వారా వర్గ పోరాటాలను తీవ్రతరం చేసే కార్మిక వర్గ నేతృత్వంలో సమాజంలోని భౌతికశక్తిని బలోపేతం చేయటంపైన పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటమనే విప్లవ కార్యాచరణ నిర్ణయాత్మకంగా ఆధారపడి ఉంటుంది. ఇటువంటి భౌతిక శక్తిని నిర్మించటం, 'కర్తృత్వ కారకం'గావుండే దీని బలాన్ని అనివార్యంగా బలోపేతం చేయవలసి ఉంటుంది. సంక్షోభానికి చెందిన నిర్దిష్ట పరిస్థితులు 'వస్తుగత కారకం' (ఆబ్జెక్టివ్)గా ఉంటాయి.**

ప్రపంచ వ్యాప్తంగా ఈ థీసిస్ జాతీయ, వలస వ్యతిరేక పోరాటాలపైన బలమైన ప్రభావాన్ని చూపింది. దీని ప్రభావంతో చరిత్రగతినే మార్చేంతగా విప్లవోద్యమం పురోగమించింది. ఆ కాలంలో వియత్నాంలో ఫ్రెంచ్ వలస పాలకులు పాల్పడుతున్న నేరాలపైన ఫ్రాన్స్‌లో నివసిస్తున్న హోచిమిన్ కరపత్రాలను పంచి పెడుతుండేవాడు. లెనిన్ తమను ఎంతగా ప్రభావితం చేశాడో ఆయన మాటల్లోనే..."అప్పట్లో నేను అక్టోబర్ విప్లవ చారిత్రక ప్రాధాన్యతను తెలుసుకోకముందే స్వభావరీత్యా దానికి మద్దతు పలికాను. తన దేశ ప్రజలను విముక్తి చేసిన గొప్ప దేశ భక్తుడైన లెనిన్ అంటే నాకు చాలా ఇష్టం. అప్పటివరకు నేను ఆయన రచనలను ఏవీ చదవలేదు. ఆ తరువాత హుమనైట్‌లో ప్రచురింపబడిన లెనిన్ 'థీసిస్ ఆన్ ద నేషనల్ అండ్ కలోనియల్ క్వెశ్చన్స్'ను చదవమని ఒక కామ్రేడ్ ఇచ్చాడు. ఆ థీసిస్‌లోని రాజకీయ పరిభాషను అర్థం చేసుకోవటం కష్టమనిపించింది. అయితే పదేపదే చదవటంవల్ల అంతిమంగా దాని ప్రధాన భాగాన్ని అర్థం చేసుకోగలిగాను. అది నాలో ఎంతో ఉద్విగ్నతను, ఉత్సాహాన్ని, స్పష్టతను, ఆత్మస్థైర్యాన్ని నింపింది! ఆ సంతోషంలో నా కళ్ళ నుంచి ఆనంద భాష్పాలు రాలాయి. నా గదిలో ఒక్కడినే ఏకాంతంగా కూర్చున్నప్పటికీ ఒక మహాసభలో ప్రసంగిస్తున్నట్టుగా పెద్దగా అరుస్తూ ఇలా మాట్లాడాను. 'ప్రియమైన యోధులారా, నా దేశ వాసులారా! మనకు కావలసింది ఇదే. మన విమోచనకు ఇదే మార్గం!

తూర్పు దేశాలకు చెందిన శ్రామికుల కోసం లెనిన్ ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుంచి ఈ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించిన విప్లవకారులు సిద్ధాంతం, ఆచరణలపైన సమగ్రమైన అవగాహనతో విప్లవోద్యమాన్ని బలోపేతం చేయటానికి తమ తమ దేశాలకు తిరిగి వెళ్ళారు. ఆవిధంగా కార్మిక వర్గ ఉద్యమానికి, కమ్యూనిస్టు అంతర్జాతీయతకు అంతర్జాతీయ సంఘీభావాన్ని అందించటానికి లెనిన్ మార్గదర్శక పాత్రను పోషించాడు... 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి, మీకు పోయేదేమీ లేదు సంకెళ్లతప్ప'. కర్తృత్వ కారకం (సబ్జెక్టివ్)

పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతస్సిద్ధంగా పతనం కానే కాదు. దాన్ని కూలదోయవలసిన అవసరం ఉంది. పెట్టుబడి పాలనపైన రాజకీయ దాడిని వాడిగా చేయటానికి ప్రజా పోరాటాలను నిర్వహించటం ద్వారా వర్గ పోరాటాలను తీవ్రతరం చేసే కార్మికవర్గ నేతృత్వంలో సమాజంలోని భౌతికశక్తిని బలోపేతం చేయటంపైన పెట్టు బడిదారీ వ్యవస్థను కూలదోయటమనే విప్లవ కార్యాచరణ నిర్ణయాత్మకంగా ఆధారపడి ఉంటుంది. ఇటువంటి భౌతిక శక్తిని నిర్మించటం, 'కర్తృత్వ కారకం'గా వుండే దీని బలాన్ని అనివార్యంగా బలోపేతం చేయవలసి ఉంటుంది. సంక్షోభానికి చెందిన నిర్దిష్ట పరిస్థితులు 'వస్తుగత కారకం' (ఆబ్జెక్టివ్)గా ఉంటాయి. 'వస్తుగత కారకం'గా వుండే నిర్దిష్ట పరిస్థితులు ఎంత అనుకూలంగా ఉన్నప్పటికీ 'కర్తృత్వ కారకం'గా వుండే శక్తులను బలోపేతం చేయకుండా పెట్టుబడి పాలనను తుద ముట్టించటం సాధ్యపడదు. వర్గపోరాటానికి పదును పెట్టటానికి, 'కర్తృత్వ కారకం'ను బలోపేతం చేసేందుకోసం, వాస్తవ పరిస్థితులనుంచి ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవటం కోసం కార్మికవర్గం అనేక మధ్యస్థ నినాదాలను, చర్యలను, ఎత్తుగడలను ఉపయోగించవలసి ఉంటుంది. ఆవిధంగా తమతమ దేశాలలో విప్లవ పరివర్తనను వేగవంతం చేయటం జరుగుతుంది.

> **భారతదేశంలో ప్రస్తుతమున్న పరిస్థితిలో ఈ దిశలో ముందుకు పోవాలంటే బీజేపీని ఒంటరిని చేసి ఓడించటం తక్షణ కర్తవ్యంగా ఉండాలి. భారత రాజ్యాంగాన్ని నాశనం చేయటానికి, లౌకిక గణతంత్ర ప్రజా స్వామ్యాన్ని ఆర్ఎస్ఎస్ భావజాలానికి అనుగుణంగా ఒక తీవ్ర అసహన, పాసిస్టు "హిందుత్వ రాజ్యం"గా పరివర్తించటానికి ఉపయోగిస్తున్న రాజ్యాధికారంపైన బీజేపీకి నియంత్రణ లేకుండా చేయాలి. దీన్ని సాధించాలంటే లెనినిస్టు విప్లవ ఎత్తుగడల నియమాల ఆధారంగా సరియైన ఎత్తుగడలను అనుసరించి తీరాలి.**

### విప్లవ ఎత్తుగడలు

ఈ ప్రక్రియను ముందుకు తీసుకుపోవటానికి తగిన ఎత్తుగడలు అవసరం అవుతాయి. ఇప్పుడు కూడా లెనిన్ కార్యాచరణ, బోధనలు మార్గనిర్దేశం చేస్తాయి. లెనిన్ శత జయంతి సందర్భంగా స్వర్గీయ మాకినేని బసవ పున్నయ్య పీపుల్స్ డెమోక్రసీలో ఒక వ్యాసం రాశాడు. ఆ వ్యాసానికి ఆయన పెట్టిన శీర్షిక పేరు 'రాజ్యాధికారం కోసం, దాన్ని స్థిరీకరించటం కోసం చేసే పోరాటంలో కార్మికవర్గ ఎత్తుగడల ప్రవీణుడు'. చాలామంది చాలా తరచుగా లెనిన్ ఎత్తుగడల ప్రావీణ్యతను, రష్యన్ విప్లవం అంతిమంగా విజయం సాధించేవరకు ప్రతి మలుపులో ఆయన వేసిన ఎత్తుగడలు పోషించిన పాత్రను పట్టించుకోరు. ప్రపంచస్థాయిలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విప్లవోద్యమాన్ని ముందుకు నడిపేందుకు అనుసరించవలసిన ఎత్తుగడల గురించి ఆయన దిశా నిర్దేశం చేశాడు.

స్టాలిన్ తన "లెనినిజం పునాదులు" గ్రంథంలో లెనిన్ ఎత్తుగడల నియమాలు మూడు విషయాల మీద ఆధారపడి ఉంటాయని రాశాడు. వాటిని ఆయన ఇలా సంక్షిప్తీకరించాడు: (1) జాతీయ ప్రత్యేక లక్షణాలు, స్వభావాలు, (2) విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవటానికి కార్మిక వర్గానికి మిత్ర పక్షాలను కలిపేందుకుగల అవకాశం ఎంత చిన్నదైనా వదులుకోరాదు. ఈ ప్రయత్నంలో సదరు పక్షాలు తాత్కాలికంగానే కలుస్తాయా, నిలకడ లేకుండా ఉన్నాయా, నమ్మదగినవి కావా అనే విషయాలను పట్టించుకోనవసరం లేదు, (3) ప్రజా సమూహాలకు ఆచరణాత్మకమైన రాజకీయ అనుభవం రావటానికి కావలసిన రాజకీయశిక్షణకు ప్రచారం, ఉద్యమించటం మాత్రమే సరిపోవు.

### వర్తమాన పరిస్థితి


భారతదేశంలో ప్రస్తుతమున్న పరిస్థితిలో ఈ దిశలో ముందుకు పోవాలంటే బీజేపీని ఒంటరిని చేసి ఓడించటం తక్షణ కర్తవ్యంగా ఉండాలి. భారత రాజ్యాంగాన్ని నాశనం చేయటానికి, లౌకిక గణతంత్ర ప్రజా స్వామ్యాన్ని ఆర్ఎస్ఎస్ భావజాలానికి అనుగుణంగా ఒక తీవ్ర అసహన, పాసిస్టు "హిందుత్వ రాజ్యం"గా పరివర్తించటానికి ఉపయోగిస్తున్న రాజ్యాధికారంపైన బీజేపీకి నియంత్రణ లేకుండా చేయాలి. దీన్ని సాధించాలంటే లెనినిస్టు విప్లవ ఎత్తుగడల నియమాల ఆధారంగా సరియైన ఎత్తుగడలను అనుసరించి తీరాలి.

లెనినిజం వర్ధిల్లాలి!

(జనవరి 21 లెనిన్ శత వర్ధంతి)

అనువాదం : నెల్లూరు నరసింహారావు,

సెల్ : 8886396999




## పీచే ముడ్

(Back to pavilion)

గుంపుల నుండి గూడెంల దాకా
జనపదాల నుండి రాచరికాల దాకా
నియంతృత్వాల నుండి ప్రజాస్వామ్యాల దాకా
పురోగమించామనుకున్నా మిన్నాళ్ళు
మానవ వికాస చరిత్రను
గొప్పగా చెప్పుకున్నా మిన్నేళ్ళు

**మళ్లీ వెనక్కి మరలుతున్నామా!**
**తిరోగమనమే పురోగమనమనే**
**భ్రమల్లో తూగుతున్నామా!**
**ప్రజాస్వామ్యాల్లో మొలుచుకొస్తున్న నియంతలు**
**నియంతృత్వాల్లో పేట్రేగుతున్న జీహాదీలు**
**మధ్యయుగాల ఆలోచనా**

**పునాదులపై వెలుస్తున్న కొత్త భవంతులు**
**ఉన్మాదం అక్షింతలుగా**
**గడపగడపను పలకరిస్తున్న వైనాలు**

రాజ్యమే మతమై
మతమే రాజ్యమై
లౌకికత్వం సమాధై
సహనం ఆవిరై
ప్రజాస్వామ్యం అపహస్యమై
పెచ్చరిల్లుతున్న విచలిత గీతికల హోరు

యోధులెందరో ముసుగుతన్నారు
భక్తి రక్తిలో తడిసి మురిసారు
అక్షింతలు నెత్తిన జల్లుకొని పునీతులయ్యారు
మెజారిటీ వాదంలో ఓట్ల వేటకు తెడ్డు పట్టారు
గెలుపు బాటకు నామ జపం తప్పదని నమ్మారు

**అప్పుడు ఇప్పుడు ఎల్లప్పుడు**
**మతం అధికార సోపానాలెక్కెకగలిగేందుకు**
**అంది వచ్చిన ఆయుధం**
**మతం మార్పిడివించిన ఉన్మాద కేంద్రం**
**మతం ప్రబల పాలిత మత్తు మందు**
**మతం శస్త్ర చికిత్సకు లొంగని రాచ పుండు**

- వి.ఆర్. తూములూరి



## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సైల బదిలీలు

**నవతెలంగాణ - సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెద్ద ఎత్తున ఒకేసారి పదిమంది ఎస్సైలను ఎస్పీ అఖిల్ మహాజన్ బదిలీ చేయడం గమనార్హం. కొంత మంది ఎస్సైలు సాధారణ బదిలీలు కాగా మరికొంతమంది ఆరోపణలకు గురై బదిలీలు జరిగినట్లు సమాచారం. సిరిసిల్లలోని ఎస్‌బీలో పనిచేస్తున్న ఎల్ శ్రీకాంత్ బోయినపల్లి పోలీస్ స్టేషన్‌కు, కె ప్రశాంత్ రెడ్డి తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు, వేములవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జె రమేష్ వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌కు, చందుర్తి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అశోక్ రుద్రంగి పోలీస్ స్టేషన్‌కు, సిద్దిపేట కమిషనరేట్‌లో పనిచేస్తున్న రామ్మోహన్ గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు, తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు చందుర్తి పోలీస్ స్టేషన్‌కు, బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహేందర్, రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రాజేష్‌ను సరెండర్ చేస్తూ మూడవ జోన్‌కు బదిలీ చేశారు. వీర్నపల్లిలో పనిచేస్తున్న నవతను, గంభీరావుపేటలో పనిచేస్తున్న బి మహేష్‌లను సిరిసిల్ల ఎస్‌బీకి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# అప్పుడు ప్రతినెలా చెల్లించాం..
# ఇప్పుడు బకాయి ఉన్నాం



**దేశంలోనే తెలంగాణ ప్రాంతంలో ఏకైక విద్యుత్ సహకార సంస్థ సిరిసిల్లలో ఉంది. ఈ సంస్థ గతంలో లాభాల బాటలోనే ఉండేది. ప్రస్తుతం లాభనష్టాలు లేకుండా ఉంది. పాలకవర్గం ఏర్పడి ఏడాది పూర్తి కావడంతో నవతెలంగాణ సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో ఇంటర్వ్యూ చేసింది. దీంట్లో భాగంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2007నుంచి 2010వరకు తాను ఈ సెస్ సంస్థకు చైర్మన్‌గా ఉన్న సమయంలో ఎన్పీడీసీఈఎల్‌కు ప్రతినెలా విద్యుత్ బిల్లు చెల్లించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం మాత్రం 2020కి సంబంధించిన విద్యుత్ బిల్‌ను ఎన్పీడీసీఈఎల్‌కు చెల్లిస్తున్నాం, సెస్ సంస్థ రూ.698కోట్లు బకాయి ఉన్నట్లు చూపిస్తున్నారు. కానీ మాకు ప్రభుత్వం నుంచి వినియోగదారుల నుంచి రూ.700కోట్లు రావాల్సి ఉంది. ట్రాన్స్‌కోతో చర్చించి రూ.3 టారిఫ్ చేయాలని కోరతామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు నవ తెలంగాణతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడగా వెల్లడించిన వివరాలు..**

- నవతెలంగాణ, సిరిసిల్ల

- 2020విద్యుత్ బిల్‌ను ఎన్పీడీసీఈఎల్‌కు చెల్లిస్తున్నాం
- సెస్ రూ.698కోట్లు బకాయి ఉన్నట్లు చూపిస్తున్నారు..
- ప్రభుత్వం, వినియోగదారుల నుంచి రూ.700కోట్లు రావాల్సి ఉంది
- 2018నాటి ఎండీ వలనే యూనిట్ ధర పెరిగింది
- 2014నుంచి 2022నవంబర్ వరకు నియామకాల్లో అక్రమాలు
- సెస్ స్టోర్ స్థలం అద్దె ప్రతినెలా రూ.80వేలు చెల్లిస్తున్నాం..
- సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో నవతెలంగాణ ఇంటర్వ్యూ..

**నవతెలంగాణ : సెస్ పరిధిలో రూ.82కోట్ల నిధులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు ఎందుకు క్లోజ్ చేయలేదు? దాంట్లో పాలకవర్గం, అధికారుల పాత్ర ఎంతవరకు ఉంది?**

**సెస్ చైర్మన్ :** వర్క్ ఆర్డర్లు గత పాలకవర్గానికి సంబంధించినవి 2023జనవరిలో బాధ్యతలు తాము స్వీకరించగా రూ.82కోట్ల నిధులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయలేదు. మా పాలకవర్గం వచ్చిన ఏడాదిలోనే రూ.20కోట్ల వర్క్ ఆర్డర్లను క్లోజ్ చేశాం. వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయకపోవడానికి ప్రధానంగా అప్పటి పాలకవర్గం అధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనని చెప్పవచ్చు. కానీ ఎలాంటి అవకతవకలు మాత్రం జరగలేదు. తాము బాధ్యతలు తీసుకోక ముందు రూ.10కోట్ల డిమాండ్ మాత్రమే ఉండేది. ఈ ఏడాదిలోనే ఆ డిమాండ్‌ను రూ.20 కోట్లకు తీసుకొచ్చాం. మార్చి మాసం వరకు 30కోట్లకు తీసుకురావడానికి టార్గెట్ పెట్టుకున్నాం. లైన్ లాస్ 15 నుంచి 20లోపు ఉంది. 10లోపు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. పైలెట్ ప్రాజెక్టుగా తంగళ్ళపల్లి ఇల్లంతకుంట మండలాలను తీసుకున్నాం.

**నవతెలంగాణ : విద్యుత్ యూనిట్ ధర ఎందుకు పెంచారు? దీంట్లో అధికారుల పాత్ర ఉందా పాలకవర్గం పాత్ర ఉందా..?**

**సెస్ చైర్మన్ :** విద్యుత్ యూనిట్ ధర పెరగడానికి కారణం ప్రధానంగా 2018లో అప్పటి ఎండి కుట్రపూరితమైన ఆలోచన అని చెప్పవచ్చు. అతను డిస్కంలో కలిపి సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు తయారు చేసి తెలంగాణ ఎలక్ట్రిసిటీ నియంత్రణ మండలికి పంపించాడు. గతంలో 90పైసలకు యూనిట్ విద్యుత్ కొనుగోలు చేసేవాళ్లం. ఆయన వల్ల ప్రస్తుతం రూ.4.84 యూనిట్ విద్యుత్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రూ.3.96 యూనిట్‌కు పెరిగింది. ఎన్పీడీసీఎల్‌కు సెస్ సంస్థ రూ.400కోట్ల బకాయి ఉంది. దానికి రూ.298కోట్లు సర్ చార్జ్ వేశారు. రూ.698కోట్ల బకాయి ఉన్నట్లు చూపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వినియోగదారుల నుంచి సెస్ సంస్థకు రూ.700కోట్లు రావాల్సి ఉంది. ట్రాన్స్‌కోతో చర్చించి రూ.3 టారిఫ్ చేయాలని కోరడం జరిగింది.

**నవతెలంగాణ : విద్యుత్ బకాయిలు పెరగడానికి ఎవరి వైఫల్యం అని చెప్పవచ్చు.?**

**సెస్ చైర్మన్ :** విద్యుత్ బకాయిలు పెరగడానికి మా పాలకవర్గం వైఫల్యం కాదు. గతంలో నేను 2007 నుంచి 2010 వరకు చైర్మన్‌గా ఉన్న సమయంలో ఎన్పీడీసీఈఎల్‌కు అడ్వాన్స్‌గా విద్యుత్ బిల్లులు చెల్లించేవాళ్లం. మధ్యలో వచ్చిన పాలకవర్గం పూర్తి నిర్లక్ష్యం వహించడంతో విద్యుత్ బకాయలు పెరిగిపోయాయి. ప్రస్తుతం 2020 సంవత్సరానికి సంబంధించిన బిల్లులు కడుతున్నాం. సిరిసిల్ల-వేములవాడ ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యంతో పాటు బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. విద్యుత్ సిబ్బంది వినియోగదారులతో మాట్లాడుతూ బకాయిలు కట్టించే ప్రయత్నం చేస్తున్నారు. రూ.80కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రధానంగా సిరిసిల్లలో ఎస్ఎస్ఐ యూనిట్లు కేటగిరి 3లో ఉండాలి. కానీ కేటగిరి నాలుగులో నడుస్తున్నాయి. ఏడాది మే మాసం నుంచి ఇప్పటివరకు ఎస్-ఎస్ఐ యూనిట్లకు సంబంధించినవారు హైకోర్టులో కేసు ఉందని బిల్లులు చెల్లించడం లేదు.

**నవతెలంగాణ : సెస్ పరిధిలో విద్యుత్ అంతరాయం పెరిగిపోయింది. ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. పాలకవర్గం పట్టించుకోకపోవడమా.. అధికారుల నిర్లక్ష్యమా తెలియడం లేదు..?**

**సెస్ చైర్మన్ :** ప్రధానంగా విద్యుత్ వైర్ల కింద హరితహారం మొక్కలు నాటారు. అవి చెట్లుగా పెరిగి విద్యుత్ తీగల తగిలి అనేకసార్లు విద్యుత్ అంతరాయం కలుగుతున్నది. ప్రధానంగా 20ఏండ్ల కింది కండక్టర్లు ఉన్నాయి. వాటిని తొలగించి కొత్తవి వేస్తున్నాం. అండర్ గ్రౌండ్ కేబుల్ వేయడానికి గతంలో ప్రతిపాదనలు వచ్చాయి ప్రస్తుతం అవి ఆగిపోయాయి. అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేస్తే విద్యుత్ అంతరాయం ఉండదు. పాలకవర్గం ఐకమత్యంగా సెస్ అభివృద్ధి కోసం పని చేస్తుంది. కొంతమంది అధికారులు విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా వారిని గాడిలో పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నది. అయినా వైఖరి మార్చుకోని వారిపై శాఖాపరమైన చర్యలు తప్ప తప్పడం లేదు. ఉద్యోగులు ఉదయం 10.15 గంటలకు తప్పనిసరి విధులకు రావాలి 1.15కు వెళ్లాలి. మధ్యాహ్నం 2.15కు వచ్చి 5.30 వరకు ఉండాలి. బయోమెట్రిక్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అయినా సమయపాలన పాటించడం లేదనేది నా దృష్టికి వచ్చింది. క్రమశిక్షణా చర్యలు చేపడతాం.

**నవతెలంగాణ : సెస్ స్టోర్‌కు సంబంధించి స్థలం ప్రభుత్వానికి ఎందుకు ఇచ్చారు..? అలాగే వారసత్వ ఉద్యోగాలు ఏ ప్రాతిపదికన నియామకం చేస్తున్నారు..? ఉద్యోగాలు ఇప్పిస్తామని సెస్ కార్యాలయంలోనే సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి..!**

**సెస్ చైర్మన్ :** సెస్ స్టోర్‌కు సంబంధించిన స్థలం అప్పటి పాలకులు ఎలా ప్రభుత్వానికి ఇచ్చారో నాకు తెలియదు. కానీ ప్రస్తుతం సెస్ స్టోర్ కోసం స్థలం అద్దెకు తీసుకున్నాం. ప్రతి నెలా రూ.80వేలు అద్దె చెల్లిస్తున్నాం. ఇది అదనపు భారంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వానికి ఐదెకరాల భూమి ఇవ్వాలని విన్నవించాం. సెస్ పరిధిలోని రుద్రంగి, వేములవాడ అర్బన్, తంగళ్ళపల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో 15గుంటల స్థలం ఇస్తే సెస్ భవనాలు నిర్మాణం చేస్తాం. ప్రభుత్వ విప్‌తోపాటు వివిధ మండలాల పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలకు 15నుంచి 18సబ్ స్టేషన్‌లు అవసరమని చెప్పాం. ఇక వారసత్వ ఉద్యోగాలు మా పాలకవర్గం హయాంలో మరిచిపోవాలి. 2014నుంచి 2022నవంబర్ వరకు అక్రమంగా నియామకాలు జరిగాయి. రూల్స్‌కు విరుద్ధంగా వచ్చిన వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మాత్రం హెల్పర్ నుంచి ఏఈ వరకు జూనియర్ అసిస్టెంట్ నుంచి జేఏవో వరకు 95శాతం నోటిఫికేషన్ వేసి పారదర్శకంగా నియామకాలు జరుపుతాం. ఎవరైనా సెస్ కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నా.. అడిగినా.. మా దృష్టికి తీసుకురావాలి. పాలకవర్గం మాత్రం ఉద్యోగాలు ఇవ్వదు. గతంలో ఇలా డబ్బులు తీసుకుంటే వాటిని తిరిగి ఇప్పించి తీసుకున్న వారిపై చర్యలు చేపట్టడం జరిగింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ వేయడం జరుగుతుంది.

## మంత్రిని విమర్శించే స్థాయి మతతత్వ బీజేపీకి లేదు

### కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విషం చిమ్ముతున్నారని, ఆయను విమర్శించే స్థాయి బీజేపీ మతతత్వ నాయకులకు లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నర్సయ్య మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మతాన్ని అడ్డంపెట్టుకొని కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నదన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, అనిల్ రెడ్డిలు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన మాటలను వక్రీకరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నది కూడా చాలామంది హిందువులేనని మేము కూడా దేవుళ్లను కొలుస్తామన్నారు. కేవలం శ్రీరామచంద్రుడిని తమ స్వప్రయోజనాలకు బీజేపీ పార్టీ వాడుకుంటుందన్నారు. గతంలో బీఆర్ఎస్ నాయకులను బెదిరించినట్లుగా కాంగ్రెస్ నాయకులను బెదిరిస్తే ఊరుకోరని, ప్రజల మధ్యనే గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే సాహెబ్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏలూరి రాజయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సూడిది రాజేందర్, తిమ్మాపూర్ సింగిల్ విండో చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి దేవయ్య, రొడ్డ రామచంద్రం, వంగ మల్లారెడ్డి, చెన్ని బాబు, గంట బుచ్చగౌడ్‌లు పాల్గొన్నారు.


## ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు నేడు వేలం



**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన వివిధ వాహనాలకు గురువారం ఎక్సైజ్ స్టేషన్ వద్ద బహిరంగంగా వేలం నిర్వహించనున్నట్టు సీఐ యంపిఆర్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వేలంపాటలో నాలుగు ద్విచక్రవాహనాలను, రెండు ఆటోలను వేలం వేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ధరావత్తుగా 50శాతం ముందుగా డబ్బులు చెల్లించి వేలం పాటలో పాల్గొవాలని ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ వేలం పాట ఎక్సైజ్ సూపరింటెండెంట్ యస్ పంచాక్షరీ ఆధ్వర్యంలో ఉదయం 10గంటలలకు ప్రారంభం అవుతుందన్నారు.

## విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి

### ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి మోహన్



**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** విద్యార్థులు, యువత వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో పయనించాలని, చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవ పథకం ప్రత్యేక శీతకాల శిబిరం ఆధ్వర్యంలో బుధవారం రాజన్నపేట గ్రామంలో 5వ రోజు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి మోహన్ పాల్గొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయినుండే సేవాభావం అలవరుచుకోవాలని, గ్రామంలో శ్రమదానం సేవలు అభినందనీయం అన్నారు. సర్పంచ్ ముక్క శంకర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారయణ, గ్రామ కార్యదర్శి రవి, గ్రామ రక్షణాధికారి రవీందర్, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, కొడిముంజ సాగర్, కారోబార్ రామకృష్ణ, ఎండీ తాజొద్దీన్, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో ఔత్సాహికులను గుర్తించేందుకు అవగాహన : కలెక్టర్

**నవతెలంగాణ - సిరిసిల్ల :** నాబార్డ్ సౌజన్యంతో చేపట్టే జీవనోపాధుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వి నియోగం చేసుకునేందుకు ఆసక్తి చూపే నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాలను గుర్తించేందుకు జిల్లాలోని అన్ని ఆర్ అండ్ ఆర్ కాలనీలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నాబార్డ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులకు సూచించారు. బుధవారం ఐడీఓసీలో నాబార్డ్ సౌజన్యంతో చేపట్టే జీవనోపాధుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై నాబార్డ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారుల కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నాబార్డ్ సౌజన్యంతో ఇచ్చే శిక్షణ కార్యక్రమం కోసం ఎన్ రోల్ చేసుకున్న అభ్యర్థులకు శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్, స్టైఫండ్, వసతి సౌకర్యం కూడా ఉంటుందన్న విషయాన్ని యువతకు, స్వయం సహాయక సంఘాలకు తెలియజేయాలన్నారు. శిక్షణ తీసుకున్న సంఘాలను, వ్యక్తులను ప్రోత్సహించేందుకు యూనిట్‌ల స్థాపనకు వీలుగా లోన్ ఫెసిలిటీ కూడా ఉంటుందన్నారు. శిక్షణ పొందిన తర్వాత ఉమ్మడిగా సంఘాలు లేదా అభ్యర్థులు రూరల్ మార్ట్ పేరుతో యూనిట్‌లు పెట్టుకుంటే నాబార్డ్ రూ.5 లక్షల వరకూ ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. అవగాహనా సదస్సుల నిర్వహణ, శిక్షణ కార్యక్రమాల ప్లానింగ్‌ను మానిటరింగ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి, నాబార్డ్ జిల్లా డెవలప్మెంట్ మేనేజర్ మనోహర్ రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో మదన్ మోహన్ పాల్గొన్నారు.

## జనగామ వంతెనను పునర్‌నిర్మించాలి

### సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్

**నవతెలంగాణ - గోదావరిఖని:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తొమ్మిదవ డివిజన్ పరిధిలోని జనగామ గ్రామంలో గోదావరి వరదల కారణంగా కూలిపోయిన వంతెనను పున్ణనిర్మించాలని సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జనగామలో కూలిన వంతెనను వారు పరిశీలించి మాట్లాడుతూ నిధులు మంజూరైనా మరమ్మతులు చేపట్టక పోవడం వల్ల ఈ రోడ్డు గుండా వ్యవసాయ పనులకు వెళ్ళే రైతులు, గోదావరి నదికి వెళ్ళే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన నిర్మాణం కోసం మంజూరు అయిన నిధులు వాపస్ వెళ్ళే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పందించి ఈ కూలిన వంతెనను పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. సిపిఐ జనగామ కార్యదర్శి తోడుపునూరి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్ళపెల్లి మల్లయ్య, నాయకులు గుంపుల కుమారస్వామి, జైపాల్ రెడ్డి, కల్వల జగన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించండి



**నవతెలంగాణ - గోదావరిఖని:** సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని ఓసిపి 5 ప్రభావిత 33వ డివిజన్ ప్రజలు, కార్మికుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జీఎం చింతల శ్రీనివాస్‌కు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఓసీపీ-5 ప్రభావిత 33వ డివిజన్‌లోని సింగరేణి క్వాటర్ల వెనుకాల నూతన రోడ్లు, ఒక మంచినీటి బోరింగ్ ఏర్పాటు చేయాలని, సెక్టర్-2 కమ్యూనిటీ హాల్‌కు మరుమత్తులు చేయాలని ఈ వినతి ద్వారా కోరారు. అదేవిధంగా త్వరితగతంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సిసి కెమరాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని, డివిజన్ ప్రజల ఆరోగ్య రిత్యా హెల్త్ క్యాంప్‌లు మూడు నెలలకోసారి ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి జీఎం సానుకూలంగా స్పందించారని మద్దెల దినేష్ తెలిపారు.

## అరెస్టు చేసిన సీపీఐ(ఎం) నాయకులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కన్వీనర్ వేల్పుల కుమారస్వామి

**నవతెలంగాణ - గోదావరిఖని:** జగిత్యాల జిల్లాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 6నెలలుగా ఇండ్ల కోసం పోరాడుతున్న పేదల గుడిసెలను తొలగించి, సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు బనాయించి వారిని జైలుకు పంపడాన్ని పెద్దపల్లి జిల్లా ప్రజా సంఘాల పోరాట వేదిక తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కన్వీనర్ వేల్పుల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా పార్టీ నాయకుల అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సొంత ఇంటి జాగా ఉన్న వారికి ఇండ్ల నిర్మాణంకి ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే గత కొన్ని నెలలుగా ఇల్లు లేని నిరుపేదలందరూ ప్రభుత్వ స్థలాలు గుడిసెలు వేసుకొని ఉంటే వాటిని అక్రమంగా తెల్లవారి జామున 3గంటలకు పోలీసులు బుల్డోజర్స్‌తో గుడిసెలపై దాడులు చేసి 20మందిని అరెస్ట్ చేసి కరీంనగర్ జైలుకు పంపడాన్ని వారు తప్పుపట్టారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మహేశ్వరి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాగర్, పట్నం కమిటీ నాయకులు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రత్నం రమేష్



**నవతెలంగాణ - గోదావరిఖని:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పెద్దపెల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరి కానీ ఐఎఫ్టియు కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రత్నం రమేష్ మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాల టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం వల్ల విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యం చెందిందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయన్నారు. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ విద్యాసంస్థల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఎలా విద్యను అభ్యసిస్తారని, గత ప్రభుత్వ హయాంలో తమ జేబులు నింపుకోవడానికి తప్ప ఆ ప్రభుత్వం విద్యార్థులను ఎప్పుడు బాగు చేద్దామనే ఆలోచన లేదని అన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రెండు సంవత్సరాల నుంచి విడుదల చేయకపోవడం వల్ల దాదాపు రూ.8వేల కోట్లు బకాయిలు ఉండి విద్యార్థులకు రావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఇవ్వకపోవడం వలన విద్యార్థులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం కనీసం పేద విద్యార్థులు చదివే పాఠశాలలు కళాశాల బాగు చేయలేకపోతే వారు ఎలా చదువుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నరేష్, కళ్యాణ్, సురేష్, శ్రీకాంత్, సందాన్‌లు పాల్గొన్నారు.

## 15రోజుల్లో సీఎంఆర్ డెలివరీ లక్ష్యం పూర్తవ్వాలి

- తహసీల్దార్లతో ప్రత్యేక దృష్టి పెట్టి మానిటర్ చేయాలి
- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి

**నవతెలంగాణ - సిరిసిల్ల :** వచ్చే 15రోజుల్లోగా సీఎంఆర్ డెలివరీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా లోని తహసీల్దార్లను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీ వేగవంతం, భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం, ఓటు నమోదు దరఖాస్తుల పరిష్కారం సహా పలు అంశాలపై ఆర్డీ ఓలు, తహశీల్దార్‌లకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐడిఓసి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని తాసీల్దార్లు అన్ని రైస్ మిల్‌లు రన్ అయ్యేలా మానిటర్ చేయాలని చెప్పారు. సీఎంఆర్ రోజూ వారి టార్గెట్ నిర్దేశించుకుని టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. అనంతరం ధరణి, ఇతర భూసంబంధిత సమస్యలపై సమీక్షించారు. హైకోర్ట్, ఇతర ఉన్నత న్యాయ స్థానాల పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కోర్ట్ ఆర్డర్ ప్రకారం టైమ్ లైన్ లో అర్జీలను పరిష్కరించాలని చెప్పారు. తహశీల్దార్‌లు అందరూ భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్, సక్షేషన్ మినహా మిగితా దరఖాస్తులు పెండింగ్లో ఉండవద్దన్నారు. అలాగే మీసేవా సర్వీసెస్ పెండింగ్‌పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండలాల్లో కుల, ఆదాయ సర్టిఫికెట్, తదితర సర్టిఫికేట్‌లు పెండింగ్ లేకుండా రోజు వారీగా క్లియర్ చేయాలన్నారు. మీ సేవా సర్వీసెస్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను మిషన్ పరిష్కరించాలలని ఆదేశించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఫారం- 6,7,8 దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓటరు జాబితాలో డబుల్, డూప్లికేట్, డెత్ ఓటర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు పై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఓటు నమోదుకు అర్హతగల పూర్వ విద్యార్థుల వివరాలను పాఠశాలల నుంచి తీసుకుని వారిలో ఎవరైనా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోకుంటే వారిని వెంటనే నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ నెల 22వ తేదీ తర్వాత బీఎల్ఓ నుండి తమ బూత్ పరిధిలో డూప్లికేట్ ఓటరులు లేరనే సర్టిఫికేట్ తీసుకోనున్నందున అర్హత గల ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదుకు, ఆరోగ్యకర ఓటరు జాబితా తయారీకి ఓటు హక్కు నమోదు కోసం తహసీల్దార్లు బీఎల్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ధరణి పెండింగ్ అర్జీలను వచ్చే శనివారం లోగా పరిష్కరించాలని, సంబంధిత రిపోర్ట్ ను అందజేయాలని తహశీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కల్లా ఏ మండలాలలో అతి ఎక్కువ ధరణి పెండింగ్ అర్జీలు ఉంటే సంబంధిత టాప్ 3 మండలాల తహశీల్దార్ లు సోమవారం కలెక్ట రెట్‌కు వచ్చి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి గంగయ్య ,జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందం రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధు సాధన సమితి డివిజన్ కమిటీ సమావేశం

**నవతెలంగాణ - ముత్తారం:** ఐదు మండలాల దళిత బంధు సాధన సమితి డివిజన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. కలెక్టర్ అకౌంట్‌లో దళిత బంధుకు సంబంధించి డబ్బులు ఉండగా, ఎన్నికల కోడ్ రావడంతో దళిత బంధు పంపిణీ ఆపివేయడం జరిగిందని, ఇప్పుడు ఎన్నికల కోడ్ లేనందున దళితులకు కేటాయించిన యూనిట్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో డివిజన్ కమిటీ అధ్యక్షులు ఊట్ల శ్రీనివాస్, డివిజన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కే.చంద్రశేఖర్, డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులు ఆర్ల స్వామి, డివిజన్ కమిటీ క్యాషియర్ గద్దెల శంకర్, రాయనర్సు, దళిత బంధు లబ్ధిదారులున్నారు.

## మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తి చేయండి

**నవతెలంగాణ - గోదావరిఖని**

మిషన్ భగీరథ వాటర్ పైప్ లైన్ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి విజ్ఞప్తి చేశారు. రామగుండం కార్పొరేషన్ 3వ డివిజన్ అన్న పూర్ణ కాలనీ అంబేడ్కర్ భవన్ లైన్‌లో వారం రోజుల క్రితం మిషన్ భగీరథ వాటర్ పైప్ లైన్ కోసం మట్టితీసి పైప్ లైన్ పనులు పూర్తి చేయకుండానే వదిలి వేశారని తెలిపారు. మహిళలకు ఎంతో ఇష్ట మైన ముగ్గుల పండుగ పూట ముగ్గులు వేయడానికి వీలు లేకుండా ఇండ్ల ముందు మట్టి కుప్పలు ఉన్నాయని, అంతేగాకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. డ్రైనేజ్ వాటర్, వాటర్ పైప్ లైన్ కాలువలో చేరి పోతుందని, అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 'గుంటూరు కారం' సినిమాలో విలన్‌లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం అభ్యంతరకరం

**ఇప్టా నాయకులు కే.స్వామి, కన్నం లక్ష్మి నారాయణ**

**నవతెలంగాణ-గోదావరిఖని:** అర్థం పర్థం లేని సినిమాలు తీయడం, పొంతనలేని పేర్లు పెట్టడం తెలుగు చిత్ర పరిశ్రమలో రాను రాను ఎక్కువవుతున్నదని, శతి మించుతున్నదని ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) జాతీయ కౌన్సిల్ సభ్యులు కే.స్వామి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మి నారాయణలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో మందు ఎక్కువై మతి లేని కథలు వ్రాయటం, డ్రగ్స్‌కు బానిసలైన నిర్మాతలు చిత్రాలు నిర్మించటం, అజ్ఞానంతో మాటలు వ్రాయటం, దుష్పరిణామాలకు దారితీస్తున్నదన్నారు. గుంటూరు కారం సినిమాలో విలన్లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. సినిమాలో సుబ్రహ్మణ్యం అనే పేరున్న వ్యక్తి కలిస్తే మహనీయుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం పేరు పెట్టుకున్నావయ్యా అని అంటాడట, అయితే ఈ చిత్ర నిర్మాత దర్శకులకు మాటలు వ్రాసే సన్నాసులకు మార్క్స్, లెనిన్లు మహానుభావులుగా కనబడలేదా అని ప్రశ్నించారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని ప్రబోధించి సమాజానికి గొప్ప సామ్యవాద సిద్ధాంతాన్ని అందించి విప్లవాలకు ఊపిరి పోసిన ప్రణాళికలు రచించిన మార్క్స్ తెలియదా అని ప్రశ్నించారు. జారు చక్రవర్తుల నుండి భూస్వాముల పీడన నుండి రష్యాను విముక్తం చేసిన అక్టోబర్ సోషలిస్ట్ రెవల్యూషన్‌కి నాయకత్వం వహించిన మహా విప్లవకారుడు లెనిన్ గురించిన అవగాహన లేదా అని ప్రశ్నించారు. కథలు రాసేముందు, పేర్లు పెట్టేముందు కాస్త ఇంగిత జ్ఞానం ఉండాలన్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని, విలన్లకు పెట్టిన మార్క్స్, లెనిన్ అనే పేర్లు వెంటనే తొలగించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతిశీల వాదులు, ప్రజాస్వామ్య శక్తుల నుండి వ్యతిరేకత తీవ్రం కాకముందే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో నవతెలంగాణ ప్రముఖ పాత్ర


క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ - రాయికల్ : నవతెలంగాణ దినపత్రిక 2024క్యాలెండర్‌ను బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ దినపత్రిక ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని అన్నారు. నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు సమాచారం అందించడంలో వార్తా పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయ చెప్పారు. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తూ, ప్రజలను చైతన్య పరుస్తూ, సమాజ నిర్మాణానికి మూల స్తంభాలుగా పత్రికలు నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సుష్మా మున్సిపల్ మేనేజర్ వెంకటి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ సి.వి ప్రసాద్, సీనియర్ పాత్రికేయుడు రఘుపతి పాల్గొన్నారు.

# పేదల గుడిసెలపై రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్యం నశించాలి

- అర్హులైన వారికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.ఆశయ్య, రాష్ట్ర నాయకుడు గీట్ల ముకుందరెడ్డి



నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలు, సీపీఐ(ఎం) నాయకులపై మంగళవారం రోజున ఉదయం పోలీసులు దాడి చేసి అక్రమంగా కేసులు బనాయించి జైలులో పెట్టడం దారుణమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.ఆశయ్య, రాష్ట్ర నాయకుడు గీట్ల ముకుందరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జనరల్ బాడీ సమావేశం వెంకటచారి అధ్యక్షతన నిర్వహించారు.



సమావేశంలో వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో వీరనారి ఐలమ్మనగర్‌లో 6నెలలుగా పేదలు, కార్మికులు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని, పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్నారన్నారు. ఈ నెల 16న తెల్లవారుజామున 3గంటల సమయంలో వందలాది మంది పోలీసులు వచ్చి బుల్డోజర్లతో గుడిసెలను కూల్చి, విలువైన వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, కుట్టు మిషన్లు, హవానాలు, వంట సామగ్రి తీసుకెళ్లి పేద ప్రజలందరిని భయభ్రాంతులకు గురిచేసి, దాడులు చేసి ముఖ్య నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు లైల్లెల బాలకృష్ణతోపాటు 20 మందిని రిమాండ్ చేసి, కరీంనగర్ జిల్లా జైలుకు పంపారన్నారు. గత పాలకులకు ఈ పాలకులకు ఏమి తేడా లేకుండా ఉందని విమర్శించారు. ఈ రాష్ట్రంలో ఎమ్మెల్యే, ఎంపీలు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా చేసి అమ్ముకుంటుంటే వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపకుండా చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు దొంగలకు వత్తాసు పలుకుతూ ఉండడం సరైంది కాదన్నారు. అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే కూల్చిన ఇండ్ల స్థలాలోనే పేదలకు ఇంటి నిర్మాణం చేసి, వాటికి పట్టాలు ఇవ్వాలని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సారంగపాణి, శారద, కె.చంద్రశేఖర్, సుధారాణి, హరీశ్, ఎండి.సలీం, హఫిజ, సులేమాన్, పద్మ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం దావోస్ స్వాగత కార్యక్రమంలో జగిత్యాల వాసుల కీలకపాత్ర

నవతెలంగాణ - జగిత్యాల టౌన్



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమ్మిట్‌లో పాల్గొనడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఈ నెల 15న జ్యూరిక్ విమానాశ్రయానికి చేరిన సందర్భంగా తెలుగు ప్రవాసులు ఘన స్వాగతం పలికారు. జగిత్యాలకు చెందిన ఇద్దరు మహ్మద్ ఇమ్రాన్, మంద భీంరెడ్డి కీలకపాత్ర పోషించారు. ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక కేంద్రంగా భావించే స్విట్జర్లాండ్‌లో 20ఏండ్లుగా నివసిస్తున్న మహ్మద్ ఇమ్రాన్‌ది జగిత్యాల పట్టణం ఖిలాగడ్డ. ఒక బహుళజాతి సంస్థలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఇమ్రాన్ జ్యూరిక్‌లోని తెలుగు ప్రముఖులలో ఒకరు. స్థానిక స్విస్ తెలుగు ప్రవాసులతో అనుసంధానం చేస్తూ సీఎం స్వాగత కార్యక్రమం విజయవంతానికి ఆయన కృషి చేశారు. జగిత్యాలకు సమీపంలోని నాగునూరు - లచ్చక్కపేట కు చెందిన వలస వ్యవహారాల విశ్లేషకుడు, టిపిసిసి ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ముఖ్యమంత్రి ప్రయాణించిన విమానంలోనే ఢిల్లీ నుంచి జ్యూరిక్‌కు వెళ్లి అక్కడి ప్రవాసీయులతో కలిసి సమన్వయం చేయడంతో స్వాగత కార్యక్రమం విజయవంతమైంది.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎన్.శ్రీనివాస్



నవతెలంగాణ - కొడిమ్యాల

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని శ్రీరాములపల్లి, నమలికొండ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్హులైన వారికి మరింత చేరువ చేసేందుకు దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అని అన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ మధుసూదన్ పలు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసరెడ్డి, మల్యాల అనిత, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, సింగిల్‌విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ పరమేశ్వరి, సిహెచ్ఓ రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ అలివేలు, అంగన్వాడీ సూపర్వైజర్ సుధారాణి, పోస్టల్ అధికారి సరిత, కార్యదర్శి రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యం అందించాలి

### వైద్యులతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్



నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జగిత్యాల పట్టణానికి చెందిన దుమాల విష్ణు కుమారుడు నీలోఫర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు నాణ్యమైన చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్‌కు షిఫ్ట్ చేయాలని తెలపగా బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు దుమాల రాజ్‌కుమార్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే నిమ్స్ హాస్పిటల్ వైద్యుడు కార్డియాక్ సర్జన్ డాక్టర్ అమరేష్‌ని సంప్రదించి తగిన వైద్యం అందించాలని కోరగా సానుకూలంగా స్పందించి తగిన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు దుమల రాజకుమార్, దుమాల విష్ణు కృతజ్ఞతలు తెలిపారు.

# మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు నేటి నుంచి దరఖాస్తులు

- ఫిబ్రవరి 6వరకు అవకాశం
- 4వతరగతి చదువుతోన్న వారు అర్హులు
- జిల్లాలో 7స్కూల్స్.. 560 సీట్లు

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్లో (టీఎంఆర్ఈఐఎస్) వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తు చేసుకునేందుకు మైనారిటీ సంక్షేమ శాఖ ప్రకటనను విడుదల చేసింది.

జిల్లాలో ఐదోతరగతికి గురుకులాల్లో, ఇంటర్‌కు జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో www.tmreistelangana.cgg.gov.in ద్వారా లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేయవచ్చు. సందేహాలకు 040 23437909కు ఫోన్ చేయవచ్చు, జిల్లాల్లోని మైనారిటీ సంక్షేమ అధికారులను, గురుకులాల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చు.

### ప్రవేశాల విధానం ఇదీ..

5వ తరగతి: మైనారిటీలకైతే ముందు దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు ఇస్తారు. ఇతరులకు లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయిస్తారు. 6, 7, 8 తరగతులు (ఖాళీలుంటేనే): మొదట దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు కేటాయిస్తారు.

ఇంటర్ ఫస్టియర్ (జనరల్, ఒకేషనల్): పదో తరగతిలో మెరిట్ ఆధారంగా ఇస్తారు.

'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో ఇంటర్: ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తారు.

జిల్లాలో మైనారిటీ గురుకులాలు

జగిత్యాల జిల్లాలో బాలురకు నాలుగు, బాలికలకు మూడు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పాఠశాల, కళాశాలను కలుపుకొని బాలుర, బాలికలకు ధర్మపురిలో 2, జగిత్యాలలో 3, కోరుట్లలో 1, మెట్‌పెల్లిలో 1 ఉన్నాయి.

ఒక్కో పాఠశాలలో 80సీట్ల చొప్పున జిల్లాలో 560 సీట్లు, అదేవిధంగా కళాశాలలో 40 సీట్లు ఉన్నాయి. పాఠశాలల్లో మైనార్టీలకు 60, బీసీ 10, ఎస్సీ 5, ఎస్టి 3, ఓసి 2 చొప్పున మొత్తం 80 సీట్లు ఉన్నాయి. మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీలలో దరఖాస్తులకు అవకాశం ఉంది.

దరఖాస్తు చేసుకునే విద్యార్థిని, విద్యార్థులలో గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం 2లక్షలలోపు ఉండాలి. మరిన్ని వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

### ఆన్ లైన్ లో దరఖాస్తుకు కావలసినవి...

పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్, జనన ధృవీకరణ పత్రము, లేదా స్టడీ, కుటుంబ ఆదాయం సర్టిఫికెట్, కులము సర్టిఫికెట్ (అవసరమైనచో), సెల్ నంబరు, నివాస ధృవీకరణ సర్టిఫికెట్.

### అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..



జిల్లాలోని మైనార్టీ స్కూల్, కళాశాలలో దరఖాస్తులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హతలు ఉన్నవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో అన్ని సౌకర్యాలతో పాఠశాల, కళాశాలు నిర్వహిస్తున్నాం. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఉత్తమ బోధనా అందించబడి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలి.

సాయిబాబా, జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి
(పూర్తి అదనపు బాధ్యతలు)

## టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో టీపీటీఎఫ్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా-వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలకు ఎమ్మెల్సీని జిల్లా శాఖ పక్షాన ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో జగిత్యాల జిల్లా టీపీటీఎఫ్ అధ్యక్షుడు బోగ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెండవ విద్యా వైజ్ఞానిక మహాసభలను ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మం నగరంలోని నయాబజార్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సూద రాజేందర్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రామచంద్రం, గొడుగు రఘుపతి యాదవ్, సంగనభట్ల రవీందర్, సిహెచ్‌వి.సత్య ప్రకాష్, ఎడ్ల గోవర్ధన్, సిర్ప నాగభూషణం, ఇ.సంజీవరాణి, రాచమల్ల మహేష్ పాల్గొన్నారు.

## వైకుంఠ రథం వితరణ


దాతలను సన్మానిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ - కోరుట్ల

మండలంలోని సంగెం గ్రామంలో రైస్ మిల్ యజమానులు కొత్త గణేష్, కొత్త శ్రీనివాస్ గ్రామానికి తల్లిదండ్రుల పేరుతో వైకుంఠ రథం అందజేశారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ చెప్యాల నర్సయ్య, గ్రామ రైతు సంఘ అద్యక్షుడు సుదవేని భూమయ్య శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి జువ్వాడి కృష్ణారావు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణారావు

నవతెలంగాణ - మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్త నక్క కళ్యాణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. నాయకులు జెట్టి లింగం, పూదరి నర్సాగౌడ్, శేఖ్ మహ్మద్, బుర్ర మహేందర్ ఉన్నారు.

## జీఓ 46ను యథావిధిగా కొనసాగించాలి

### ఎంపికైన అభ్యర్థులందరిని తక్షణమే ట్రైనింగ్‌కు పంపించాలి

### ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు


సమావేశమైన జగిత్యాల జిల్లా అభ్యర్థులు

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

కానిస్టేబుల్ నోటిఫికేషన్ 2022 ద్వారా ఎంపికైన జగిత్యాల జిల్లాకు చెందిన వారు బుధవారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్‌లో ఫలితాలు విడుదలయ్యాయని, కొందరు ఉద్యోగం రాని అభ్యర్థులు ఈ నోటిఫికేషన్‌పై తప్పుడు కేసులు వేస్తూ కాలయాపన చేయడం వల్ల మానసికంగా, ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని వాపోయారు. ఈ నోటిఫికేషన్‌లో కొత్తగా అమలు చేసిన జీఓ 46 వలన స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు కేటాయించారని, దాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. వెంటనే ఎంపికైన అభ్యర్థుల జాబితాను అలాగే కొనసాగిస్తూ సివిల్, ఏఆర్‌తో పాటు టిఎస్ఎస్‌పి వారిని కూడా త్వరగా శిక్షణకు పంపాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ఎండీని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


సీడ్స్ కార్పొరేషన్ ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ఎండి కేశవులును వారి కార్యాలయం హైదరాబాద్‌లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిసారు. లక్ష్మిపూర్ గ్రామంలో సీడ్ ప్రాసెస్ యూనిట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కరీంనగర్ సీడ్ ప్రాసెస్ సెంటర్‌ను మెడికల్ కాలేజీకి కేటాయించడంతో అక్కడి యంత్ర సామగ్రిని లక్ష్మిపూర్‌కి తరలిస్తామని గతం లో హామీ ఇచ్చారని, మిగతా పనులు కుడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి ఎంపీపీ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, సమిండ్ల శ్రీనివాస్ ఉన్నారు.

## వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

### ఏఓ అధికారి షాహిద్‌అలీ


సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి

నవతెలంగాణ - మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలంలోని కొండ్రికర్ల, కోనరావుపేటలో బుధవారం మండల వ్యవసాయ అధికారి వరి పొలాలను పరిశీలిచారు. మొగిపురుగు ఉధృతిని గుర్తించారు. మొగి పురుగు వేగంగా వ్యాప్తిచెందుతుంది కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మొగిపురుగుని నివారించేందుకు పలు సూచనలు చేసారు. ఆయనవెంట గ్రామ వ్యవసాయ అధికారి భూమేశ్వర్, రైతులు అనిరెడ్డి మారుతి, జవుడ రమేష్, గంగారెడ్డి ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి కారోబార్లు వినతి


నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జిల్లాలోని కారోబార్ ఉద్యోగస్తులు వారి సమస్యలు పరిష్కరించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## 2కిలోల గంజాయి పట్టివేత

### ఒకరి అరెస్టు





నవతెలంగాణ - రాయికల్

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు రాయికల్ ఎస్ఐ అజయ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు పట్టణంలోని భరతమాత విగ్రహం దగ్గర ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలానికి చెందిన ఆత్రం సోనేరావును పట్టుకొని అతని వద్ద నుండి రూ.50వేల విలువ గల 2.03 కిలోల గంజాయి, ఒక సెల్ ఫోన్ జప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టుపడిన భూపతిపూర్‌కు చెందిన నిందితులకు సోనే రావు గంజాయిని అమ్ముతుండేవాడని, బుధవారం గంజాయిని అమ్మటానికి రాయికల్ వచ్చే క్రమంలో పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం దర్యాప్తు అధికారి జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్ నిందితుడిని రిమాండ్‌కి తరలించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్స్ సాగర్, సంతోష్, ప్రశాంత్‌ను సీఐ అభినందించారు.

## విలువలతో కూడిన జర్నలిజమే సమాజానికి అవసరం

### 2024-క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జీడీకే 2టౌన్ సీఐ సూరం వేణుగోపాల్


క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న సీఐ సూరం వేణుగోపాల్

**నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ :** విలువలతో కూడిన జర్నలిజమే ఈ సమాజానికి అవసరమని ప్రజా సమస్యలే ఎజెండాగా వార్తలు రాసేది నవతెలంగాణ పత్రిక అని గోదావరిఖని 2టౌన్ సీఐ సూరం వేణుగోపాల్ అన్నారు.బుధవారం నవతెలంగాణ దినపత్రిక 2024 క్యాలెండర్‌ను టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగానికి తెలియపరుస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలను వెలికితీసినప్పుడే పత్రిక శాశ్వతంగా ప్రజల మన్ననలు పొందుతుందని అన్నారు. కార్యక్రమంలో సీఐ2 అఫ్జలుద్దీన్, ఎస్ఐలు ఎం.చంద్ర శేఖర్, ఎస్కే ఫరీద్ పత్రిక పెద్దపల్లి ఏడీవీటీ ఇన్‌చార్జి ఎం.శోభన్ బాబు, 8వ కాలనీ రిపోర్టర్ శివ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలే ఎజెండగా నవతెలంగాణ

### జూలపల్లి తహసీల్దార్ బషీరుద్దీన్


నూతన క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న జూలపల్లి తాసిల్దార్ బషీరుద్దీన్

**నవతెలంగాణ - జూలపల్లి :**
ప్రజా సమస్యలే ఎజెండగా నవతెలంగాణ దినపత్రిక పని చేస్తుందని తహసీల్దార్ బషీరుద్దీన్ అన్నారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో నవతెలంగాణ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే ధ్యేయంగా నవ తెలంగాణ దినపత్రిక పని చేస్తున్నదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న దినపత్రిక నవతెలంగాణ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబూబకర్, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, ఆర్ఐ సదయ్య,స్రవంతి, జూలపల్లి నవతెలంగాణ రిపోర్టర్ శంకరయ్య, తదితరులు ఉన్నారు.

## డోర్స్ కార్యవర్గానికి కలెక్టర్ అభినందన



**నవతెలంగాణ - సిరిసిల్ల :** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ లకు డోర్స్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ఎంపికను జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారుల అసోసియేషన్ డోర్స్ నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక ఇటీవలే జరిగింది. డోర్స్ ఫౌండర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ ఉండగా, డోర్స్ అధ్యక్షుడిగా జిల్లా రవాణా అధికారి వై కొండల్ రావు, జనరల్ సెక్రటరీ గా ఎ వినోద్ కుమార్, కోశాధికారిగా పిబి శ్రీనివాస చారి , ప్రచార కార్యదర్శిగా మామిండ్ల దశరథం ఎంపికయ్యారు. నూతన నియామకం అయిన డోర్స్ అధ్యక్షులు జిల్లా రవాణా అధికారి వై కొండల్ రావు, కోశాధికారిగా పిబి శ్రీనివాస చారి , జాయింట్ సెక్రటరీ బి గంగయ్య, ప్రచార కార్యదర్శులు మామిండ్ల దశరథం, భాస్కర్, కార్యవర్గ సభ్యులు లక్ష్మి రాజం లు డి ఆర్ డి ఓ నక్క శ్రీనివాస్,అదనపు డి ఆర్ డి ఓ మదన్ లు కలెక్టర్ ను కలిశారు. డోర్స్ నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం పెంపొందిస్తూ ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

## సహకార క్రాంతి డిపాజిట్ పథకాన్ని ఉపయోగించుకోవాలి

- కేడీసీసీ బ్యాంక్ జీఎం ఉషశ్రీ
- ఇంటింటికీ తిరుగుతూ డిపాజిట్ల సేకరణ


మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంక్ జీఎం ఉషాశ్రీ

**నవతెలంగాణ - మంథని :** కేడీసీసీ బ్యాంక్ ప్రవేశ పెట్టిన సహకార క్రాంతి డిపాజిట్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కేడీసీసీ బ్యాంక్ జీఎం ఉషశ్రీ కోరారు. బుధవారం కేడీసీసీ బ్యాంక్ జీఎం ఉషశ్రీ, మేనేజర్ దుమ్మని లక్ష్మన్, డీఈ దీలిప్, బ్యాంక్ సిబ్బంది మంథని పట్టణంలోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ డిపాజిట్లను సేకరించారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ జీఎం ఉషశ్రీ మాట్లాడుతూ అఖిల భారత స్థాయిలో గత దశాబ్దపు అత్యుత్తమ సహకార బ్యాంక్ గా గుర్తింపు పొంది గత ఏడేళ్లుగా అవార్డులను అందుకుంటూ వంద సంవత్సరాలకు పైగా సేవలు అందిస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్న బ్యాంకు సహకార బ్యాంకు అన్నారు. అన్ని వాణిజ్య బ్యాంకుల కంటే ఎక్కువగా వడ్డీ రేటు అందిస్తుండటంతో క్రాంతి డిపాజిట్ పథకానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. సహకార క్రాంతి డిపాజిట్లపై 546రోజులకు 7.50శాతం, సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ పొంది ఆర్థికంగా వద్ధి చెందాలని ఆకాంచారు.

## పెద్దాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్


ట్రోఫీని అందుకుంటున్న రాజు

**నవతెలంగాణ - జూలపల్లి :** మండలంలోని పెద్దపూర్ గ్రామంలో బుధవారం కల్లేపెల్లి నవీన్ కుమార్ అధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కల్లేపెల్లి లింగయ్య హాజరయ్యారు. ఈ టోర్నీమెంట్ మొదటి బహుమతి గెలిచిన విజేత మల్లారపు రాజు, రెండో బహుమతి విజేత చొప్పరి అనిల్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజేత మామిడిపెల్లి సురేందర్, బెస్ట్ బౌలర్ విజేత కళ్లెపెల్లి సురేందర్ నిలిచారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు కల్లేపెల్లి లింగయ్య చేతుల మీదుగా ప్రైజ్ మనీ, ట్రోఫీని అందించారు.

## పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

- పోరాడిన నాయకులపై కేసులు ఎత్తివేయాలి
- ప్రజాసంఘాల ప్రతినిధి మల్లారపు అరుణ్ కుమార్


మాట్లాడుతున్న అరుణ్ కుమార్

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రజాసంఘాల ప్రతినిధి మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బివై నగర్ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూముల కొరకు రైతుల పక్షాన నిలబడిన పోరాడిన వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే వారిపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న ఎస్సీ ఎస్టీ బీసీ భూమి లేని నిరుపేదలకు హక్కు పత్రాలు కల్పించాలని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చూపాలన్నారు. లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతి పడుతుందని హెచ్చరించారు. సమస్య పరిష్కరించుకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఈసంపల్లి కొమురయ్య, జింకపోచయ్య, జాలపల్లి మనోజ్ గజ్జల ప్రశాంత్ గుర్రపు నరేష్ రమేష్ చంద్ర పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పాత్ర కీలకం

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

**నవతెలంగాణ - సిరిసిల్ల :**
నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్ పెట్రో కార్ సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. డయల్ 100 కు కాల్ చేయగానే పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తారని ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిపై నిఘా ఉంచాలన్నారు. సస్పెక్ట్, రౌడీ, కేడీ, డిసిలను, విధిగా పాయింట్స్ బుక్స్ తరచుగా చెక్ చేయాలన్నారు. ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ అధికారుల పాత్ర కీలకం అని, డయల్ 100 కాల్ వచ్చినప్పుడు అత్యవసర సమయంలో బాధితులకి వేగవంతమైన స్పందన తప్పక ఇవ్వాలని తక్కువ సమయంలోనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించే విధంగా సేవలు అందించాలని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది, ప్రజల పట్ల బాధ్యతగా మెలగాలని, అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. విసిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అత్యవర సేవలు అయిన రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, పట్టణాల, గ్రామాలలో జరిగే అవాంఛనీయ ఘటనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మొదలైన వాటికి సంబంధించిన డయల్ 100కాల్ ద్వారా సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది లేదా పెట్రోల్ వెహికల్స్ సిబ్బంది తక్షణమే స్పందించి తగు చర్యలు అందించాలన్నారు. ప్రజలలో భద్రతభావం పెంపొందిస్తూ నేరస్తులకు నేరం చేస్తే పట్టుబడుతామనే భయం కల్గించే లక్ష్యంతో బ్లూ కోల్ట్స్ సిబ్బంది విభాగంలోని అధికారులు తమ ఏరియా పై సమగ్ర సమాచారం కలిగి ఉండి ఆప్రాంత ప్రజల రక్షణకు భరోసా కల్పించాలని అన్నారు. గస్తీ తిరుగుతున్న ఏరియా నుంచి రిపోర్ట్ చేయబడిన అన్ని డయల్100 ఫిర్యాదులను నిర్ణీత సమయంలో అటెండ్ చేయడంతో పాటు బాధితులకు సత్వర సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,వర్టికల్ డిఎస్పీ రవీందర్, సి.ఐ కరుణాకర్ సిఐ వెంకటేష్ బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు

## నిరంతరం కార్మికులకు ఉపాధి కల్పించాలి

- టెక్స్‌టైల్ పార్క్ ఏడీకి వినతి పత్రం అందజేత
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



టెక్స్టైల్ పార్క్‌లోని క్యాంటీన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

**నవతెలంగాణ - తంగళ్ళపల్లి :**
టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ అన్నారు. మండలంలోని టెక్స్ టైల్ పార్క్ లో గత 15 రోజులుగా యజమానులు పరిశ్రమలను బంద్ చేయడంతో కార్మికులకు ఉపాధి లేకపోవడంతో దానికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో క్యాంటీన్ ముందు కార్మికులందరూ బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం టెక్స్ టైల్ పార్క్ ఏడీ అశోక్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...టెక్స్ టైల్ పార్క్‌లో యజమానులు ప్రభుత్వ ఆర్డర్లు వచ్చినప్పుడే పరిశ్రమలను నడిపించి తర్వాత బంద్ చేయడం జరుగుతుందన్నారు. అందువల్ల కార్మికులు సరైన ఉపాధి లేక తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందన్నారు. ఇకముందు యజమానులు పరిశ్రమలను తరచూ బంద్ చేయకుండా ఉండే విధంగా యజమానులతో, కార్మికుల సమక్షంలో చర్చలు జరపాలన్నారు. పరిశ్రమలను బంద్ పెట్టకుండా నడిపించి నిరంతరం కార్మికులకు ఉపాధి కల్పించే వారికే ప్రభుత్వ ఆర్డర్లను కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా టెక్స్ టైల్ పార్క్‌లో ఖాళీగా, అసంపూర్తిగా నిర్మాణమై ఉన్న షెడ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వేరే వారికి కేటాయించి పరిశ్రమలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టెక్స్ టైల్ పార్క్‌కు వచ్చే ప్రభుత్వ ఆర్ వీఎం వస్త్రానికి సంబంధించి పవర్లూమ్ కార్మికులకు, అనుబంధ రంగాల కార్మికులకు ప్రయోజనం కలిగే విధంగా కూలీ నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, టెక్స్టైల్ పార్క్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్, శుభషేకర్, నరేష్, నరేందర్, రమేష్, భాస్కర్, శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

## వర్సిటీల్లో కులమతాల పేరిట వివక్ష

- విద్యార్థి ఉద్యమ జాతీయ నాయకుడు జూపాక శ్రీనివాస్
- హెచ్‌సీయూ విద్యార్థి వేముల రోహిత్ 8వ వర్ధంతి



వేముల రోహిత్ వర్ధంతిని నిర్వహిస్తున్న నాయకులు

**నవతెలంగాణ - కోల్‌సిటీ :**
స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లకు పైగా అవుతున్నా ఉన్నత విద్యా సంస్థలైన యూనివర్సిటీల్లో నేటికీ కుల, మతాల వివక్ష కొనసాగుతోందని, విద్యార్థులను కులం, మతం పేరిటి విభజించి వారిపై వివక్ష చూపుతున్నారని విద్యార్థి ఉద్యమ జాతీయ నాయకుడు జూపాక శ్రీనివాస్ అన్నారు. కులమత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలో తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ ఆరెపల్లి క్రాంతికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ వేముల రోహిత్ 8వ వర్ధంతి కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. రోహిత్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. యునివర్సిటీ అధికారుల కుల వివక్షత, మనువాద చేష్టలు రోహిత్ ఆత్మహత్య కారణమయ్యాయన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య వివక్షను మరింత పెంచేలా నూతన విద్యా విధానం పేరుతో కార్పొరేటు, ప్రైవేటు, విదేశీ యూనివర్సిటీల రాకను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ విద్యావిధానం పూర్తి స్థాయిలో అమలైతే పేద, మధ్యతరగతి, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు చదువు అందకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసేలా వాటికి నిధులు కేటాయించకుండా, అధ్యాపక పోస్టులు నింపకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఎంతో మంది దేశ, రాష్ట్ర నాయకులను అందించి, చైతన్యానికి ప్రతీకలైన ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఈ రోజు మూసివేత దిశగా వెళ్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఆరు శాతం మాత్రమే పేద వర్గాలకు ఉన్నత విద్య అందుతుంటే నూతన విద్యావిధానంతో వారికి అన్యాయం చేసేలా కేంద్రం కుట్ర పన్నుతోందని, దీనిలో భాగంగానే సెంట్రల్ యూనివర్సిటీ వీసీ అప్పారావు అక్కడి స్కాలర్ వేముల రోహిత్‌కు ఫెలోషిప్‌ను నిలిపివేసి, అనేక ఇబ్బందులకు గురిచేసి ఆయన మతికి కారకుడయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల మత రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు విద్యార్థి యువజన సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, పీడీఎస్‌యు నాయకులు ప్రసన్న, సామజికవేత్త పులిపాక రాజ్ కుమార్, వేముల లక్ష్మణ్ గుండ్ల మల్లికార్జున్, సనవాజ్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపుతో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం గెలిచింది

- ప్రొఫెసర్ కోదండరాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పౌర సన్మానం



**నవతెలంగాణ - వేములవాడ రూరల్ :**
రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పౌర సన్మాన కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ వేములవాడలో ప్రజా సంఘాలు, పెద్దలు అందరూ కలసి ఆది శ్రీనివాస్‌కు పౌర సన్మానం చేయడం అభినందనీయమన్నారు. గత ఎన్నికల ప్రచార సమయంలో నేను కూడా అతని గెలుపుకోసం ఒక చిరు కర్తవ్యం నిర్వహించానన్నారు. వేములవాడ ప్రాంతంలో బలమైన శక్తులను తట్టుకొని నిలబడటం ఒక గొప్ప విషయమని, ప్రత్యర్థులు ఎన్ని రకాలుగా కుట్రలు చేసినా ప్రజలు పేదల నాయకుడు, ప్రశ్నించే గొంతుకైనా ఆది శ్రీనివాస్‌కు పట్టం కట్టారన్నారు. ఈ గెలుపు తెలంగాణ ప్రజల విజయం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ప్రజలకు ఒక స్వేచ్ఛ వచ్చిందన్నారు. అభివృద్ధి పేర రూ.6లక్షల కోట్ల అప్పులు చేసి తీరా చూస్తే రాష్ట్రం అంతటా సమస్యలు అలానే ఉన్నాయని అన్నారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను వేములవాడ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇంత గొప్ప పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం దానికి తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథులుగా రావడం వారి చేత ఈ ఆతిథ్యాన్ని స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ప్రజా సమస్యలపై అలుపెరిగిన పోరాటం చేసిన వాడిగా ప్రతి సమస్యపై స్పష్టమైన అవగాహన ఉన్నవాడిగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు నేరెళ్ల తిరుమల గౌడ్, జన సమితి జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య ఆహ్వాన కమిటీ సభ్యులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామీ, కౌన్సిలర్ బింగి మహేష్, వై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్, కాంగ్రెస్ నేతలు భారీగా ప్రజలు పాల్గొన్నారు.

## 19న కార్మిక, కర్షక సదస్సు

### సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు


మాట్లాడుతున్న సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యం రావు.

**నవతెలంగాణ - మంథని :**
ఈ నెల 19న నిర్వహించనున్న కార్మిక, కర్షక సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు కోరారు. బుధవారం మంథనిలో సీఐటీయూ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1982లో సీఐటీయూ రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఆనాటి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేశాయని, సమ్మె పట్ల తమిళనాడు ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించి పదిమంది కార్మికులను పొట్టన పెట్టుకున్నదన్నారు. ఈ సమ్మె పోరాట స్ఫూర్తిగా ప్రతి సంవత్సరం జనవరి 19న కార్మిక కర్షక దినంగా పాటించాలని సంఘాలు పులిపినిచ్చాయని తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల19న పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో మూడు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా సదస్సుకు రైతులు హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాసపల్లి తిరుపతి, వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద రాజేందర్, బూడిద గణేష్ జిల్లా నాయకులు బావు రవి పాల్గొన్నారు.

## సిరిసిల్ల పట్టణ సీఐగా రఘుపతి బాధ్యతల స్వీకరణ



**నవతెలంగాణ - సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ సీఐగా బోడకుంట రఘుపతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన రఘుపతి హనుమకొండ జిల్లా వాస్తవ్యుడు. 2006 నుంచి 2009 వరకు ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు 2009 నుంచి 2010 వరకు మంచిర్యాల ఎస్ఐగా 2010 నుంచి 2011 వరకు బైంసా రూరల్ ఎస్సైగా 2012 నుంచి 2013 వరకు ముధోల్ ఎస్సైగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. సీఐగా పదోన్నతి రావడంతో కరీంనగర్ సీఐడీ విభాగంలో 2013నుంచి 2015వరకు పని చేశారు. ముథోల్ సీఐగా 2017నుంచి 2018వరకు ఇంటలిజెన్స్ సీఐగా 2018నుంచి 2022వరకు ఆదిలాబాద్ రూరల్ సీఐగా 2022నుంచి 2023జూలై వరకు, సిరిసిల్ల డీసీఆర్బీ సీఐగా 2023 జూలై నుంచి 2024 జనవరి 16వరకు రఘుపతి పని చేశారు. ఈ నెల 17న సిరిసిల్ల పట్టణ సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు

## ట్రాన్స్ ఫార్మర్‌ను మరోచోటుకు తరలిస్తాం

### "ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్"కథనానికి స్పందన


ట్రాన్స్ ఫార్మర్ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**నవతెలంగాణ - యైటింక్లయిన్ కాలనీ :** ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్ అనే శీర్షికతో నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం జనావాసాల మధ్యలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను, దానివల్ల కలుగుతున్న ఇబ్బందులను స్థానిక కార్పొరేటర్ బాదే అంజలీదేవితో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని, మెరుపులు,షార్ట్ సర్క్యూట్ కాకుండా క్రమబద్ధీకరిస్తామన్నారు. అలాగే దీనివల్ల కలిగే ఇబ్బందులను గుర్తించి పూర్తి సమాచారంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిన అనంతరం ట్రాన్స్ ఫార్మర్‌ను అనువైన ప్రదేశం చూసి వేరే చోటుకు తరలిస్తామని హామీ ఇచ్చారు.


ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నవతెలంగాణలో వచ్చిన కథనం

## అదనపు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్


నిరసన వ్యక్తం చేస్తున్న ఆధార్ కార్డు బాధితులు.

**నవతెలంగాణ - మంథని :**
మంథనిలో అదనంగా ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం మంథనిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నిర్వహించబడుతున్న ఆధార్ కేంద్రం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ మంథనిలో కేవలం మూడు ఆధార్ కేంద్రాలు ఉండడం వల్ల సాంకేతిక సమస్యలతో ఆధార్ లింక్ కాకపోవడంతో ప్రజలు రోజుల తరబడి ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతూ పడి గాపులు కాస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలలో ఆధార్ లింక్ తప్పనిసరి కావడంతో ఆధార్ లింక్ కాకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంథనిలో అదనంగా నూతన ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మూడు ఆధార్ కేంద్రాలలో ఉన్నా సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని మొదటిగా స్కూల్ ప్రాధాన్యతగా దృష్ట్యా విద్యార్థులకు ఆధార్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ధర్నా సమాచారం తెలుసుకున్న మంథని తహసీల్దార్ రాజయ్య, మంథని ఆర్ఐ త్రివేణి ధర్నా వద్దకు వచ్చి ఆధార్ లింక్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, వృద్ధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక దృష్టి


- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వట్టిమల్ల గ్రామంలో పల్లె దవాఖాన ప్రారంభం


ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

**నవతెలంగాణ - కొనరావుపేట :**
ప్రజారోగ్యంపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో పల్లె దవాఖానాను, పలు కులసంఘ భవనాల భూమి పూజ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు వైద్యరంగానికి ప్రాధాన్యమిస్తున్నదన్నారు. పల్లె దవాఖానల ఏర్పాటుతో ప్రతీ పల్లెలో ప్రజల చెంతకే వైద్యం చేరుతోందని దీని వలన ప్రజల ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతుందన్నారు. నగరాలకు వెళ్లి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం లక్షలు ఖర్చుపెట్టే భారం ప్రజలకు తగ్గుతుందని తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి,మందులు పంపిణీ చేస్తారన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షల వరకు పెంచినట్టు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని, అది ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి సహకరిస్తేనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య మార్కెట్ రాష్ట్ర డైరెక్టర్ బండ నరసయ్య గ్రామ సర్పంచులు కొమ్ము స్వప్న సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గోపు పరశురాములు, ఉప సర్పంచ్ పుంగం మాజీ సెస్ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గండి సరేశ్, మండల వైద్యాధికారి వేణుమాధవ్, సీహెచ్‌ఓ, బలచంద్రం, డీపీవో ఉమదేవి సూపర్వైజర్ శ్రీదేవి, నాయకులు గొట్టే రుక్మిణి పాల్గొన్నారు.

## పోలీసుల పేరు చెప్పి డబ్బుల వసూలు

- ఒకరి అరెస్టు మిగితావారిపై విచారణ
- సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి



**నవతెలంగాణ - సిరిసిల్ల :**
పోలీసుల పేరు చెప్పి డబ్బులు వసూలు చేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేశామని మిగతా వారిపై విచారణ సాగిస్తున్నామని ఇన్‌చార్జి డీఎస్పీ కత్రోజు నాగేంద్ర చారి తెలిపారు. సిరిసిల్లలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న తంగల్లపల్లి పోలీసులు ట్రాక్టర్ వే బిల్లులు చూపించక పోవడంతో మూడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించగా అదే అదునుగా చేసుకొని తంగళ్ళపల్లికి చెందిన అక్కపల్లి ఎల్లారెడ్డి అనే వ్యక్తి మూడు ట్రాక్టర్లలో ఒక ట్రాక్టర్ యజమాని సురా వెంకటరమణకు ఫోన్ చేసి తంగాలపల్లి పోలీస్ స్టేషన్ నుండి మాట్లాడుతూన్న నేను ఎస్ఐతో మాట్లాడి మీ ట్రాక్టర్ తీసుకొస్తానని బెదిరించి రూ.13వేలు వసూలు చేశాడు. ఈ మేరకు మంగళవారం వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్లారెడ్డిపై కేస్ నమోదు చేసి అక్కపల్లి ఎల్లారెడ్డిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు. మరికొంత మందిపై విచారణ జరుగుతోందని తెలిపారు. పోలీస్‌ల పేరుతో కానీ, పోలీసులకు స్నేహితులమంటూ బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడే వారిపట్ల అప్రమత్తంగా ఉంటూ అలాంటి ఘటనలను వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని డీఎస్పీ నాగేంద్రచారి కోరారు.

## నవతెలంగాణ పత్రిక పేదల పక్షపాతి : ఇల్లందకుంట ఎస్ఐ రాజకుమార్

### క్యాలెండర్ ఆవిష్కరణ..

నవతెలంగాణ - ఇల్లందకుంట


నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రాజకుమార్

నవతెలంగాణ పత్రిక పేదల పక్షపాతి అని ఇల్లందకుంట ఎస్ఐ రాజకుమార్ అన్నారు. నవతెలంగాణ పత్రిక 2024 క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ పత్రిక ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి పి.రాజేష్, ఇల్లందకుంట విలేకరి సౌడమల్ల యోహాన్ ఉన్నారు.

# హిట్ అండ్ రన్ చట్టాన్ని తొలగించాలి

### లారీ అసోసియేషన్ సమ్మె, ప్రధాన రహదారిపై ధర్నా

### డ్రైవర్లకు పువ్వులు ఇచ్చి నిరసన

నవతెలంగాణ - హుజురాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ నూతన చట్టాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తూ హుజురాబాద్ లారీ డ్రైవర్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేసి క్యాంపులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన సమ్మె నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి సమ్మెను ప్రారంభించారు. అనంతరం కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై కొద్దిసేపు ధర్నా నిర్వహించి డ్రైవర్లకు గులాబీ పువ్వులు ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్‌కు 10ఏండ్ల జైలుశిక్ష, రూ.7లక్షలకుపైగా భారీ జరిమానా విధించే చట్టంపై డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఒకవేళ జైలు శిక్ష పడితే పదేండ్లపాటు డ్రైవర్ల కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని తమ కుటుంబాలను రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ స్థాయిలో ఏడు లక్షల జరిమానా చెల్లించడం కూడా సాధ్యం కాదని, ఈ నిబంధన వల్ల కొత్తవారు ఈ వృత్తిని చేపట్టేందుకు ముందుకురారని లారీ అసోసియేషన్ నాయకులు అన్నారు. అందుకే శిక్షతోపాటు జరిమానా కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే పూర్తిగా చట్టాన్ని తొలగించాలన్నారు. ఈ ఆందోళనలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి సలీం, కార్యదర్శి ఎండి మాజీద్, ఉపాధ్యక్షుడు ఎండి జానీ, నాయకులు జగన్నాథం, ఎండి సజ్జు, రమేష్, తిరుపతి, హైమద్, రషీద్, రాంప్రసాద్, జగన్నాథం, మల్లయ్య, శంకరయ్య, హరి శంకర్, మోహిన్, శ్రీను, అరవింద్‌తో పాటు డ్రైవర్లు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

## శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో 20న మెగా జాబ్‌మేళా

నవతెలంగాణ - కరీంనగర్


చైర్మెన్ రమేష్‌రెడ్డి

కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో ఈ నెల 20న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మెన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెగా ఉద్యోగ మేళాలో ఎస్సెస్సీ, ఇంటర్, యూజీ, పీజీ, ఎంబీఏ, ఫార్మసీ, బీటెక్ తదితర విద్యా అర్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ ఉద్యోగ మేళాలో ట్రైడ్ ఐటీ, ఎడుబ్రిడ్జ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, వెటరో టెక్‌సాఫ్ట్ సొల్యూషన్, అపోలో, ఎన్‌లైట్ తదితర సుమారు 35 కు పైగా కంపెనీలు పాల్గొంటున్నట్లు సాహితీ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మెన్ రాముల కుమార్ తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా 10 సంవత్సరాల నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అనేక సామాజిక కార్యక్రమాలు, వృత్తి, నైపుణ్యం పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు, మహిళా సాధికారత కార్యక్రమాలు, ప్రముఖంగా మెడికల్ సంబంధిత కార్యక్రమాలు, ఇలాంటి ఉద్యోగ మేళాలు ప్రముఖంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా పెద్దఎత్తున మా వంతుగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కళాశాల చైర్మెన్ రమేష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సాహితీ ఫౌండేషన్ చైర్మెన్ కోరారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ కో ఆర్డినేటర్ మార్క సంతోష్ కుమార్, శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మొగిలి పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

### గంగాధర ఏఓ రాజు

నవతెలంగాణ - గంగాధర


సూచనలిస్తున్న ఏవో రాజు

ప్రస్తుతం వరి పొలాలకు సోకుతున్న మొగిలి పురుగు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలను రాజు పరిశీలించి మొగిలి పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ప్రతి రైతు తమ పొలాలకు రాత్రి పూట నీరు పెట్టి తెల్లవారుజామునే ఆ నీరు తొలగించి కొత్తనీరు నింపాలన్నారు. పొలం గట్లపైన కలుపు మొక్కలు లేకుండా రైతుల ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, వరి పొలం ఎర్రబడుతున్నట్టు కనిపిస్తే జింక్ సల్ఫేట్‌ను చల్లలన్నారు. ప్రస్తుతం వీస్తున్న చలిగాలుల వల్ల మొగిలి పురుగు సోకుతుందని, దీని నివారణకు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు సూచించే మందులను పిచికారి చేయాలని, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొగలి పురుగు సోకిన వరి పొలాల్లో తగు జాగ్రత్తలు, సూచనల కోసం వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటే పొలాల్లో వరి పంట ఆశించిన దిగుబడి వస్తుందని వివరించారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - హుజురాబాద్



పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (తాప్ర)మండల శాఖ శనిగరం నరేందర్ ఆధ్వర్యంలో ఎస్‌టిఓ మోహిజ్ జహాన్, పి.శివరామకృష్ణ చేతుల మీదుగా బుధవారం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, కట్ట నాగభూషణాచారి మాట్లాడుతూ.. పెన్షన్ ప్రతి నెల ఒకటవ తేదీన చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఏలను మంజూరు, నూతన పిఆర్‌సి వెంటనే ప్రకటిస్తూ 2023 జూలై నుండి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇల్లందుల సమ్మయ్య, మండల వీరస్వామి, గరిగె చంద్రయ్య చోల్లేటి మల్లారెడ్డి, పరాంకుశం సనత్ కుమార్, రామ కష్ణయ్య కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, రాజిరెడ్డి, గుండేటి మొగిలయ్య, పి.రామకృష్ణ, జి.బుచ్చిరాజం, వి.భాస్కర్, టి.అమరేందర్ పాల్గొన్నారు

## 'ఎంపీపై ఆరోపణలు అర్థరహితం'

నవతెలంగాణ - గంగాధర

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై మాట్లాడే అర్హత కూడా లేని కొందరు కాంగ్రెస్ నాయకులు అర్థరహితమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటని బీజేపీ చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్ అన్నారు. గంగాధరలో శ్రవణ్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు బీఆర్ఎస్‌కు తొత్తులుగా వ్యవహరించిన కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్‌పై ఇష్టానుసారంగా మాట్లాడి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని మాట్లాడినా ఏం చేసినా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బండి గెలుపు ఖాయమేనని అన్నారు.

## త్వరలో రిటైర్డు కార్మికులకు ఏరియర్స్ చెల్లింపు

నవతెలంగాణ - గోదావరిఖని:

సింగరేణి రిటైర్డు కార్మికులకు రావాల్సిన ఏరియర్స్ త్వరలో చెల్లించబడుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. 32శాతం లాభాల వాటా ఈ నెల 19న, లాభాల బోనస్ ఈ నెల 21న చెల్లించబడుతాయని, అదేవిధంగా 11వ వేతన ఒప్పందం యొక్క ఏరియర్స్ ఫిబ్రవరి 6న చెల్లించబడుతాయని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌కు 'ఆకారపు' రాజీనామా

- త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటన
- ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడ్డ గత ప్రభుత్వం
- అందుకే ఓడించారని భాస్కర్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణ - భగత్‌నగర్


మాట్లాడుతున్న ఆకారపు భాస్కర్‌రెడ్డి

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో ఆయన కాంగ్రెస్ గూటికి చేరబోతున్నట్టు ప్రకటించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేండ్ల క్రితం తాను, వందలాది మంది కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని చెప్పారు. ఇన్నేండ్లూ రాష్ట్ర, జిల్లా నాయకత్వం తమను కనీసం ప్రోత్సహించకుండా నిర్లక్ష్యం చేస్తూ అవమానాలకు గురి చేసిందన్నారు. దీనికితోడు ప్రజలకు నేతలు అందుబాటులో లేకుండా అనేక ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ విషయాన్ని అధిష్టానం దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. అందుకే.. ఆ పార్టీకి రాజీనామా చేసి సొంత గూటికి చేరబోతున్నట్లు ప్రకటించారు. త్వరలోనే వెయ్యి మందికి పైగా కార్యకర్తలతో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీ నేతత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సమావేశంలో వాసాల రవీందర్, ఎం ఏ కరీం, ఎండి ఆసిఫ్, తాళ్ల పల్లి అంజయ్య గౌడ్, ఎండి సలీం, ఎండి ఖదీర్, ఎండి సయ్యద్ గౌస్, ఎం ఏ నహీం, కె జగన్ రెడ్డి, ఎండి కుర్షిద్ అలీ, ఎం ఏ రహమాన్, ఎండి తహసీన్, కాసారపు ఎల్లయ్య, సయ్యద్ కాజా గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా పోస్టల్ స్కీం ఉండేలా కృషిచేయాలి

### కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ శివాజి

నవతెలంగాణ - గంగాధర


మాట్లాడుతున్న పోస్టల్ సూపరిండెంట్ శివాజీ

ప్రజలకు ఆర్థిక చేయూతకు ఉపయోగపడే స్కీంలు అనేకంగా ఉన్నాయని, ప్రతి ఇంటా ఏదో ఒక పోస్టల్ స్కీం ఉండేలా తపాల ఉద్యోగులు కృషి చేయాలని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ కె.శివాజీ అన్నారు. గ్రామీణ తపాల మేళాలో భాగంగా బుధవారం గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పోస్టల్ ఎస్పీ శివాజి మాట్లాడారు. తపాల శాఖ పథకాలలో ప్రజలను మరింతగా భాగస్వాములను చేయాలని సూచించారు. ఐపిఓ చంద్రమోహన్ మాట్లాడుతూ మనం నిర్ణయించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ఈ దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రజలకు నమ్మకం కలిగేలా మన విధులు ఉండాలని, అప్పుడే లక్ష్యాలను సునాయాసంగా చేరుకోవచ్చునని తెలిపారు. ఐపిపిబి మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సమావేశంలో గంగాధర ఇన్‌చార్జి ఎస్పీఎం గణపతి, మెయిల్ ఓవర్‌సీర్ మల్లేశం, గంగాధర, బోయినపల్లి, కొత్తపల్లి, రామడుగు సబ్ పోస్టాఫీసుల పరిధిలోని గ్రామీణ తపాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు చొప్పదండిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

# 'రిటైర్డ్ అయిన ఉద్యోగులూ స్వచ్ఛందంగా తప్పుకోవాలి'

నవతెలంగాణ - తిమ్మాపూర్

తెలంగాణ ఏర్పాటు పోరాటంలో ప్రధాన అంశంగా నియామకాల రావాలని యువత, మేధావుల, విద్యార్థులు, ఉద్యోగుల పోరాటంతో వచ్చిన తెలంగాణా 10సంవత్సరాల గడిచినా ఆశించిన ప్రయోజనం కలుగలేదనీ తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రేవెల్లి తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల నియామకాలు, నోటిఫికేషన్స్‌తో గందరగోళం సృష్టించారన్నారు. పెరిగిన నిరుద్యోగాన్ని తగ్గించడం కోసం ఉద్యోగాలు సృష్టించి అయినా నియామకాలు చేపట్టవలసిన సమయంలో రిటైర్మెంట్ వయస్సు పెంచారనీ, కొన్ని సంవత్సరాలుగా రిటైర్మెంట్స్ లేవు, దానికి తోడు గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసినా ఆఫీస్ సబార్డినేట్, నుండి మండల, జిల్లా, రాష్ట్ర వరకు వివిధ స్థాయి అధికారులు, నుండి ఉన్నత ఉద్యోగుల స్థాయి ఐఏఎస్, ఐపీఎస్‌లను కూడా రిటైర్మెంట్ అయిన మళ్లీ కార్యాలయలా వ్యవహారలలో, తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ విధానం లోని రిటైర్డ్ అయిన ఉద్యోగులను ప్రభుత్వం తీసుకోవడం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు అయిన ప్రభుత్వం చర్యలలో భాగంగా రిటైర్డ్ అయిన ఉద్యోగుల డేటా సేకరిస్తున్నారని, రిటైర్డ్ అయిన ఉద్యోగుల గౌరవం ఉండాలి అంటే ప్రస్తుతం పనిచేస్తున్న వారు తక్షణమే స్వచ్ఛందంగా తప్పుకోవడం ఉత్తమం అని అన్నారు.

## 'కుల, మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదాం'

**నవతెలంగాణ-గోదావరిఖని :** గోదావరిఖని చౌరస్తాలో సిపిఐఎంఎల్ ప్రజాపంథా, పిడిఎస్‌యు తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ఐఎఫ్‌టియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్డీ స్కాలర్ వేముల రోహిత్ 8వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నివాళి అర్పించారు. అనంతరం నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేష్, క్రాంతి కుమార్, పులిపాక రాజ్‌కుమార్ మాట్లాడారు. యూనివర్సిటీ స్థాయిలోనే కుల వివక్షత ఎదుర్కొంటూ మనువాద చేతులలో ఆత్మహత్యకు గురై ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ కులము, మతము పేరు తోటి రాజకీయ నాయకులు ప్రజలను విభజిస్తూ ఓట్లు ఆడుక్కుంటున్నారని, విద్యావ్యవస్థలో కూడా నూతన విద్యా విధానం పేరుతోటి కార్పొరేటు, ప్రైవేటు, విదేశీ యూనివర్సిటీలు మనదేశంలో కొచ్చే విధంగా కార్పొరేట్ వ్యవస్థకు స్వాగతం పలుకుతున్నారని మండిపడ్డారు. దళితులకు కిందివర్గాలకు విద్య అందకుండా చేయడం కోసం విద్యా విధానాన్ని సమూలంగా మారుస్తున్నారని అన్నారు. ఇప్పుడిప్పుడే పేద వర్గాలు దేశవ్యాప్తంగా ఆరు శాతం మాత్రమే ఉన్నత విద్యకు వస్తుంటే ఈ విద్యార్థులను కూడా ఉన్నంత విద్యకు దూరం చేసే విధంగా కుట్ర పన్నుతున్నారని, అందులో భాగంగానే సెంట్రల్ యూనివర్సిటీలో వేముల రోహిత్‌కు రావలసిన స్కాలర్‌షిప్ ఇవ్వకుండా ఒక దళిత విద్యార్థి పేరు తోటి అనేక ఆకాంక్షలు విధించి విసి అప్పారావు వేధించడంతోటే వేముల రోహిత్ ఎనిమిది సంవత్సరాల క్రితం వెలివాడ వేసుకొని ఒక యూనివర్సిటీ కేంద్రాన్ని ఆత్మహత్య చేసుకోవడం అంటే సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కుల, మత రాజకీయాలపైన ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి యువజన సంఘాలు ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, వేముల లక్ష్మణ్, గుండ్ల మల్లికార్జున్, సనవాజ్ సల్మాన్ పాల్గొన్నారు.

## భూ కబ్జా కేసులో

## చీటీ రామారావు, తోట రాములు రిమాండ్

### తప్పుడు ధృవపత్రాలతో భూమి ఆక్రమించినట్లు నిర్ధారణ

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టుకోగా దాన్ని అడ్డుకోవడంతోపాటు తప్పుడు ధృవపత్రాలతో ఆక్రమించేందుకు ప్రయత్నించిన గంగాధరకు చెందిన చీటీ రామారావు, నగరంలోని 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు ఇద్దరినీ పోలీసులు రిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన కొత్త రాజిరెడ్డి మున్సిపల్ పర్మిషన్ ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని నల్లకుంటలో నివాసం ఉంటున్న గంగాధర మండలానికి చెందిన చీటీ రామారావు, 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు ఆ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. రాజిరెడ్డికి చెందిన ఇంటి స్థలాన్ని ఉద్దేశపూర్వకంగానే ఆక్రమించుకునేందుకు తప్పుడు ధృవపత్రాలు సృష్టించారు. ఆ తప్పుడు పత్రాలతో రాజిరెడ్డి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాకుండా ఆక్రమించేందుకు ప్రయత్నించారు. దీంతో బాధితుడు రాజిరెడ్డి గత నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరలాల్, ఎస్సై స్వామి విచారణ చేపట్టారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ సహాయంతో పూర్తిస్థాయి దర్యాప్తు చేశారు. కేసుకు సంబంధించిన ఆధారాలను హైదరాబాద్, విశాఖపట్నం సైతం వెళ్లి సేకరించారు. ఆ ఆధారాలతో సదరు నిందితులు చీటీ రామారావు, తోట రాములు భూకబ్జాకు పాల్పడ్డారని నిర్ధారించిన పోలీసులు పలు సెక్షన్ల కింద వారిపై కేసులు నమోదు చేశారు. కరీంనగర్ సెకండ్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ముద్దాయిలకు ఈ నెల 31వరకు రిమాండ్ విధించారు. ఈ కేసుపై విచారణ ఇంకా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## పారువెల్ల చెరువు నింపేందుకు

## ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..


మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని పారువెల్ల చెరువును సత్వరమే నింపి గ్రామ రైతులు, ముదిరాజ్‌లను ఆదుకునే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఎంపీపీ లింగాల మల్లారెడ్డి బుధవారం కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు అధికారులు, మండల ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ ఆంజనేయులు మాట్లాడుతూ పారువెల్ల పెద్ద చెరువు నింపేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ అల్వాల కోటి, సర్పంచులు చింతలపల్లి నరసింహరెడ్డి, దుడ్డు రేణుకమల్లేశం, ఇరిగేషన్ ఏఈలు మహేందర్, రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సంగు వేణు, చెక్కిళ్ల తిరుపతి, ఈగ రాజయ్య, రామంచ స్వామి, పారువెళ్ల, వడ్లూరు రైతులు, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## ఎరువుల గోదాముల్లో తనిఖీ

నవతెలంగాణ - చొప్పదండి


స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏఓ వి.వంశీకృష్ణ

మండలంలోని రుక్మాపూర్, వెదురుగట్ట, భూపాలపట్నం గ్రామాలలోని సహకార సంఘం ఎరువుల గోదాములను బుధవారం మండల వ్యవసాయ అధికారి వి.వంశీకృష్ణ తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రైతులకు వరి నాటు వేసే ముందు దుక్కిలో భాస్వరం ఎరువులు వేసుకోవాలని సూచించారు. పైపాటున వేయకూడదని, అలాచేస్తే సూక్ష్మ ధాతు పోషక లోపాలు వస్తాయని తెలిపారు. యూరియా పొటాష్ వాడుకోవాలని రైతులకు సూచించారు.

## గుండ్లపల్లిలో నేడు ఇసుక వేలం

నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని గుండ్లపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును ఇటీవల సిఐ కర్రె స్వామి, ఎస్సై చందా నరసింహారావు సీజ్ చేసి రెవిన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దారు మామిడాల బిక్షపతి ఆధ్వర్యంలో గురువారం 12 ట్రిప్పుల ఇసుకకు బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.వెయ్యి ధరావతు చెల్లించి పాల్గొనాలని కోరారు.

## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబుకు పరామర్శ

నవతెలంగాణ - హుజురాబాద్

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు తల్లి సాయమ్మ ఇటీవల మృతిచెందింది. ఆ కుటుంబాన్ని బుధవారం జనతాదళ్ (సెక్యులర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి, బీసీ సీనియర్ నాయకుడు సంధ్యేల వెంకన్న పరామ ర్శించారు.

## లారీ ట్రాన్స్‌పోర్టులను రద్దు చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్‌లో గిరిజనేతరుల లారీ ట్రాన్స్‌పోర్టులను రద్దు చేయాలని డిమాండ్ చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు అన్నారు. బుధవారం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో దేవాపూర్ పంచాయతీ కార్యదర్శి కవితకు వినతిపత్రం అందించారు. ఏజన్సీ గ్రామమైన దేవాపూర్‌లో గిరిజనేతరులకు లారీ ట్రాన్స్‌పోర్టులకు అనుమతులు ఎలా ఇచ్చారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ఉపాధ్యాక్షులు కనక గోవర్ధన్, సిడాం శంకర్, నాయకులు సిడాం రాందాస్, కేశవరావ్, గడ్డం భీమయ్య రొడ్డ రాంమోహన్, కుంరం జగ్గారావ్, కలవేణి శ్రావణ్ పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపర్చాలి

నవతెలంగాణ-తాండూర్

కార్మికుల వైద్య సదుపాయాల సౌకర్యార్థం బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేయడంతో పాటు సౌకర్యాలను మెరుగుపరచాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కోరారు. బుధవారం నాయకులతో కలిసి సింగరేణి ఎండీ బలరాంకు వినతిపత్రం అందించారు. కార్మికులు లేరన్న సాకుతో 250 బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రిని 50 పడకల వరకు కుదించారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో 900 మంది కార్మికులు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి వైద్య సౌకర్యాలను అందించడానికి ఆర్థో, ఫిజిషియన్, చిన్న పిల్లల వైద్య నిపుణులతో పాటు సిబ్బందిని నియమించాలని కోరారు. గోలేటి, మాదారం పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు, ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు కలిపించి డిస్పెన్సరీలను ఆధునికరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కౌన్సిల్ సిద్ధంశెట్టి రాజమౌళి, పేరం శ్రీనివాస్, ప్రకాష్, మాధవ కృష్ణ, బి. సదానందం ఉన్నారు.

## పల్లె అభివృద్ధికి కృషి : ఎంపీపీ



నవతెలంగాణ-బోథ్

పల్లెల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించే మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి రూ.4లక్షల నిధులతో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి తనవంతుగా నిధులు కేటాయిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే మరిన్ని గ్రామాలతో పోలిస్తే అభివృద్ధిలో ఆదర్శంగా పాట్నాపూర్ గ్రామం నిలువడం జరిగిందని తెలిపారు. మునుముందు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామంలో ఇచ్చిన మాట ప్రకారం పూలాజీ బాబా మందిర్ నిర్మాణానికి రూ.1లక్ష భక్తులకు ఇవ్వడం జరిగిందన్నారు. మండల అభివృద్ధికి తన వంతుగా మరింత పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పండ్రం సుగుణ, ఎంపీడీఓ సుశీల్ కూమార్‌రెడ్డి, ఎంపీటీసీ జుగాదిరావ్, పీఏసీఎస్ చైర్మెన్ ప్రశాంత్, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతర తైబజార్ వేలం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర తైబజార్ వేలం పాటను బుధవారం ఉట్నూర్ ఆర్డీఓ జీవాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తైబజార్ వేలం రూ.7.25లక్షలు పలుకగా, ఎలక్ట్రిసిటీ రూ.1.28 లక్షలు, ప్యాలాలు రూ.44 వేలు, కొబ్బరి కాయల దుకాణానికి రూ.12 వేలు వేలం పాట నిర్వహించారు. వాహనాల పార్కింగ్ వేలం వాయిదా పడింది. ఈ వేలంలో స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఈఓ రాజమౌళి పాల్గొన్నారు.

## కుల ధ్రువీకరణ పత్రాల రద్దుపై ఆరా

నవతెలంగాణ-కుభీర్

గతరెండు నెలల కింద మండలంలోని సిరిపెల్లి గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్‌కు మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏడుగురు వ్యక్తులకు సంబంధించిన కులధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని తహసీల్దార్ సోముకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారోనని తెలుసుకునేందుకు బుధవారం సిరిపెల్లి గ్రామానికి చెందిన జాదవ్ జీవన్ తహసీల్దార్ సోమును కలిసి ఆరా తీశారు. తహసీల్దార్ రెండు మూడు రోజుల్లో సమస్యను ఆర్డీఓకు వివరించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రాములోరి అంక్షింతల వితరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాములోరి అంక్షింతల వితరణను బుధవారం మండలంలోని చిచ్‌ధరి, ఖానాపూర్ గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిచ్‌ధరి నుంచి మహిళలు నెత్తి మీద కలశాన్ని పెట్టుకుని భాజా, భజంత్రీలు మధ్య ఊరేగింపును నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా రామ నామ స్మరణలో మునిగి పోయారు. ఈ శోభయాత్ర రాధాకృష్ణ మందిరం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్, మాజీ సర్పంచ్ రామారావ్, పరశు రామ్ నాయక్, సోషల్ వర్కర్ అనిల్ రాథోడ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జన్నారం

మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన రవిందర్ రావ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణరాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరవుతారని, అదే విధంగా ఎంపీటీసీలు, సర్పంచులు తప్పకుండా హాజరు కావాలన్నారు. అధికారులు కూడా వారి ప్రగతి నివేధికలతో రావాలన్నారు.

## పర్యాటక కేంద్రంగా చారిత్రక కట్టడం

నవతెలంగాణ-లింగంపేట్

చారిత్రక కట్టడమైన నాగన్న గారి బాయిని పర్యట కేంద్రంగా మారుస్తున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. లింగంపేట్ మండల కేంద్రంలోని నాగన్న గారి బావిని బుధవారం కలెక్టర్ సందర్శించారు. బావిలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను స్థానిక తహసిల్దార్ ఎంపీడీవోలతో కలిసి పరిశీలించారు. బావికి సంబందించిన చుట్టూ ప్రాంగణాన్ని కొలిపిచ్చి సరిహద్దులను వేయించారు. బావి పునరుద్ధరణ పనులు కూడా చాలావరకు పూర్తయినట్లుగా తెలిపారు. నాగన్న గారి బాయి సమీపంలోని పట్టేదారు మనోహర్ రావు తన సొంత భూమి నుండి 18 గంటల భూమిని నాగన్న గారి బాయికి అప్పగించారు. పురావస్తు శాఖ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చారిత్రక కట్టడమైనటువంటి నాగన్న గారి భాయి పునర్నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. పర్యాటకులు ఆకర్షించే విధంగా రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో నాగన్న గారి భాయి ప్రత్యేక విశిష్టత ఉంటుందన్నారు. త్వరలో నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోబోతుందని అన్నారు. ఆయన వెంట తాసిల్దార్ సుధాకర్, ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, లింగంపేట ఎస్సై ప్రభాకర్, ఎంపీఓ ప్రభాకర్ చారి, సర్వేయర్ మౌనిక, అభిలాష్, ఆర్ఐ బాలయ్య, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## పేద ప్రజల గొంతుక నవతెలంగాణ

నవతెలంగాణ-కామారెడ్డి

పేద ప్రజల గొంతుక 'నవతెలంగాణ' అని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన విషయాలను, వారి కష్టాలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువస్తూ వారి సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ కృషి చేస్తుందన్నారు. మున్ముందు మరింత పేదల పక్షాన నిలబడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నరేశ్, కామారెడ్డి విలేకరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి క్వార్టర్ల కబ్జా..!

- శ్రీనివాస్ నగర్ అడ్డా..!
- జోరుగా సింగరేణి క్వార్టర్ల స్థలాల్లో అక్రమ కట్టడాలు..!
- చోద్యం చూస్తున్న సింగరేణి ఎస్టేట్ అధికారులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లోని సింగరేణి క్వార్టర్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం మాములైంది. శిథిలావస్థలోని ఖాళీ క్వార్టర్, సింగరేణి ఖాళీ స్థలం కనిపిస్తే చాలు క్వార్టర్లను ధ్వంసం చేసి అడ్డగోలుగా అక్రమ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు సింగరేణి ఎస్అండ్ పీసీ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో విచ్చలవిడిగా నిర్మాణాలు చేస్తున్నారా..? లేక ముడుపులు తీసుకొని చూసి చూడనట్టు వవహరిస్తున్నారా..? అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్వార్టర్లను కూల్చి విశాలంగా ఇంటి నిర్మాణం చేసె వరకు చూస్తూ ఉండిపోవడం దేనికి సంకేతమని..? స్థానికులు చర్చించుకుంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా మందమర్రి డివిజన్‌లో జరుగుతున్న అవినీతి ఎక్కడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో మందమర్రికి చెందిన ఒక యూనియన్ నాయకుడు సింగరేణి క్వార్టర్‌ను కూల్చివేసి విశాలవంతమైన ఇల్లు కట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. ఈ విషయంపై గత జీఎం మనోహర్ రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవడంతో ఆతడిని అప్పటి ప్రభుత్వం బదిలీవేసి చేతులు దులుపుకుంది. గతంలో నవతెలంగాణ పత్రికలో ఇదే కాలనీకి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి సమీపంలోని సింగరేణి స్థలాన్ని ఫెన్సింగ్ వేసి కబ్జా చేసిన వార్త ప్రచురితమైంది. కానీ అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. అధికారులు ఇలా వ్యవహరిస్తే మరిన్ని అక్రమ కట్టడాలు చేసేందుకు మరి కొంతమంది సిద్ధమవుతున్నారనే సందేహం ప్రజల్లో ఉంది. ఈ వ్యవహారాలపై కిందిస్థాయిలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారా..? ఇటీవల ఎస్టేట్ విభాగంలో కొత్తగా నియామకం తర్వాతనే అక్రమ కట్టడాలు ఊపందుకున్నాయనే విమర్శలు సైతం వస్తున్నాయి. కోల్ బెల్ట్ ఏరియాలలో ఒక్క మందమర్రి డివిజన్‌లోనే ఇలాంటి అక్రమ నిర్మాణాలకు ఎవరు ప్రోత్సహిస్తున్నారు..? వారిని అడ్డుకునే ప్రయత్నం చేసే వారే లేరా..? ప్రస్తుత జీఎం వీటిపై చర్యలు తీసుకుంటారా..? లేక చూసిచూడనట్టు వదిలేస్తారా వేచి చూడాలి. అక్రమ నిర్మాణాలు శ్రీరాంపూర్, బెల్లంపెల్లి డివిజన్‌ల్లో ఎస్టేట్, జీఎంలు ఉక్కుపాదం మోపుతుంటే మందమర్రి డివిజన్‌లో మాత్రం ఎలాంటి చర్యలు లేవు.



# ప్రధానమంత్రి పురస్కారాలకు దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

పాలనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగులకు అందించేందుకు ప్రధానమంత్రి పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం న్యూఢిల్లీ నుండి కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం సంయుక్త కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తన ఛాంబర్ నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాటగిరీ-1లో 12 ప్రాధాన్యత రంగాల క్రింద ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 10 అవార్డులు, క్యాటగిరీ-2లో కేంద్ర, రాష్ట్ర, జిల్లాల వారీగా ఆవిష్కరణల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి 6 అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి పురస్కారాలు-2023లో హర్ ఘర్ జల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ / పట్టణ), మిషన్ ఇంద్రధనస్సు, జన ఆరోగ్య యోజన, ఉజ్వల, స్వనిధి, మాతృవందన, విశ్వకర్మ ముద్ర, పోషణ్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు పథకాలలో సంపూర్ణ అభివృద్ధి సాధించిన సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 1 ఏప్రిల్ 2021 నుండి 31 జనవరి 2024 మధ్య కాలంలో చేసిన సేవలకు పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 5 దశలలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. తుది దశలో పురస్కార గ్రహీతలను ప్రధానమంత్రి ఆమోదిస్తారని, ఈ నెల 31వ తేదీ లోగా అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికలు

నవతెలంగాణ-జైపూర్

గ్రామ, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరం అభివృద్ధి ప్రణాళికల తయారీపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామ, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక సామాజిక అత్యవసర సమస్యల పరిష్కారం దిశగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి సంబంధించి అభివృద్ధి ప్రణాళిక నిర్దేశిత గడువులోగా గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణకు సూచించారు. గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదుపై ఎంపీఓ అనిల్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**భీమారంలో..**

మండలంలోని దాంపూర్, కాజిపల్లి గ్రామపంచాయతీలలో స్థానిక సర్పంచుల అధ్యక్షతన బుధవారం గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై అవగాహన కల్పించినట్లు స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్ రావు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధి సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతుల కల్పన కోసం అవసరాల దృష్ట్యా ప్రణాళికలు తయారు చేయాలని స్థానిక ఎంపీడీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోదారి రమాదేవి

శ్రీనివాసరావు సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ అవసరమైన మేరకు అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల వారీగా తయారు చేసే ప్రణాళికల్లో ప్రభుత్వ శాఖ సంబంధించి అధికారులు, గ్రామపంచాయతీ ప్రజలు భాగస్వామ్యం కల్పించాలన్నారు.

# రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్




రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, రవాణ శాఖ అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

వాహనదారులు, పాదచారులు రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు-2024 బ్యానర్లు, గోడప్రతులు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 15 నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు, ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలను రక్షిస్తుందని తెలిపారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడుపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే ఆటోలు, జీపులు ఇతర ప్రైవేట్ రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లాదన్నారు. నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణ శాఖ, కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన నూతన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ గౌస్ ఆలం బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.శివరాం ప్రసాద్‌ను కలిశారు.

## తెలంగాణ జూడో క్రీడాకారుడికి రజత పతకం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో జరుగుతున్న 67వ నేషనల్ ఎస్జీఎఫ్ గేమ్స్ అండర్-19 జూడో పోటీలలో ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి లక్ష్మణ్ జూడో క్రీడాకారుడు బుధవారం రజత పతకం కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం స్థానిక విద్యార్థి జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూడో శిక్షణ పొందుతున్నాడు. ఈ మేరకు ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## సిని టివి రంగాలపై ఔత్సాహికులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు టీవీ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో ఈనెల 20న మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సాంస్కృతిక సమాఖ్య చీఫ్ కోఆర్డినేటర్ హనుమాండ్ల మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ సినీ టీవీ దర్శకులు, నిర్మాత, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ స్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ శిక్షణ శిబిరంలో ప్రముఖ సిని దర్శకులు వి.ఎన్ ఆదిత్య ప్రేమ్‌రాజ్, నెల్లుట్ల ప్రవీణ్ చంద్ర, చంద్ర మహేష్, ప్రముఖ రచయిత తోటపల్లి సాయినాథ్, యువ దర్శకులు మానస్ దండనాయక, స్క్రీన్ ప్లే రచయిత శ్రీశైల మూర్తి తదితరులు పాల్గొని శిక్షణ ఇస్తారన్నారు. సినీ, టీవీ రంగంలో రాణించాలనే వారికి మూల కథ, సన్నివేశ ప్రాధాన్యత, పాత్రల రూపకల్పన, ప్రారంభ, ముగింపు సన్నివేషాలు ఇలా 24 శాఖలపై అవగాహన, స్క్రీన్ ప్లే తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని వారు పేర్కొన్నారు. జిల్లాలోని ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం అభినవ సంతోష్ కుమార్ 8074771108, హనుమాండ్ల మధుకర్ 9908232303 సంప్రదించాలని కోరారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి హజరవుతారని తెలిపారు.

## ఏఐటీయూసీ కృషితోనే రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా

నవతెలంగాణ-కాసిపేట

ఏఐటీయూసీ కృషితో సింగరేణి రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, పీఎల్‌ఆర్ బోనస్, వేజ్‌బోర్డ్ ఏరియల్స్ సాధించడం జరిగిందని ఆ సంఘంబ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఉపాధ్యాక్షులు బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యంపై ఏఐటీయూసీ ఒత్తిడి చేయడంతో రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా 32 శాతం ఈ నెల 19న, పీఎల్‌ఆర్ బోనస్ ఈ నెల 21న, వేజ్‌బోర్డ్ ఏరియల్స్ ఫిబ్రవరి 6న చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రావాల్సిన బకాయిలను ఇప్పించడంలో ఏఐటీయూసీ ముందుందన్నారు.

## 20 నుంచి ఫోటో ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక శిబిరాలు

నవతెలంగాణ-నస్పూర్

స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8 ఫిబ్రవరి 2024 వరకు నిర్వహించనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం సమర్థవంతంగా చేపడుతున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణలపై ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. నూతన ఓటరు నమోదు, సవరణ, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6, 7, 8 దరఖాస్తు ఫారములు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

## జనవరిలోనే విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి విశ్రాంత కార్మికులకు సంబంధించిన బెనిఫిట్స్ జనవరి మాసంలో సింగరేణి యాజమాన్యం చెల్లించని ఉందని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్ సింగరేణి కార్మికుల ఏరియస్ వాట 32శాతం ఈనెల 19న, లాభాల బోనస్ నగదు ఈనెల 21న యాజమాన్యం చెల్లించనున్నట్లు తెలిపారు. 11వ వెజ్ బోర్డ్ ఏరియస్ ఫిబ్రవరి 6న కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు.



## మావోయిస్టుల మెరుపు దాడి

- సీఆర్పీఎఫ్ క్యాంపులపై తుపాకీ గుండ్ల వర్షం
- జవాన్ల ఎదురు కాల్పులు
- క్యాంపుల నిర్మాణాలకు నిరసనగానే !
- 9 మంది జవాన్లకు గాయాలు

నవతెలంగాణ-చర్ల

పోలీసు క్యాంపులపై మావోయిస్టులు మెరుపు దాడికి దిగారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీసు స్టేషన్ పరిధిలో గల ధర్మారం, చింతవాగు, పామేడు పోలీసు క్యాంపులపై మంగళవారం రాత్రి దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి.

భద్రతా సిబ్బంది మకర సంక్రాంతి పండుగ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న మావోయిస్టులు పథకం ప్రకారం ఒకేసారి, ఒకే సమయానికి మూడు పోలీసు క్యాంపులపై తుపాకీ గుండ్ల వర్షంతో పాటు బీజీఎల్ అనే దేశీయ లాంచర్ బాంబుల వర్షం కురిపించారు. ముందుగా పామేడు శివారు ప్రాంతంలో చెట్లను నరికి గ్రామాల్లోకి ఎవరూ వెళ్లకుండా, రాకుండా రహదారి దిగ్బంధనం చేశారు. పామేడు శివారులో భారీ మందు పాతర పేల్చి అటు దిక్కుగా ఎవరూ రాకుండా చేశారు. మూడు దిక్కుల పామేడును చుట్టుముట్టిన మావోయిస్టులు మంగళవారం రాత్రి 6.30 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 3 గంటల వరకు కాల్పులు జరిపారు. మావోయిస్టు కాల్పులను సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవాన్లు తిప్పి కొట్టారని తెలిసింది.

రాత్రి పూట కావడంతో సీఆర్పీఎఫ్ జవాన్లు పారా బాంబులను గాలిలోకి విసిరి ఆ వెలుతురులో.. మావోయిస్టులపై ఎదురు కాల్పులు జరిపారని సీఆర్పీఎఫ్ పోలీస్ అధికారులు తెలిపారు. పామేడును ఆనుకొని ఉన్న మూడు క్యాంపులను మావోయిస్టులు మూడు వైపులా చుట్టుముట్టి కాల్పులు జరపడంతో పామేడు పోలీసు స్టేషన్ సిబ్బంది చీకట్లో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. బయటకు వస్తే కాల్పులు జరిపి హాని కలిగించే విధంగా మావోయిస్టులు పన్నిన కుట్రను పోలీసులు భగ్నం చేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సీఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. సుమారు 9 మంది జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయని తెలిసింది.

మావోయిస్టులకు భారీగా నష్టం వాటిల్లిందని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధి ధర్మారం గ్రామంలో నిర్మిస్తున్న సీఆర్పీఎఫ్ క్యాంపు సహా.. సీఆర్పీఎఫ్ క్యాంపుల నిర్మాణానికి నిరసనగా ఈ కాల్పులు జరిగినట్టు తెలుస్తోంది. చెట్లపై నుంచి మావోయిస్టులు గెరిల్లా యుద్ధం చేసినట్టు స్పష్టమవుతోంది. సుమారు 300 మంది మావోయిస్టులతోపాటు పెద్దఎత్తున సానుభూతిపరులు, కొరియర్లు ఈ క్యాంపుల ఎటాక్ ఆపరేషన్‌లో పాల్గొన్నట్టు సమాచారం. ఎక్కువమంది సాయుధులైన మహిళా మావోయిస్టులు పాల్గొన్నట్టు తెలిసింది.

### 20 ఏండ్ల కిందట పామేడు పోలీస్ స్టేషన్‌పై దాడి

సుమారు 20 ఏండ్ల కిందట ఇదే తరహాలో పామేడు పోలీస్ స్టేషన్‌పై మావోయిస్టులు దాడి చేసి పెద్దఎత్తున తుపాకులు, మందుగుండు సామగ్రిని పట్టుకెళ్లారు. అదే తరహాలో మళ్లీ మంగళవారం రాత్రి సీఆర్పీఎఫ్ 151వ క్యాంపుపై మావోయిస్టులు దాడి చేశారు.

ఈ దాడిలో పీఎల్‌జీఏ బలగాలు పెద్దఎత్తున పాల్గొన్నట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా సుమారు పది గంటలపాటు ఎదురుకాల్పులు జరిగాయి. సీఆర్‌పీఎఫ్ జవాన్లకు స్వల్ప గాయాలు అయినట్టు 151 బెటాలియన్ కమాండెంట్ ప్రధమన్ కుమార్ ధ్రువీకరించారు. కాగా పామేడ్ దండకారణ్యంలో యుద్ధ మేఘాలు అలుము కున్నాయి. ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు వణికిపోతున్నారు.

## కోలుకుంటున్న కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తుంటి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారు. డిసెంబర్ 8న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో కాలు జారి కింద పడగా తుంటి ఎముక విరిగిపోయిన సంగతి తెలిసిందే. దాంతో వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స చేసి తుంటి ఎముక రీప్లేస్ చేశారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తరువాత 8 వారాల పాటు రెస్ట్ అవసరం అని వైద్యులు చెప్పగా, హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరువారాలుగా సంబంధిత వ్యాయామం చేస్తున్నారు. తాజాగా కేసీఆర్ ఆరోగ్యానికి సంబంధించి వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తమ అధినేత త్వరగా కోలుకుని, ప్రజల్లోకి రావాలని బీఆర్‌ఎస్ శ్రేణులు కామెంట్లు పెడుతున్నారు.

## తమపై తాము దృష్టి పెడితే విజయం : అనిల్ స్వరూప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమపై తాము దృష్టి పెట్టే వారు జీవితంలో విజయం సాధిస్తారని కేంద్ర మాజీ విద్యా కార్యదర్శి అనిల్ స్వరూప్ తెలిపారు. ఇలాంటి వారు ఇతరుల తప్పులను వెతికే పని పెట్టుకోరని చెప్పారు. విజయులుగా నిలిచిన వారి జీవితాలు గమనిస్తే ఇదే విషయం అవగతమవుతుందని వివరించారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కీ) పీజీడీఎం మూడో బ్యాచ్ పీజీడీఎం(హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ) 16వ బ్యాచ్ స్నాతకోత్సవం బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ స్వరూప్ మాట్లాడుతూ గతాన్ని మార్చే శక్తి లేనందున దాన్ని గురించి చింతించకుండా వర్తమానం గురించి ఆలోచించాలని సూచించారు. నియంత్రించలేని విషయాలను గురించి ఆందోళన వీడి ప్రభావితం చేయగలిగిన సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఆందోళన మనిషికి ప్రతికూల ప్రభావాన్ని ఇస్తుందని హెచ్చరించారు. చుట్టూ ఉన్న వ్యక్తులను విశ్వసించాలనీ, తద్వారా వారికి పనులు అప్పగించడం సులభమవుతుందన్నారు. తప్పుల నుంచి నేర్చుకునే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రత్యేక పతకాలు, అవార్డులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో అస్కీ చైర్మెన్ కె.పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్లు | 62,950 | ▼ | 380 |
| 22 క్యారెట్లు | 57,700 | ▼ | 350 |
| కిలో వెండి | 77,400 | ▼ | 600 |

### చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

| | | |
|---|---|---|
| ఫారం రేటు | రూ. | 107 |
| రిటైల్ (లైవ్) | రూ. | 129 |
| స్కిన్‌తో | రూ. | 187 |
| స్కిన్‌లెస్ | రూ. | 213 |

# మేడారం పనుల నాణ్యతపై రాజీలేదు

## జాతీయ హోదాకు మంత్రి కిషన్‌రెడ్డి కృషి చేయాలి :

- మంత్రులు డాక్టర్ ధనసరి సీతక్క కొండా సురేఖ





నవతెలంగాణ - ములుగు

మేడారంలో అభివృద్ధి పనుల విషయంలో రాజీపడేది లేదని, కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా అధికారులు చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. జాతరలో అభివృద్ధి ఉచిత బస్సు సౌకర్యాన్ని మేడారం జాతరకు వచ్చే మహిళలందరికీ వర్తింపజేస్తామని చెప్పారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో మేడారం మహా జాతరపై అధికారులతో దేవాదాయ, అటవీశాఖ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ముందుగా మేడారం సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. ఆసియా ఖండంలో అతిపెద్ద జాతర అయిన మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల్లోనే రూ.75కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు.

**జాతరకు 'ఉచిత బస్సు'**

మేడారం ప్రాంతంలో వరదల కారణంగా భారీ నష్టం వాటిల్లిందని, మేడారం నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. మరిన్ని నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరగా రూ.35కోట్లు మంజూరు చేసిందన్నారు. భిన్నాభిప్రాయాలు లేకుండా అందరూ సహకరించి జాతరను విజయవంతం చేయాలని కోరారు. అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చూడాలని సూచించారు. కాంట్రాక్టర్లకు వంత పాడే అధికారులపై చర్యలు చేపడుతామని హెచ్చరించారు. రాబోయే జాతరలో మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను వరంగల్ ఉమ్మడి జిల్లా ఆడబిడ్డలుగా మంత్రి సురేఖతో పాటు తాను దిగ్విజయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మేడారం మహాజాతరకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మంత్రిగా కొనసాగుతున్న కిషన్‌రెడ్డి జాతీయ హోదా కోసం కృషి చేయాలని కోరారు.

### జాతర విజయవంతానికి కృషి

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వరంగల్ ఆడబిడ్డలుగా జాతరను విజయవంతం చేస్తామన్నారు. అభివృద్ధి పనులన్నింటినీ 100 శాతం నెలాఖరు వరకు పూర్తి చేస్తామని చెప్పారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పనులు పూర్తి చేయిస్తామన్నారు. దేవాలయ శాఖ నుంచి రూ.కోటి 50లక్షలతో పూజారుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. ప్రతిపక్షాలకు విమర్శించే హక్కు లేదని, సలహాలు, సూచనలు అందించి జాతర విజయవంతానికి సహకరించాలని అన్నారు. గిరిజన జాతరలో పూజారుల పాత్ర కీలకమని, వారి కోసం ప్రభుత్వం 10గదులతో అతిథిగృహ నిర్మాణం చేపడుతుందని అన్నారు. వచ్చే మినీ జాతర నాటికి అతిథి గృహాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శభరిష్, అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజ, అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణుగోపాల్, దేవాదాయశాఖ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 16 ఆందోళనకు భారీ సమీకరణ

## ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపు




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫిబ్రవరి 16న రైల్ రోకో, రాస్తారోకో, జైల్ భరో, గ్రామీణ్ బంద్, ప్రదర్శనలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు పికెటింగ్‌ల రూపంలో ఆందోళనకు దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులను భారీగా సమీకరించాలని ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి హర్భజన్ సిద్ధూ, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు అశోక్ సింగ్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ఏఐకేకేఎంఎస్ నేత సత్యవాన్, ఏఐకేఎం నేత ప్రేమ్‌సింగ్ గెహ్లావత్, ఎస్‌కెఎం నేత సునీలం మాట్లాడారు. దేశంలో కార్మిక సమ్మెలతో సహా రంగాలవారీ ఉద్యమాలు, ఆందోళనలు కొనసాగుతున్నాయని, కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం ఐక్యంగా ఆమోదించిన ఫిబ్రవరి 16 దేశవ్యాప్త ఆందోళనతో తమ ఆందోళనలను అనుసంధానం చేయాలని తాము వారిని అభ్యర్థిస్తున్నామని అన్నారు. విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, మహిళలు, సామాజిక ఉద్యమాలు, కళా, సాంస్కృతిక సాహిత్య రంగాలలో ఉన్నవారు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఉమ్మడి ప్రచారానికి మద్దతివ్వాలని తాము విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

కార్పొరేట్, మతోన్మాద బంధం విధ్వంసక, విభజన, నిరంకుశ విధానాలను ప్రతిఘటించాలని, వాటి స్థానంలో కార్మిక అనుకూల, రైతు, ప్రజా పక్ష విధానాలను తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజల నిజమైన జీవనోపాధి సమస్యలను జాతీయ ఎజెండాలోకి తీసుకురావడానికి క్రూరమైన మతపరమైన మతోన్మాదం, జింగోయిజాన్ని ఎదుర్కోవాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సోషలిజం ప్రాథమిక సూత్రాలను కాపాడాలని పిలుపునిచ్చారు.

"ఈ ప్రభుత్వం మొత్తంగా శ్రమిస్తున్న ప్రజల జీవితాలపై, జీవనోపాధిపై దాడులను నిరంతరం కొనసాగిస్తోంది. వివిధ చట్టాలు, కార్యనిర్వాహక ఉత్తర్వులు, విధానపరమైన డ్రైవ్‌లతో కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చర్యలను వేగవంతం చేస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తోంది. ఇది వివిధ వర్గాల ప్రజల అన్ని ప్రజాస్వామ్య వాదనలను, అన్ని అసమ్మతి స్వరాలను అణిచివేస్తోంది. పరిపాలనా అధికారాలు, ఏజెన్సీలను పూర్తిగా దుర్వినియోగం చేయడం, రాజకీయాలను, రాజ్యాంగ సంస్థలను వర్గీకరించే ప్రమాదకరమైన గేమ్ ప్లాన్‌తో ఇది కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం మీడియా స్వేచ్ఛపై దాడి చేస్తోంది. బాధితులచే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న నేరస్థులను సిగ్గు లేకుండా రక్షిస్తోంది. తద్వారా శాంతిభద్రతలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది" అని వారు విమర్శించారు.

"జనవరి 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహన కవాతు కోసం ఎస్‌కెఎం ఇప్పటికే ఇచ్చిన పిలుపునకు మేము మద్దతు ఇస్తున్నాము. కార్మికులు తమ వాహనాలతో అందులో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము" అని తెలిపారు.

"ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక నిరంకుశ విధానాలను ప్రతి ఘటించ డానికి, ఓడించడానికి ఈ బృహత్తర ప్రజా ఆందోళన లో పాల్గొనాలని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు మేము పిలుపునిస్తున్నాం. ప్రజలను రక్షించడానికి, ప్రజాస్వామ్యాన్ని, మన దేశాన్ని రక్షించడానికి ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని మేము అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను అభ్యర్థిస్తున్నాం" అని అన్నారు.

## 'మేడారం'లో ముందస్తు మొక్కులు



ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర అయిన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహా జాతర వచ్చే నెల ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు జనం భారీగా తరలొస్తున్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సందర్శకులు భారీగా తరలొచ్చారు. దీంతో సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం జనంతో కిటకిటలాడింది. ఇదే రోజు మంత్రులు దనసరి సీతక్క, కొండా సురేఖ వనదేవతలను సందర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నవతెలంగాణ - ములుగు

## రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలి

- రైతుబంధును వెంటనే జమచేయాలి : శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతులకు రూ.2 లక్షల లోపు వ్యవసాయ రుణాన్ని మాఫీ చేస్తామన్న వాగ్దానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి సూచించారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు పైసలు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో వ్యవసాయ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సోనియా గాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9 అయిపోయి నెల దాటినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లుగా వ్యవసాయ యాంత్రిక పరికరాలకు సబ్సిడీ ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పాలు చేసిందనీ, పంటల బీమా యోజనను తెలంగాణలో అమలు చేయలేదని విమర్శించారు. కొత్త ప్రభుత్వమైనా రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి, పాపయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, కార్యదర్శులు నరసింహారెడ్డి, నిరంజన్, అలేందర్ పాల్గొన్నారు.

# 'గ్రీన్‌ఫీల్డ్'కు భూములు ఇచ్చేది లేదు

- రైతుల నిరసన
- ఆర్‌డీఓ కార్యాలయం వద్ద పురుగుల మందు డబ్బాలతో ధర్నా



నవతెలంగాణ-పరకాల

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు కోసం వ్యవసాయ భూములను ఇచ్చేది లేదంటూ రైతులు పురుగు మందు డబ్బాలు పట్టుకుని బుధవారం వరంగల్ జిల్లా పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఆవరణం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో పరకాల మండలంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం ఇస్తామని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెవెన్యూ డివిజన్ కార్యాలయం నుంచి రైతులకు అవార్డు ఇస్తామని నోటీసులు రావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారన్నారు. భూములు ఇవ్వకుండానే తమకు ఎలా అవార్డులు ఇస్తారని, నోటీసులు అందజేయడం ముమ్మాటికీ మోసమని రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అధికారిని నిలదీశారు. ఎన్‌హెచ్‌ఐ అధికారుల ముందు కూర్చుని "మీకు భూమి ఇచ్చేది లేదంటూ" పురుగుమందు డబ్బాలతో రైతులు నిరసన తెలపడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఆర్డీవో శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే ద్వారా భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కున్న సెక్యూరిటీ గార్డ్

- గంటన్నరపాటు నరకయాతన
- నిజామాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీలో ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రమాదవశాత్తు సెక్యూరిటీ గార్డు లిఫ్టులో ఇరుక్కున్నాడు. కాళ్లు బయట, దేహం లిఫ్టు లోపల ఉండటంతో సుమారు గంటన్నరపాటు నరకయాతన అనుభవించాడు. ఫైర్ రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని కోటగల్లిలో గల లావణ్య అక్రేడ్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సదరు షాపింగ్ కాంప్లెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ హౌసింగ్ లోన్ బ్యాంక్‌లో మహేందర్‌గౌడ్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఉదయం 8.30 గంటల సమయంలో వాష్ రూమ్ కోసం లిఫ్ట్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో దిగే క్రమంలో మధ్యలో లిఫ్టు ఆగిపోయింది. వెనుకకు జరిగి కుంగినట్టు కావడంతో జారి కాళ్లు ఇరుక్కు పోయాయి. కాళ్లు బయట.. బాడీ లోపల ఉండిపోయి ఇరుక్కున్నాడు. అరుపులు, కేకలు పెట్టినా.. ఆ సమయంలో పైన ఎవరూ లేకపోవడంతో అలాగే ఉండిపోయాడు. పైనకు వెళ్లిన ఆయన ఇంకా రాలేదని మరో సెక్యూరిటీ గార్డు వెళ్లి చూసి.. ఫైర్ సహాయక సెంటర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ ఫైర్ స్టేషన్ రెస్క్యూ బృందం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టి అరగంటలో అతన్ని బయటకు తీశారు. గంటన్నర పాటు నరకయాతన అనుభవించిన సెక్యూరిటీ గార్డు మహేందర్‌గౌడ్‌ను లిఫ్టు నుంచి వెలుపలికి తీశాక 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ రెండు గంటలైనా సరిగా పట్టించుకోలేదని బాధితుడి కుటుంబీకులు వాపోయారు. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా పడింది. బుధవారం సుప్రీం కోర్టులో విచారణ రాగా ధర్మాసనం కూర్చోవడం లేదని, విచారణకు మరో తేదీని వెల్లడిస్తామని కేసును విచారిస్తున్న జస్టిస్ అనిరుద్ధ బోస్ వెల్లడించారు. ఫైబర్ నెట్ కేసులో తన అనుకూల వర్గానికి కాంట్రాక్ట్ ఇచ్చారని, వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబుపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కోర్టు పరిశీలించి ముందస్తు బెయిల్‌ను నిరాకరించింది. దీంతో చంద్రబాబు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలాఎం. త్రివేదీల ధర్మాసనం విచారణ జరపాల్సి ఉండగా విచారణ వాయిదా వేసింది.

## ఎలక్ట్రానిక్ ఆధారాల ప్రతులు ఇవ్వరేం ?

- భీమా కోరేగావ్ కేసులో ఎన్‌ఐఏపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : భీమా కోరేగావ్ కేసులో నిందితుడైన మానవ హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లాఖాకు ఎలక్ట్రానిక్ ఆధారాలకు సంబంధించిన ప్రతులను ఎందుకు ఇవ్వడం లేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ పత్రాల ఆధారంగానే ఎన్‌ఐఏ దర్యాప్తు జరుపుతోందని, అయితే వాటి ప్రతులను నిందితుడికి అందజేయడంలో ఆ సంస్థ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు అనేక ఆదేశాలు జారీ చేసినప్పటికీ సీఆర్‌పీసీలోని సెక్షన్ 207ను దర్యాప్తు సంస్థ ఖాతరు చేయడం లేదని ప్రత్యేక న్యాయమూర్తి రాజేష్ కటారియా తప్పుపట్టారు. ప్రాసిక్యూషన్ ఏ ఆధారాలను బట్టి విచారణ జరుపుతోందో వాటి ప్రతులను నిందితులకు అందజేయాలని ఈ సెక్షన్ నిర్దేశిస్తోంది. పూనే సమీపంలోని ఓ గ్రామంలో 2018లో జరిగిన కుల ఘర్షణల కేసులో (భీమా కోరేగావ్ కేసు) నవ్‌లాఖాను నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో ఆయనతో పాటు మొత్తం 16 మందిని చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అరెస్ట్ చేశారు. గత సంవత్సరం డిసెంబర్ 19న బాంబే హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసినప్పటికీ దానిపై స్టే ఇచ్చింది. విచారణ అధికారులు తన వద్ద నుండి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించిన ఆధారాల ప్రతులను తనకు అందజేసేలా ఎన్‌ఐఏను ఆదేశించాలని నవ్‌లాఖా కోర్టును అభ్యర్థించారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. కాగా ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నుండి ఎలక్ట్రానిక్ ఆధారాలకు సంబంధించిన రెండు సెట్ల కాపీలు మాత్రమే అందాయని, వాటిలో ఒక కాపీని కోర్టుకు అందజేశామని, మరొకటి ప్రాసిక్యూషన్ వద్ద ఉన్నదని ఎన్‌ఐఏ చెబుతోంది.

# సీపీఆర్ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దు

- కేంద్ర హోం శాఖ నిర్ణయం
- తప్పుపట్టిన విద్యావేత్తలు, పరిశోధకులు

న్యూఢిల్లీ : సెంటర్ ఫర్ పాలసీ రిజిస్ట్రేషన్ (సీపీఆర్) సంస్థకు గతంలో మంజూరు చేసిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారికంగా రద్దు చేసింది. సీపీఆర్ సంస్థకు చెందిన ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను గత సంవత్సరం ఫిబ్రవరిలోనే సస్పెండ్ చేశారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ ను రద్దు చేశామని ఈ నెల 10న సీపీఆర్‌కు సమాచారం అందింది. అయితే ఈ విషయంలో తగిన న్యాయం పొందేందుకు చట్టపరమైన అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని సీపీఆర్ అధ్యక్షులు యామినీ అయ్యర్ తెలిపారు. 2022 సెప్టెంబరులో సీపీఆర్, ఆక్స్‌ఫామ్ ఇండియా సహా పలు ఎన్జీఓల కార్యాలయాలపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు చేశారు. సోదాల తర్వాత తనకు అందిన నోటీసులన్నింటికీ తగిన రీతిలో స్పందించానని సీపీఆర్ తెలిపింది. అయితే విద్యా కార్యక్రమాల కోసం విదేశీ నిధులు పొందేందుకు సీపీఆర్‌ను అనుమతించామని, కానీ ఎఫ్‌సీఆర్‌ఏ నిధులను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని గత సంవత్సరం ఫిబ్రవరి 27న కేంద్ర హోం శాఖ ఆరోపించింది. ఈ వ్యవహారంలో న్యాయపరమైన పోరాటాలు చేస్తున్నప్పటికీ సీపీఆర్‌పై కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగడాన్ని ప్రపంచవ్యాప్తంగా పలువురు విద్యావేత్తలు, పరిశోధకులు తప్పుపట్టారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన, విశ్వసనీయమైన విధాన పరిశోధనా సంస్థల్లో సీపీఆర్ ఒకటని వారు గుర్తు చేశారు.

సీపీఆర్‌కు వ్యతిరేకంగా ఆదాయపన్ను శాఖ చేపట్టిన చర్యలపై గతంలో జోక్యం చేసుకున్న ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టు వాటిని తాత్కాలికంగా నిలిపివేశాయి. ఐటీ శాఖ ఆదేశాలకు వ్యతిరేకంగా సీపీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రస్తుతం ఢిల్లీ హైకోర్ట్ విచారణ జరుపుతోంది.

భోజనానికి ముందు మాత్రమే కాదు... వణికించే చలిలో... వీలున్నప్పుడల్లా వేడివేడిగా సూప్ తాగితే కలిగే హాయి అంతా ఇంతా కాదు. అలాగని కాసిని నీళ్లూ రెండు కూరగాయ ముక్కలు వేసి మొక్కుబడిగా కాకుండా.. పోషకాలను అందించే వివిధ రకాల సూప్‌లను తయారు చేసుకోవచ్చు. తయారీలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే రుచితో పాటు ఆరోగ్యమూ సొంతమవుతుంది.

# వణికించే చలిలో వేడి వేడి సూప్స్



## గుమ్మడి, వాము సూప్

**కావాల్సిన పదార్థాలు :** గుమ్మడి ముక్కలు - అరకేజీ, ఆలివ్‌నూనె - రెండు చెంచాలు, ఉల్లిపాయ - ఒకటి, వెల్లుల్లి రెబ్బ - ఒకటి, వాము - పావుకప్పు (దొరికితే వాము ఆకులు కూడా చేసుకోవచ్చు), కూరగాయలు ఉడికించిన నీళ్లు - మూడున్నర కప్పులు, వెన్న తీసిన పాలు - ముప్పావు కప్పు, బేసిల్ పెస్టో - రెండు చెంచాలు, ఉప్పు, మిరియాల పొడి - రుచికి తగినంత

**తయారు చేసే విధానం :** గిన్నెలో ఆలివ్‌నూనెను వేడిచేసి గుమ్మడి ముక్కల్ని వేయించాలి. పదిహేను నిమిషాలయ్యాక ఉల్లిపాయ, వెల్లుల్లి ముక్కలు వేసి మరో రెండు నిమిషాలు వేలయించాలి. ఇందులో వాము వేసి కూరగాయలు ఉడికించిన నీళ్లు కూడా పోసి మూతపెట్టేయాలి. పదిహేను నిమిషాలకు కూరముక్కలు మెత్తగా అవుతాయి. ఆ తర్వాత మిక్సీలో వేసి ప్యూరీలా చేసి వెన్న తీసిన పాలు కలిపి మరోసారి వేడిచేయాలి. రెండు మూడు నిమిషాల య్యాక బేసిల్ పెస్టో వేసి దింపేసేయాలి. పసందైన సూప్ సిద్ధం.



## యాపిల్ గుమ్మడి సూప్

**కావాల్సిన పదార్థాలు :** తరిగిన యాపిల్ ముక్కలు - రెండు కప్పులు, ఉల్లిపాయ ముక్కలు - అరకప్పు, ఆలీవ్‌నూనె- రెండు చెంచాలు, మైదా పిండి - చెంచా, కూరగాయలు ఉడికించిన నీళ్లు - నాలుగు కప్పులు, కొద్దిగా ఉడికించిన గుమ్మడి ముక్కలు - మూడు కప్పులు, చెక్కెర - రెండు చెంచాలు, అల్లం, ఉరికాయలతో చేసిన పొడి - అరచెంచా, యాపిల్ రసం - కప్పు, ఉప్పు, మిరియాల పొడి- రుచికి తగినంత

**తయారు చేసే విధానం :** వెడల్పాటి కడాయిలో ఆలివ్‌నూనె వేడి చేసి యాపిల్, ఉల్లిపాయ ముక్కల్ని వేయించాలి. ఆ తర్వాత మైదాపిండి వేసి కూరగాయలు ఉడికించిన నీళ్లు కలపాలి. పది నిమిషాలకు ఇది చిక్కని మిశ్రమంలా తయారవుతుంది. ఇందులో గుమ్మడిముక్కలు, చెక్కెర, మసాలా పొడి వేసి మంట తగ్గించి కనీసం ఇరవై ఐదు నిమిషాలు మరగనిచ్చి దింపేయాలి. ఇదంతా చల్లారాక మిక్సీలో వేసి మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దీన్ని మళ్లీ ఐదు నుంచి పది నిమిషాలు వేడి చేసి తగినంత ఉప్పు, మిరియాల పొడి, యాపిల్ రసంను వేసి తర్వాత కప్పుల్లోకి సర్వ్ చేసుకోవచ్చు. ఇష్టపడే వారు ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లగా కూడా తీసుకోవచ్చు.

## చికెన్ బ్రౌన్ రైస్ సూప్

**కావాల్సిన పదార్థాలు :** ఉప్పు కలపని చికెన్ స్టాక్ - ఎనిమిది కప్పులు, ఉల్లిపాయ - ఒకటి, క్యారెట్లు - మూడు, కొత్తిమీర- రెండు కట్టలు, నీళ్లు- రెండు కప్పులు, బ్రౌన్ రైస్ - రెండు కప్పులు, చికెన్ ముక్కలు - పావుకప్పు, బిర్యానీ ఆకు - ఒకటి, పాలకూర - కట్ట, ఉప్పు, మిరియాలపొడి -రుచికి తగినంత


**తయారు చేసే విధానం :** కాస్త మందపాటి గిన్నెలో అరకప్పు చికెన్ సాక్‌ను మరిగించాలి. అందులో ఉల్లిపాయ, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర వేసి మధ్య మధ్యలో కలుపుతూ కనీసం ఎనిమిది నిమిషాలు మరిగించాలి. ఇప్పుడు మిగిలిన చికెన్ స్టాక్, నీళ్లు, బియ్యం, చికెన్ ముక్కలు, బిర్యానీ ఆకు ఒకదాని తర్వాత ఒకటి వేసేయాలి. మంట తగ్గించి కనీసం అరగంట దాకా మరిగించాలి. అన్నం చికెన్ ముక్కలు ఉడికాక బిర్యానీ ఆకు తీసేసి పాలకూర తరుగు వేయాలి. ఐదు నిమిషాలయ్యాక రుచికి సరిపడా ఉప్పు, మిరియాలపొడి కలిపి కప్పుల్లోకి తీసుకుంటే సరిపోతుంది.



## కీర, బ్రకోలీ సూప్

**కావాల్సిన పదార్థాలు :** ఆలివ్‌నూనె - రెండు చెంచాలు, ఉల్లిపాయ - సగం, కీరదోస - ఐదు, బ్రకోలీ పువ్వులు - అరకప్పు (దీనికి బదులు క్యాలీఫ్లవర్ కూడా వాడొచ్చు), ఉప్పు కలపని చికెన్ స్టాక్ - కప్పు, డ్ర - క్రీం - ముప్పావు కప్పు, ఉప్పు మిరియాల పొడి - రుచికి తగినంత

**తయారు చేసే విధానం :** మందపాటి కడాయిలో ఒకటి ముప్పావు చెంచా ఆలివ్‌నూనెను వేడిచేసి ఉల్లిపాయ, కీరదోస, బ్రకోలి ముక్కల్ని వేసి వేయించాలి. పదినిమిషాలయ్యాక చికెన్ స్టాక్‌ని కలపాలి. మంట తగ్గించి మధ్యమధ్య కలుపుతూ ఉంటే మరో పది నిమిషాలకు కూరముక్కలు ఉడుకుతాయి. అప్పుడు పొయ్యి కట్టేసి ఈ మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి మెత్తగా చేసుకోవాలి. ఇందులో గిలక్కొట్టిన క్రీం, తగినంత ఉప్పు, మిరియాలపొడి వేయాలి. ఈ సూప్‌ను మరో ఐదు నిమిషాల పాటు వేడిచేసి మిగిలిన ఆలివ్‌నూనెను వేస్తే సరిపోతుంది.



## గార్డెన్ బేసిల్ సూప్

**కావాల్సిన పదార్థాలు :** టమాట ముక్కలు - రెండు కప్పులు, కీరదోస - మూడు, ఉల్లిపాయ, క్యాప్సికం ఒక్కోటి చొప్పున, కొత్తిమీర తరుగు- పావుకప్పు, క్యారెట్లు - నాలుగు, బేసిల్ పెస్టో - పావుకప్పు (ఇది బజార్లో దొరుకుతుంది) లేదంటే కొత్తిమీర పేస్టు కూడా ఉపయోగించుకోవచ్చు) పాలకూర - కట్ట, ఆలివ్నూనె- రెండు చెంచాలు, కూరగాయలు ఉడికించిన నీళ్లు - అరకప్పు, ఉప్పు-తగినంత, మిరియాల పొడి- రుచికి సరిపడా, టమాట పేస్టు - నాలుగు చెంచాలు

**తయారు చేసే విధానం :** గిన్నెలో ఆవనూనెను వేడి చేయాలి. అందులో ఉల్లిపాయ, క్యాప్సికం, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర తరుగును వేసి వేయించాలి. అవి కాస్త మగ్గాక కీరదోస ముక్కలు, పాలకూర ఆకులు చేర్చాలి. పాలకూర ఆకులు కొద్దిగా మెత్తగా అయ్యాక టమాట ముక్కలు, టమాట పేస్టు, పెస్టో సూప్‌ను కూరగాయలు ఉడికించిన నీళ్లను ఒకదాని తర్వాత ఒకటి వేసుకోవాలి. మంట తగ్గించి మధ్యమధ్యలో కలుపుతూ ఉంటే కాసేపటికి కూరముక్కలు మెత్తగా ఉడుకుతాయి. అప్పుడు ఉప్పు, మిరియాల పొడి వేసి మరో పదిహేను నిమిషాలు మరిగించాలి. చివరగా బేసిల్ పెస్టో వేసి మరో ఐదు నిమిషాలు ఉంచి దింపేస్తే సరి.



## ఆరోగ్యంపై దృష్టి అవసరం..



మహిళలు కుటుంబంలోని అందరి కోసం అన్ని పనులు చేస్తుంటారు. కానీ వారి కోసం వారికి సమయం ఉండదు. అంద రికీ అన్ని అందిస్తూ, వారి గురించి వారు పట్టించుకోవాలనే విషయాన్ని విస్మరిస్తారు. ఎప్పుడూ తమకంటూ ప్రాధాన్యత నిచ్చుకోరు. భర్త, పిల్లలు, బంధువులు, స్నేహితులు, ఉద్యోగం, లెక్కలేనన్ని ప్రాధాన్యతలు, బాధ్యతలు వారు మోస్తుంటారు. ఈ బాధ్యతలతో పాటు మహిళ తన గురించి తాను పట్టించుకోవాలి. ఇలా చేయకపోవడం వల్ల ఏర్పడే సమస్య వారు అందరితో కలిసి బయటకు వెళ్లినప్పుడు, స్నేహితులతో పార్టీలకు వెళ్లేపుడు, మేకప్ వేసుకునేపుడు తెలుస్తుంది వారు ఎంత పెద్ద వారిలా కనిపిస్తున్నామో అని. అన్ని బంధాల మధ్య తమకంటూ సమయం కేటాయించుకోని వారికి సాధారణం కంటే కొంత వయసు ఎక్కువగానే కనిపిస్తుంటుంది. చర్మం ముడతలు పడి పోతుంటుంది. దీని వల్ల పైబడిన వయసును తగ్గించుకోవడానికి కాస్త మేకప్ ఎక్కువగానే వేసుకోవాల్సి వస్తుంది. అయినప్పటికీ చర్మంపై ఉండే ముడతలు ఆ మేకప్ వల్ల పూర్తిగా తొలగిపోతాయా..? ఎక్కువ కాలం యవ్వనంగా ఉంచగలుగుతుందా..? అంటే సందేహమే.. అందుకే మహిళలు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

**వయసు ప్రస్తావనకు మోహమాటం..**

ఈ రోజుల్లో ఎప్పటికప్పుడు ఫ్యాషన్లు మారుతున్నాయి. అందంగా ఉండాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. కానీ మహిళలు తమ శరీరం అందుకు తగినట్టు ఉందా లేదా అని చూసుకోవాలి. అందుకోసం చిన్న చిన్న జాగ్రత్తలు పాటించాలి. ఆహారం, వ్యాయామం వంటి వాటికి కొంత సమయం కేటాయించాలి. వీటితో పాటు సరిపోనూ నీటిని తీసుకుంటుండాలి. సాధారణంగా మనం చూస్తూనే ఉంటాం.. మహిళలు ఎన్ని విషయాల గురించి ఇతరులతో మాట్లాడుకున్నా, వయసు గురించి మాత్రం మాట్లాడడానికి ఇష్టపడరు. చాలా మంది తక్కువ వయసు ఉన్నా వయసు పైబడిన వారిలా కనిపిస్తారు. దానిని శరీర తత్వంపై నిందలేస్తుంటారు. ఇది అందరూ చేస్తుండకపోవచ్చు. కానీ ఎలా ఉన్నాం అనే విషయాన్ని మనం శరీరంలోని రోగ నిరోధక శక్తి నిర్ణయిస్తుంది. సరైన ఆహారం తీసుకుని, వ్యాయామం చేస్తుంటే మేకప్ ఎక్కువ వేసుకోవాల్సిన అవసరం ఉండదు. ఈ పద్ధతులు పాటిస్తే యవ్వనంగా ఉండొచ్చు.

**వ్యాయామాలతో మేలు..**

మీరు ఇష్టపడే యోగ, పిలేట్స్, బీట్ పంప్, కిక్-బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్, ఇతర ఫిట్నెస్‌కు ఉపయోగపడే దేన్నైనా ప్రయత్నించొచ్చు. వ్యాయామం మీలోని రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని రక్త ప్రసరణను సరిగా ఉంచుతుంది. మీ శరీరాన్ని సమస్థితిలో ఉంచడానికి సహాయపడుతుంది. డాన్స్ చేయడం వల్ల కూడా శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎందువల్లంటే, డాన్స్ చేస్తుంటే శరీరంలో ఎసిటోసిన్, సెరోటోనిన్ అనే హ్యాపీ హార్మోన్స్ ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల మనసు ఆనందంగా ఉంటుంది. శరీరమూ ఉత్తేజంగా ఉంటుంది. రోజువారీ చేసే వర్కవుట్‌ల కంటే డాన్స్ మనసుకు ఎక్కువ ఉత్తేజాన్నిస్తుంది. ఇందుకు తగినట్టే రోజురోజుకు కొత్త కొత్త డాన్స్ స్టెప్స్ వస్తున్నాయి. ఎప్పుడూ ఏదోకటి కొత్తగా నేర్చుకుంటుండడం వల్ల ఒత్తిడి, ఆందోళనలు దూరమవుతాయి. ఫలితంగా ముడతలు తక్కువగా వస్తాయి. వీటితో పాటు ఎక్కువ నీటిని తాగాలి. రోజుకు కనీసం 1-2 లీటర్ల నీటిని తప్పనిసరి తీసుకోవాలి. వీటిని క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలి. తాజా కూరగాయలతో పాటు పండ్లు తీసుకుంటుండాలి. వీటి వల్ల శరీరం నుంచి వ్యర్థాలు తొలగిపోతాయి. ఫలితంగా చర్మం కాంతులీనుతుంది. వీటితో పాటు ఉద్యోగం చేసే చోట, పిల్లలతో, బంధువుల వద్ద ఎక్కడ సంతోషంగా ఉంటామో ఆ ప్రదేశంలో ఎక్కువ సమయం కేటాయించుకోవాలి. సంతోషంగా ఉంటే శరీరం కాంతులీనుతుంది.

## వంద రోజులు కాలేదని ఆగుతున్నాం..

(మొదటిపేజి తరువాయి)

చెప్పారు. ఐదేండ్లకే ప్రజా వ్యతిరేకతను ఎక్కువగా మూటగట్టుకుని ఇంటికి పోయిన ప్రభుత్వాలు కాంగ్రెస్‌వే ఎక్కువని గుర్తుచేశారు. రాష్ట్ర బడ్జెట్ 2.90 లక్షల కోట్లు అయితే కాంగ్రెస్ ఆ బడ్జెట్‌కు మించి హామీలిచ్చిందని విమర్శించారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీల అమలుకు డబ్బులు లేవని కర్ణాటక ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి చెప్పారని గుర్తుచేశారు. సంప్రదాయ రాజకీయ పద్ధతులకు కేసీఆర్ దూరంగా ఉండటం కొంత నష్టం చేసిందన్న భావన కార్యకర్తల్లో ఉందన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే తెలంగాణ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. విభజన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదనీ, ఈ కీలక సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీలో లేకపోతే తెలంగాణకు నష్టమన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఓ గుణపాఠంగా పార్లమెంటులో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం చేతులెత్తేసిందని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 111వ హామీ కింద పాలమూరుకు జాతీయ హోదా తెస్తామని చెప్పిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేది పోయి కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ప్రతి రోజూ బీజేపీ నాయకుల మెడలకు దండలు వేస్తున్నారని విమర్శించారు. బండి సంజయ్ కాంగ్రెస్ బీజేపీల మైత్రిని బహిరంగంగా ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ లొట్ట పిట్టలా వార్తల్లో ఉండేందుకు తాపత్రయ పడుతున్నారని విమర్శించారు.

నిటిఅయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో రాష్ట్ర ఆర్థిక ప్రగతిని గొప్పగా పొగిడిందనీ, దేశంలో పేదరికం తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉందని తెలిపారు. తెలంగాణ కన్నా ముందు కేరళ, తమిళనాడు రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో పేదరికం మూడు శాతముంటే, పీఎం సొంత రాష్ట్రం గుజరాత్‌లో 9 శాతముందన్నారు. దావోస్ వెళ్లడం అంటే ఖర్చు దండగ అని ప్రతిపక్షంలో ఉండగా విమర్శించిన ఉత్తమ్ ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ హత్యా రాజకీయాలు మొదలుపెడుతోందనీ, ఈ పద్ధతి మంచిది కాదనీ, మార్చుకోవాలని హితవు పలికారు.

## కేరళలో తొలిసారిగా పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగ పీఠిక

(మొదటిపేజి తరువాయి)

తీసుకురావడంలో భాగంగా ఈ చర్య తీసుకున్నారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించేలా సంస్కరణలు తీసుకొస్తామని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మొదటనుండి చెబుతోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎస్‌సిఇఆర్‌టి) డైరెక్టర్ జయప్రకాష్ ఆర్.కె. మాట్లాడుతూ, అనేక ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో ఇప్పటికే రాజ్యాంగ పీఠిక వుందని, కేరళలో ఇలాంటి చర్య తీసుకోవడం ఇదే ప్రథమమని తెలిపారు. టీచర్ల శిక్షణలో కూడా దీన్ని భాగం చేయనున్నట్లు చెప్పారు. అప్పుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ పీఠిక ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. పాఠ్యపుస్తకం ఏ మీడియం అయితే పీఠిక కూడా అదే భాషలో వుంటుందన్నారు. రాజ్యాంగం, విలువలపై దేశంలో విస్తృతంగా చర్చ జరుగుతున్న సమయంలో ఇటువంటి చర్య తీసుకోవడం వల్ల పిల్లల్లో చిన్ననాటి నుండే దీని ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు.

## యూరియా కోసం క్యూలైన్లలో రైతులు

- మార్పు అంటే ఇదేనా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిలబడుతున్నారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇదేనా? అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగ్గాలేక, రైతుకు పెట్టుబడి సాయం అందక, పంటలకు నీళ్లివ్వక సాగు విస్తీర్ణం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కీలక విషయాలపై ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. యాసంగి వ్యవసాయ ప్రణాళిక ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## కార్పొరేట్లే కారణం

(మొదటిపేజి తరువాయి)

సంస్థల సీఈఓలు లేదా ప్రధాన వాటాదారులు బిలియనీర్లే. ఈ కంపెనీల సంపద 10.2 ట్రిలియన్ల డాలర్లు. లాటిన్ అమెరికా, ఆఫ్రికాలోని అన్ని దేశాల సంయుక్త జీడీపీని వీరి సంపద దాటేసింది. వరల్డ్ బెంచ్‌మార్కింగ్ అలయన్స్ సంస్థ నుండి తీసుకున్న సమాచారాన్ని ఆక్స్‌ఫామ్ విశ్లేషించింది. ప్రపంచంలో అతి పెద్ద 1,600 కంపెనీల్లో కేవలం 0.4శాతం కంపెనీలు మాత్రమే తమ వద్ద పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లిస్తున్నాయని ఆ విశ్లేషణలో తేలింది.

కార్పొరేట్ సంస్థల్లో వాటాదారులుగా ఉన్న సంపన్నులు తమ హోదా కారణంగా మరింత ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. అత్యంత సంపన్నులైన ఒక శాతం మంది వాటాదారులకు ప్రపంచ ఆర్థిక ఆస్తుల్లో 43% వాటాలు ఉన్నాయి. పశ్చిమాసియా, మధ్యప్రాచ్య ప్రాంతంలో ఇది 48శాతంగా, ఆసియాలో 50శాతంగా, యూరప్‌లో 47శాతంగా ఉంది.

2022 జూలై, 2023 జూన్ మధ్య కాలంలో 93 బడా కార్పొరేట్ సంస్థలు ఆర్జించిన ప్రతి వంద డాలర్ల లాభంలోనూ 82 డాలర్లు వాటాల బైబ్యాక్, డివిడెంట్ల రూపంలో వాటాదారులకు వెళుతున్నాయి. 2023 జూన్‌తో ముగిసిన 12 నెలల కాలంలో ప్రపంచంలోని 148 బడా కార్పొరేట్ సంస్థలు 1.8 ట్రిలియన్ డాలర్ల లాభాలను మూటకట్టుకున్నాయి. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ అనే సంస్థ 2022లో తెలిపిన వివరాల ప్రకారం ప్రపంచ జనాభాలో అత్యంత పేదలుగా ఉన్న 50శాతం మంది ప్రపంచ ఆదాయంలో కేవలం 8.5శాతం మాత్రమే పొందగలిగారు.

**ఆ శక్తులదే గుత్తాధిపత్యం**

ఆదాయంలో లింగ వ్యత్యాసం కూడా బాగా కన్పిస్తోంది. ఎలాంటి వేతనం లేకుండా ఇంటిపనికే పరిమితమైన మహిళలు ఆర్థిక వ్యవస్థకు 10.8 ట్రిలియన్ డాలర్ల ప్రయోజనం చేకూరుస్తున్నారు. ప్రపంచ టెక్ పరిశ్రమ నుండి లభిస్తున్న మొత్తంతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. ఈ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాల మద్దతు, సబ్సిడీలతో ప్రయోజనం పొందుతోంది. ప్రపంచంలో అసమానతలు పెరగడానికి గుత్తాధిపత్య కార్పొరేట్ శక్తులు కారణమవుతున్నాయి. ఈ శక్తులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను, ప్రభుత్వాలను తమ గుప్పిట్లో పెట్టుకొని వాటిని ప్రభావితం చేస్తున్నాయి. కార్మిక చట్టాలు, విధానాలను సైతం అవే రూపొందిస్తున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ జరిపిన ఓ అధ్యయనాన్ని కూడా ఆక్స్‌ఫామ్ తన నివేదికలో ఉటంకించింది. అమెరికాలోని ఉత్పాదక రంగంలో కార్మికుల వాటా 76శాతం మేర పడిపోవడానికి ఈ కార్పొరేట్ శక్తులే కారణమవుతున్నాయి. ఈ శక్తులు కార్మికులు, చిన్న వ్యాపారులను అణచివేస్తున్నాయి. ఉదాహరణకు 1995-2015 మధ్యకాలంలో 60 ఔషధ తయారీ కంపెనీలు పది బడా ఫార్మా సంస్థల్లో విలీనం అయ్యాయి. 1975-2019 మధ్య అనేక సంస్థలు రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించినప్పటికీ కార్పొరేట్ పన్ను రేటు 23% నుండి 17%కి తగ్గింది.

## ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె,గ్రామీణ బంద్

(మొదటిపేజి తరువాయి)

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు యాదవ్, పి. నారాయణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహా, శ్రామిక మహిళా నాయకులు ఎస్వీ. రమ, అరుణక్క, అనురాధ, కరుణ కుమారి, తదితరులు మాట్లాడారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా రైతులు, కార్మికులు, శ్రామిక మహిళలు, ప్రజల సమస్యలను పరిష్కరించకుండా మరుగు పరుస్తోందని విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్న తీరును వివరించారు. 50 ఏండ్ల గరిష్టానికి నిరుద్యోగం చేరిందన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాల భర్తీ అటకెక్కిందన్నారు. శ్రామికుల నిజవేతనాలు 20 శాతం తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సమ్మె హక్కును కాలరాసిందనీ, పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్‌బోర్డులను నిర్వీర్యం చేస్తున్నదని వివరించారు. 12 గంటల పనివిధానాన్ని అమల్లోకి తెచ్చిందనీ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అవర్లీబేస్డ్ పనిపద్ధతులను తీసుకొచ్చి కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్నదని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేందుకు అస్సలు అంగీకరించడం లేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి నిరాకరిస్తోందన్నారు. వీటన్నింటినీ దాచిపెట్టి ఆకట్టుకునే నినాదాలు, భావోద్వేగ ప్రసంగాలతో మోడీ సర్కారు ప్రజలను మోసగిస్తోందన్నారు. దీనివల్ల దేశానికి జరుగుతున్న నష్టాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు వందన సమర్పణ చేశారు. సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. చంద్రశేఖర్, ఎం. వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, కాసు మాధవి, ఎ. సునీత, పి. సుధాకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు శివబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## గుడిసెవాసులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

(మొదటిపేజి తరువాయి)

వేస్తే తప్పేంటని ప్రశ్నించారు. గత పాలకులు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేయడం మూలంగానే పేదలు కాంగ్రెస్‌ను ఆదరించారని, అలాంటిది వారు అధికారంలోకి వచ్చాక పేదల గుడిసెలను కూల్చడం దారుణ చర్యగా అభివర్ణించారు. అమాయకులైన పేదలపైనా, వారికి అండగా నిలిచిన సీపీఐ(ఎం) నాయకులపైనా అక్రమంగా కేసులు నమోదు చేసి జైల్లో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గతంలో తాము సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం సమర్పించామని చెప్పారు. కానీ, జగిత్యాల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. నాయకులు, పేదలపై 307లాంటి కేసులను అక్రమంగా బనాయించి రిమాండ్‌కు తరలించారన్నారు. రిమాండ్ చేసిన 11 మందిని తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలన్నింటినీ ఐక్యం చేసి పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం)



జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. పేదలు వేసుకున్న గుడిసెలను తిరిగి నిర్మించాలని, రిమాండ్ చేసిన నాయకులను, పేదలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరమణ, కరీంనగర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, నాయకులు గుడికందుల సత్యం, జి.బీమా సాహెబ్, ఎడ్లరమేష్, నరేష్ పాల్గొన్నారు.

**జగిత్యాలలో పేదలకు దిశానిర్దేశం**

జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్ నగర్‌లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు, కార్యకర్తలతో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య, నాయకులు గీట్ల ముకుందరెడ్డి బుధవారం సమావేశమయ్యారు. తదుపరి పోరాటంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆశయ్య, ముకుందరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో వీరనారి ఐలమ్మనగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఆర్నెళ్ల కిందట పేదలు వేసుకున్న గుడిసెలను ఈ నెల 16న తెల్లవారుజామున వందలాది మంది పోలీసులు బుల్డోజర్లతో వచ్చి కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఎమ్మెల్యేలు, ఎంపీలు కబ్జా చేస్తున్నా.. అధికారులకు కనిపించడం లేదన్నారు. గుడిసెలను కూల్చిన స్థలంలోనే ఇండ్లు నిర్మించాలని, వాటికి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. వెంకటాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సారంగపాణి, శారద, కె.చంద్రశేఖర్, సుధారాణి, హరీష్, ఎండి సలీం, హఫీజ, సులేమాన్, పద్మ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మహేశ్ కుమార్, బల్మూరి వెంకట్

(మొదటిపేజి తరువాయి)

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ వేరు వేరుగా నిర్వహించాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. రెండు స్థానాలు కాంగ్రెస్‌కే దక్కే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత వారం రోజులుగా పలువురు ఆశావహులు ఢిల్లీ పెద్దలను కలిసి, లాబీయింగ్ కూడా చేశారు. అయితే ఓడిన వారికి, సీనియర్లకు అవకాశం ఉండదని అధిష్టానం క్లారిటీ ఇచ్చింది. అలాగే పార్టీ కోసం తమ సీటు త్యాగం చేసిన వాళ్లకు, పార్టీని అధికారంలోకి తేవడంలో క్షేత్రస్థాయిలో కృషి చేసిన నేతలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టం చేసింది. మరోవైపు ఈ రెండు స్థానాల కోసం దాదాపు 12మందికిపైగా నేతల పేర్లు వినిపించాయి. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ సీట్లను పార్టీ కోసం త్యాగం చేసిన ముగ్గురి పేర్లు బలంగా వినిపించాయి. ఈ జాబితాలో తుంగతుర్తి సీటు వదులుకున్న అద్దంకి దయాకర్, నిజామాబాద్ అర్బన్ సీటును త్యాగం చేసిన మహేశ్ కుమార్ గౌడ్, అలాగే చిన్నారెడ్డి పేర్లు బలంగా వినిపించాయి. తాజాగా బల్మూరి వెంకట్‌తో పాటు అద్దంకి దయాకర్ లను పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించినట్టు తొలుత ప్రచారం కూడా జరిగింది. అయితే చివరికి అద్దంకి దయాకర్ స్థానంలో మహేశ్ కుమార్ గౌడ్‌ను అధిష్టానం ఖరారు చేసింది. మహేష్‌కుమార్‌గౌడ్ సామాజిక సమీకరణాల రీత్యా చాలా సార్లు ఆయనకు అసెంబ్లీ టికెట్ దక్కలేదు. ప్రస్తుతం ఆయన టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన పార్టీ సంస్థాగత బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కాగా... టీఎస్‌పీఎస్సీ తప్పిదాలు, పేపర్ లీకేజీలపై వెంకట్ నేతృత్వంలో ఎన్ఎస్‌యూఐ పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించింది. అలాగే యువతీయువకుల్లోకి బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను తీసుకుపోవడంలో వెంకట్ విజయవంతమయ్యారు. ఇక హుజురాబాద్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్టానం అవకాశం ఇచ్చినప్పటికీ ఆయన ఓటమి చవిచూశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బల్మూరికి పార్టీ టికెట్ దక్కలేదు.

**పార్టీ నిర్ణయం శిరోధార్యం: అద్దంకి దయాకర్**

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తన పేరు ఉంటుందని భావించిన ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్‌కు షాక్ నిస్తూ అధిష్ఠానం టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. దీనిపై దయాకర్ స్పందించారు. పార్టీ నిర్ణయం తనకు శిరోధార్యమని స్పష్టం చేశారు. టికెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా కార్యకర్తగా పని చేస్తానని అన్నారు. అధిష్ఠానం తనపై పాజిటీవ్‌గా ఉందన్నారు. మరింత మంచి స్థానాన్ని కట్టబెడుతుందని భావిస్తున్నట్టు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

## ఇతర ప్రాంతాలు ఎంతో ఈశాన్యమూ అంతే

**కోహిమా :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర 2.0 బుధవారం నాలుగో రోజుకు చేరింది. నాగాలాండ్‌లోని మోకాక్‌ఛంగ్ జిల్లాలో ఆయన పర్యటించారు. వాహనదారులతో ముచ్చటించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తూ దేశంలోని ఇతర ప్రాంతాలకు ఎంత ప్రాధాన్యత ఉన్నదో ఈశాన్య ప్రాంతానికీ అంతే ప్రాధాన్యత ఉన్నదన్న సంకేతాన్ని పంపడమే తన ఉద్దేశమని చెప్పారు. జనాభా తక్కువే అయినప్పటికీ దాని ప్రాధాన్యత మాత్రం ఒకేలా ఉంటుందని తెలిపారు. మతాన్ని అవకాశంగా తీసుకోవాలని తాను ప్రయత్నించడం లేదని, తన మత సిద్ధాంతాలకు అనుగుణంగా జీవించేందుకు కృషి చేస్తానని అన్నారు. 'నేను ప్రజలను గౌరవిస్తాను. అహంకారంతో మాట్లాడను. విద్వేషాలను వ్యాప్తి చేయను. నాకు సంబంధించినంత వరకూ ఇదే హిందూయిజం' అని చెప్పారు. నాగాల సమస్యకు పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉన్నదని రాహుల్ తెలిపారు. 'అయితే దీనిపై సంప్రదింపులు జరగడం లేదు. పరిష్కారం లభించాలంటే ఒకరు చెప్పినది మరొకరు వినాలి. సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. ఈ విషయంలో ప్రధాని ఎలాంటి చొరవ చూపడం లేదు' అని అన్నారు. ప్రధాని మోడీపై ఆయన విమర్శలు కురిపిస్తూ ఆయన ఆలోచించకుండానే హామీలు ఇస్తుంటారని, అందుకే ప్రజల్లో ప్రధాని పట్ల ఉన్న విశ్వసనీయత సడలిపోతోందని చెప్పారు. దేశంలోని యువతకు ఆయన ఎన్నో హామీలు ఇచ్చారు. విద్య, ఉపాధిపై భరోసా ఇచ్చారు. అయితే గడచిన తొమ్మిది సంవత్సరాల్లో ఏమీ జరగకపోవడంతో ప్రధాని విశ్వసనీయత తగ్గిపోతోంది' అని రాహుల్ అన్నారు.

# శ్రీకాంత్‌కు నిరాశ

## • ఇండియా ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఓటమి


కిదాంబి శ్రీకాంత్

**న్యూఢిల్లీ:** మాజీ నంబర్‌వన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ ఆటతీరు మారలేదు. భారత్ వేదికగా జరుగుతున్న ఇండియా ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో శ్రీకాంత్ 22-24, 13-21 తేడాతో హాంకాంగ్‌కు చెందిన లీ చెక్ యూ చేతిలో వరుససెట్లలో ఓడాడు. తొలి సెట్‌లో పోటాపోటీగా ఆడిన శ్రీకాంత్.. 18వ ర్యాంకర్ లీ చెక్‌తో నువ్వా నేనా అన్నట్టుగా పోరాడాడు. ఒకదశలో ఇరువురు 17-17తో సమంగా ఉన్నా లీ మూడు గేమ్ పాయింట్స్ సాధించడంతో అతడు పైచేయి సాధించాడు. తర్వాత శ్రీకాంత్ పుంజుకున్నా రెండు పాయింట్ల ఆధిక్యంతో లీ.. తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో మరింత రెచ్చిపోయిన హాంకాంగ్ ప్లేయర్.. సెట్‌తో పాటు గేమ్‌నూ సొంతం చేసుకున్నాడు. మరో ఆటగాడు లక్ష్యసేన్ కూడా మంగళవారం తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే. ఇక పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్ల ప్రతీక్-కృష్ణ ప్రసాద్‌ల ద్వయం 14-21, 11-21 తేడాతో ఒకమురా-మిస్తుహాషి(జపాన్) జోడీ చేతిలో, మహిళల డబుల్స్‌లో అయూష్ భట్-శ్రీరామ్ గౌతమ్‌ల జంట 12-21, 3-21 తేడాతో సౌత్ కొరియన్ జోడీ కిమ్-కాంగ్‌ల చేతిలో ఓడారు. మరో పోరులో భారత స్టార్ ద్వయం తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప 5-21, 21- 18, 11-21 తేడాతో రవీండా-కిటితరకుల్ చేతిలో ఓడారు.

# మూడోరౌండ్‌కు సబలెంకా, గాఫ్ జబీర్, ఫెర్నాండెజ్ ఔట్..

## • ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్


సబలెంకా


కోకా గాఫ్


జబీర్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి 2వ సీడ్, రష్యాకు చెందిన సబలెంకా, 4వ సీడ్, అమెరికాకు చెందిన కోకా గాఫ్ ప్రవేశించారు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీల్లో సబలెంకా 6-3, 6-2తో ఫ్రుట్టికోవా(చెక్)ను చిత్తుచేసింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన అరీనా సబలెంక.. చెక్ టెన్నిస్ ప్లేయర్ బ్రెండా ఫ్రహ్విర్టోవాపై అలవోక విజయం సాధించింది. ప్రత్యర్థి నుంచి ఏమాత్రం ప్రతిఘటన లేకుండానే సబలెంక మూడోరౌండ్‌కు దూసుకెళ్లింది. 2018 నుంచి ఆస్ట్రేలియా ఓపెన్ ఆడుతున్న సబలెంకాకు ఇది 17వ విజయం. 2020లో మాత్రమే ఆమె తొలి రౌండ్‌లో ఓడింది. ఇక అమెరికా సంచలనం కోకా గాఫ్ 7-6(7-2), 6-2తో సహచర క్రీడాకారిణి డోలెహైడ్‌ను చిత్తుచేయగా.. 6వ సీడ్ జబీర్(ట్యునీషియా) 0-6, 2-6తో ఆండ్రావా(రష్యా) చేతిలో, 32వ సీడ్ ఫెర్నాండెజ్(కెనడా) 5-7, 4-6తో పార్క్స్(అమెరికా) చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూశారు. ఈ మ్యాచ్ 54 నిమిషాలలోనే ముగిసినా.. జబేర్ నుంచి ప్రత్యర్థికి ఏమాత్రం ప్రతిఘటన ఎదురుకాలేదు. ఇక మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి వోజ్నియాకి 6-1, 4-6, 1-6 తేడాతో రష్యాకే చెందిన మారియా టిమోఫియా చేతిలో ఓడింది. 20ఏళ్ల టిమోఫియాకు ఇదే తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ కావడం గమనార్హం. తొలి టోర్నీలోనే ఆమె.. 2018లో ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గిన వోజ్నియాకిని ఝులక్ ఇచ్చింది.

### జకో, రుబ్లేవ్ జోరు..

పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, రుబ్లేవ్(రష్యా) సునాయాసంగా ప్రత్యర్థులను చిత్తుచేసి మూడోరౌండ్‌కు చేరారు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో జకోవిచ్ 6-3, 4-6, 7-6(7-4), 6-3తో పాపిరిన్(ఆస్ట్రేలియా)ను, 5వ సీడ్ రుబ్లేవ్ 6-4, 6-4, 6-4తో యుబాంక్స్(అమెరికా)ను ఓడించారు. ఇతర పోటీల్లో 7వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 4-6, 7-6(8-6), 6-2, 7-6(7-4)తో థాంప్సన్(ఆస్ట్రేలియా), 15వ సీడ్ ఖచనోవ్(రష్యా) 6-4, 6-3, 4-6, 6-3తో కోవాసెవిక్(అమెరికా)ను ఓడించారు. మరో ఐదుసెట్ల హోరాహోరీ పోరులో మసెట్టి.. సహచర అన్‌సీడెడ్ ఆటగాని చేతిలో ఓడాడు. మసెట్టి 3-6, 6-3, 7-6(7-5), 3-6, 0-6తో వాన్ అస్పె చేతిలో ఓడాడు. ఇతర పోటీల్లో 4వ సీడ్ సిన్నర్(పోలండ్), 10వ సీడ్ డిమినార్ ప్రత్యర్థులను చిత్తుచేసి మూడోరౌండ్‌కు చేరారు.

# ప్రజ్ఞానంద సంచలనం

## • ప్రపంచ ఛాంపియన్ డింగ్‌పై గెలుపుతో టాప్‌లోకి..
## • టాటా మాస్టర్స్ చెస్ టోర్నీ


ప్రజ్ఞానంద

**చెన్నై:** టాటా మాస్టర్స్ టోర్నీలో చెస్ సంచలనం ఆర్. ప్రజ్ఞానంద పెను సంచలనాన్ని నమోదు చేశాడు. బుధవారం జరిగిన నాలుగో రౌండ్ పోటీలో ప్రజ్ఞానంద ప్రపంచ ఛాంపియన్ డింగ్ లిరెన్(చైనా)ను చిత్తుచేశాడు. దీంతో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత.. క్లాసికల్ చెస్ విభాగంలో ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించిన రెండో భారతీయుడిగా ప్రజ్ఞానంద నిలిచాడు. అలాగే భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించాడు. ఫిడే ర్యాంక్సింగ్స్‌లో ఆనంద్‌ను దాటిన ప్రజ్ఞానంద.. భారత టాప్ ర్యాంకర్‌గా అవతరించాడు. ఫిడే తాజా ర్యాంకింగ్స్‌లో ప్రజ్ఞానంద ప్రస్తుతం 2748.3పాయింట్లతో 11వ స్థానంలో, విశ్వనాథన్ ఆనంద్ 2748 పాయింట్లతో 12స్థానంలో కొనసాగుతున్నాడు. త్వరలో ప్రకటించే ఫిడే ర్యాంకింగ్స్‌లో ప్రజ్ఞానంద భారత్ తరఫున టాప్ ప్లేయర్‌గా అగ్రస్థానంలో నిలవనున్నాడు. గెలుపు అనంతరం ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. బలమైన ప్రత్యర్థిని ఓడించడం అంత తేలికేమీ కాదని.. అందుకే తనకు ఈ విజయం మరింత ప్రత్యేకమైందని పేర్కొన్నాడు. తొలిసారి వరల్డ్ చాంపియన్‌పై గెలుపొందడం రెట్టింపు సంతోషాన్నిస్తుందని హర్షం వ్యక్తం చేశాడు.

### అదానీ, సచిన్ ప్రశంసలు

కాగా భారత టాప్ ర్యాంకర్‌గా నిలిచిన ప్రజ్ఞానందపై పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ తదితరులు ఎక్స్ వేదికగా ప్రజ్ఞానందను అభినందించారు. "నిన్ను చూసి దేశం గర్విస్తోంది" అంటూ కితాబులిచ్చారు.

# 54బంతుల్లో 147పరుగులు

## • రోహిత్ సెంచరీ • రింకు అర్ధసెంచరీ • భారత్ 212/4 • ఆఫ్ఘనిస్తాన్‌తో మూడో టి20


రోహిత్ శర్మ

**బెంగళూరు:** చిన్నస్వామి స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన చివరి టి20లో టీమిండియా భారీస్కోర్‌ను నమోదు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ సెంచరీకి తోడు, రింకూ సింగ్ అర్ధసెంచరీ తోడవ్వడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 212పరుగులు చేసింది. తొలుత టాపార్డర్ విఫలమైనా రోహిత్ శర్మ (121నాటౌట్; 69బంతుల్లో 11ఫోర్లు, 8సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఆరంభంలో ఆచితూచి ఆడిన హిట్ మ్యాన్.. ఆఖరి ఓవర్లలో తన మార్కు ఆట ఆడి శతకం బాదాడు. 64 బంతుల్లోనే సెంచరీ చేసిన రోహిత్‌కు ఇది టి20లలో ఐదో శతకం. రోహిత్‌కు తోడుగా నయా ఫినిషర్ రింకూ సింగ్ (69నాటౌట్, 39బంతుల్లో, 2ఫోర్లు, 6సిక్సర్లు) తోడైంది. అఫ్ఘన్ పేసర్ ఫరీద్ అహ్మద్.. ఆరంభ ఓవర్లలోనే భారత్‌కు భారీ షాకులిచ్చాడు. నాలుగు ఓవర్లు వేసిన అతడు 20 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీశాడు. అజ్మతుల్లా ఓమర్‌జయ్ రాణించాడు.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఫరీద్ అహ్మద్ మూడో ఓవర్లోనే షాక్ ఇచ్చాడు. మూడో బంతికి యశస్వి జైస్వాల్(4) భారీ షాట్ ఆడబోయి నబీ చేతికి చిక్కాడు. ఆ మరుసటి బంతికే కోహ్లి మిడాఫ్‌లో ఇబ్రహీం జద్రాన్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. అజ్మతుల్లా వేసిన నాలుగో ఓవర్లో భారత్‌కు మరో షాక్ తాకింది. ఆ ఓవర్ చివరి బంతికి.. శివమ్ దూబే(1) వికెట్ కీపర్ గుర్బాజ్ సూపర్ క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. సంజూ శాంసన్(0) కూడా మరోసారి నిరాశపరిచాడు. ఫరీద్ వేసిన ఐదో ఓవర్లో శాంసన్.. నబీకి క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ ఐదు ఓవర్లలో 22 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో భారత జట్టును కెప్టెన్ రోహిత్ శర్మ, రింకూ సింగ్ ఆదుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 90బంతుల్లో 195పరుగులు జోడించారు. ఆరంభంలో తడబడ్డ రోహిత్.. భారత్ వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఆచితూచి ఆడాడు. ఖాయిస్ అహ్మద్ వేసిన 9వ ఓవర్లో ఎల్బీ నుంచి రింకూ బయటపడ్డాడు. దీంతో 11 ఓవర్లు ముగిసేసరికి భారత్ 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులే చేసింది. సలీం వేసిన 16వ ఓవర్లో రోహిత్.. 4, 6 బాదగా రింకూ కూడా ఓ బౌండరీ రాబట్టాడు. కరీమ్ జనత్ వేసిన 17వ ఓవర్లోనూ రోహిత్ 4, 6 తో స్కోరు వేగాన్ని పెంచాడు. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో సిక్సర్ బాది 90లలోకి వచ్చిన రోహిత్.. వరుసగా రెండు బౌండరీలు బాది పొట్టి ఫార్మాట్‌లో ఐదో శతకాన్ని పూర్తిచేశాడు. ఇదే ఓవర్లో ఆఖరి బంతికి సిక్సర్ కొట్టిన రింకూ.. 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ఆఖరి ఓవర్లో రోహిత్.. 4, 6, 4 తో పాటు రింకూ కూడా హ్యాట్రిక్ సిక్సర్లు బాదడంతో భారత్ 200 పరుగుల మైలురాయిని దాటింది. ఇన్నింగ్స్ చివరి 12బంతుల్లో రోహిత్-రింకూ సింగ్ కలిసి 58పరుగులు రాబట్టారు. అదే క్రమంలో వీరిద్దరూ కలిసి టి20ల్లో ఓ వికెట్‌కు అత్యధిక పరుగుల భాగస్వామ్యం (190పరుగులు) రికార్డు నెలకొల్పారు. అంతకు ముందు ఇది సంజు-హుడా (176పరుగులు) పేరిట ఉండగా.. తాజాగా వీరిద్దరూ ఆ రికార్డును బ్రేక్ చేశారు.

### స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)నబి (బి)ఫరీద్ అహ్మద్ 4, రోహిత్ శర్మ (నాటౌట్) 121, కోహ్లి (సి)ఇబ్రహీం (బి)ఫరీద్ 0, దూబే (సి)గుర్బాజ్ (బి)అజ్మతుల్లా 1, సంజు శాంసన్ (సి)నబి (బి)ఫరీద్ అహ్మద్ 0, రింకు సింగ్ (నాటౌట్) 69, అదనం 17. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 212పరుగులు.

**వికెట్ల పతనం:** 1/18, 2/18, 3/21, 4/22

**బౌలింగ్:** ఫరీద్ అహ్మద్ 4-0-20-3, అజ్మతుల్లా 4-0-33-1, ఖ్వీస్ అహ్మద్ 4-0-28-0, మహ్మద్ సలీమ్ 3-0-43-0, షరాఫుద్దీన్ 2-0-25-0, కరీమ్ జనత్ 3-0-54-0

# నవచిత్రం

## స్ఫూర్తిని చాటే దేశ భక్తి గీతం వందేమాతరం..


వరుణ్ తేజ్


వరుణ్ తేజ్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. ఈ చిత్రంలోని దేశభక్తి గీతం వందేమాతరంను వాఘా బోర్డర్‌లో లాంచ్ చేశారు.
ఎయిర్ ఫోర్స్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతున్న ఈచిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'వందేమాతరం'ను అమృతసర్‌లోని ఐకానిక్ వాఘా సరిహద్దులో లాంచ్ చేసి మొట్టమొదటి పాటగా చరిత్ర సృష్టించింది. ఫస్ట్ స్ట్రైక్ వీడియో అద్భుతమైన విజయాన్ని సాధించిన తరువాత, ఈ పాటను రిపబ్లిక్ డే వారంలో వరుణ్ తేజ్, మానుషి చిల్లార్‌తో సహా మొత్తం టీమ్ సమక్షంలో లాంచ్ చేశారు
టైటిల్ సూచించినట్లుగా వందేమాతరం స్ఫూర్తిని చాటే దేశభక్తి గీతం. వైమానిక దళ సైన్యం పెద్ద యుద్ధానికి సన్నద్ధమవుతున్నట్లు చూపే ఈ పాట తమ దేశ రక్షణకు పోరాడే ధైర్యవంతులందరికీ నివాళి. ఈ పాట గొప్ప ఉత్తేజాన్ని కలిగిస్తూ, గర్వంగా నిలబడేలా స్ఫూర్తిని కలిగిస్తుంది. ఈ చిత్రంతో హిందీలో అరంగేట్రం చేస్తున్న వరుణ్ తేజ్ ఈ పాటలో యూనిఫాంలో ఫిట్‌గా, అద్భుతంగా కనిపించారు. తెలుగులో అరంగేట్రం చేస్తున్న మానుషి చిల్లర్ యుద్ధంలో ఉన్న తన బాయ్ ఫ్రెండ్ (వరుణ్ తేజ్) గురించి ఆందోళన చెందే రాడార్ ఆఫీసర్‌గా కనిపించింది. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యం శక్తివంతమైన పదాలతో గొప్ప ఉత్తేజం, ఉత్సాహం నింపింది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ పాటను తెలుగులో అనురాగ్ కులకర్ణి, హిందీలో సుఖ్విందర్ సింగ్ చక్కగా పాడారు. అద్భుతమైన కంపోజిషన్, దేశభక్తి పంక్తులు, మంత్రముగ్ధులను చేసే వోకల్స్, కట్టిపడేసే విజువల్స్‌తో 'వందేమాతరం..' పాట బ్లాక్ బస్టర్ నంబర్ అవుతుంది అని చిత్ర బృందం తెలిపింది.
ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ సందీప్ ముద్దా నిర్మించారు. నందకుమార్ అబ్బినేని, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ (వకీల్ ఖాన్) సహ నిర్మాతలు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీలో ఫిబ్రవరి 16న విడుదల కానుంది.

## హను-మాన్ అద్భుతం : బాలకృష్ణ


ప్రశాంత్ వర్మ, బాలకృష్ణ, నిరంజన్ రెడ్డి

"హను- మాన్' చిత్రం కన్నుల పండగలా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునేలా చిత్రాన్ని అద్భుతంగా తీశారు' అని హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హను-మాన్'. ఈనెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అందర్నీ ఆకట్టుకుని ఎపిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. తాజాగా ఈ చిత్రాన్ని నందమూరి బాలకృష్ణ వీక్షించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఇందులో అద్భుతమైన కంటెంట్ వుంది. ఇప్పుడున్న టెక్నిక్‌ని బ్రహ్మాండంగా వాడుకొని దర్శకుడు చాలా అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. హను-మాన్ కన్నుల పండగలా ఉంది. శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రేక్షకులకు అద్భుతమైన చిత్రాన్ని అందించారు. సినిమా మేకింగ్‌లో చాలా ప్యాషన్ కనిపించింది. చిత్ర నిర్మాతని కూడా కెప్టెన్ అఫ్ ది షిప్ అనాలి. సినిమా తీయడానికి రెండున్నరేళ్ళు పట్టిందంటే మామూలు విషయం కాదు. ఇలా చేయాలంటే చాలా ప్యాషన్ కావాలి. అన్ని క్రాఫ్ట్స్ అద్భుతమైన పనితీరు కనపరిచాయి. డైరెక్షన్, ఫోటోగ్రఫీ, వీఎఫ్ఎక్స్, మ్యూజిక్, నటీనటులు.. ఇలా అందరూ ఎక్స్‌ట్రార్డినరీగా పెర్ఫార్మ్ చేశారు. అన్నీ వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునేలా చేశారు. టీం అందరికీ అభినందనలు. హనుమాన్ సెకండ్ పార్ట్ కోసం ఎదురుచూస్తున్నాను' అని అన్నారు
ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మాత కె నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులతో పాటు విమర్శలు ప్రసంశలు అందుకొని బాక్సాఫీసు వద్ద రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. సంక్రాంతి బరిలోకి దిగిన ఈ సినిమా కలెక్షన్లు మహేష్‌బాబు గుంటూరుకారం, వెంకటేష్ సైంధవ్, నాగార్జున నా సామిరంగ చిత్రాలతో పోలిస్తే టెర్రిఫిక్‌గా ఉండటం విశేషం.

## కెప్టెన్ మిల్లర్ 25న తెలుగులో రిలీజ్


ధనుష్

ధనుష్ నటించిన మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈనెల 25న తెలుగు రాష్ట్రాల్లో ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది.
ఈనెల 12న సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ రిపోర్ట్స్ అందుకుంది. ఇదిలా ఉంటే, లేటెస్ట్‌గా హీరోలు నాగార్జున, వెంకటేష్ తమ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ఈ చిత్ర తెలుగు థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.
ధనుష్‌ను టైటిల్ రోల్‌లో కెప్టెన్ మిల్లర్‌గా పరిచయం చేస్తూ, బ్రిటిష్ పాలనలో భారతదేశంలోని స్వాతంత్ర్యానికి ముందు కాలంలోకి మనల్ని తీసుకువెళుతుందీ ట్రైలర్. ధనుష్ తన గ్రామాన్ని దోచుకోవడానికి ప్రయత్నించే వలసవాదులను ఎదుర్కొంటూ స్థానిక తిరుగుబాటు నాయకుడిగా కనిపించారు. అతన్ని బ్రిటీష్ వారు డెకాయిట్ అని, స్థానికులు దేశద్రోహి అని పిలుస్తారు. ధనుష్ యాక్షన్స్ ఇతరుల ప్రవర్తనపై ఆధారపడి ఉందని ట్రైలర్ ద్వారా స్పష్టమైంది. ధనుష్ డిఫరెంట్ అవతార్స్‌లో కనిపించారు. అద్భుతమైన నటనను కనపరిచి సినిమాను తన భుజాలపై నడిపారు. ప్రియాంక మోహన్ కథానాయికగా నటించగా, సందీప్ కిషన్, శివ రాజ్ కుమార్ కూడా ట్రైలర్‌లో ఆకట్టుకున్నారు. అరుణ్ మాథేశ్వరన్ కథను ఆసక్తికరంగా మలిచారు. ధనుష్‌ని మునుపెన్నడూ లేని విధంగా ఇంటెన్స్, యాక్షన్ అవతార్‌లో చూపించారు. సిద్ధార్థ నుని కెమెరా పనితనం అద్భుతంగా ఉంది. జివి ప్రకాష్ కుమార్ తన అద్భుతమైన స్కోర్‌తో విజువల్స్‌ను ఎలివేట్ చేశారు. ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను టి.జి. త్యాగరాజన్ సత్యజ్యోతి ఫిల్మ్స్, సెంధిల్ త్యాగరాజన్,అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి.
ఈ చిత్రాన్ని జి. శరవణన్, సాయి సిద్ధార్థ్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మొత్తానికి ట్రైలర్ అంచనాలు మరింతగా పెంచింది. ఈ చిత్రానికి టి రామలింగం ప్రొడక్షన్ డిజైనర్. బాహుబలి ఫ్రాంచైజీ, ఆర్ఆర్ఆర్, పుష్ప వంటి చిత్రాలకు పనిచేసిన మధన్ కార్కీ ఈ చిత్రం తమిళ వెర్షన్‌కు డైలాగ్స్ రాశారు.

## హాలీవుడ్ స్థాయిలో అయలాన్


శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'అయలాన్'. రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్. ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని కెజెఆర్ స్టూడియోస్ పతాకంపై కోటపాడి జె.రాజేష్ నిర్మించగా, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించారు. ఈ నెల 12న సంక్రాంతి కానుకగా తమిళనాడులో విడుదలైంది.
అయలాన్ అంటే ఏలియన్. ఏలియన్ ఓ ప్రధాన పాత్రలో దక్షిణాది భాషల్లో సినిమా రావడం ఇదే తొలిసారి. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న తెలుగులో విడుదల చేయనున్నట్లు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్న గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలియజేసింది. తెలుగులోనూ సూపర్ డూపర్ హిట్ అందుకున్న 'వరుణ్ డాక్టర్' సినిమా తర్వాత శివ కార్తికేయన్, కెజెఆర్ స్టూడియోస్, గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. తమిళనాడులో 'అయలాన్' సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. కేవలం నాలుగు రోజుల్లో రూ .50 కోట్లు కలెక్ట్ చేసింది. ఈ వారంలో వంద కోట్ల మార్క్ చేరువ కానుంది.
కోటపాడి జె. రాజేష్ మాట్లాడుతూ, 'హాలీవుడ్ స్థాయికి ఏమాత్రం తీసిపోని సినిమా ఇది. ఏఆర్ రెహమాన్ గారి పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి' అని తెలిపారు.

## మెప్పించే భిన్న కాన్సెప్ట్


ప్రీతి పగడాల

ఇప్పటి వరకు భారతీయ సినిమాలో ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి ఉంటారు. కాని తొలిసారిగా పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. ఈచిత్రాన్ని వేసవి కానుకగా మేకర్స్ రిలీజ్ చేస్తున్నారు.

హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఫియర్'. బుధవారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ఈ సినిమా లాంచ్ అయింది. ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు హరిత గోగినేని ఈ మూవీని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ పూజా కార్యక్రమంలో నటులు మురళీ మోహన్ పాల్గొని స్క్రిప్ట్ అందించగా, డైరెక్టర్ కరుణాకరన్ క్లాప్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తేజ కాకుమాను, హీరో సోహైల్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.



Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.